గురువారం
10-7-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 289
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
విశాలాంధ్ర
స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

తహవ్వూర్ రాణా జుడీషియల్ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: మహారాష్ట్రలోని ముంబై 26/11 పేలుళ్ల కేసులో ప్రధాన నిందితుడైన తహవ్వూర్ హుస్సేన్ రాణా జుడీషియల్ కస్టడీ ని ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టు మరోసారి పొడిగించింది. ఇప్పటికే ఆయనకు విధించిన కస్టడీ బుధవారంతో ముగియడంతో రాణాను వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా కోర్టు ముందు హాజరుపరిచారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 13 వరకు కస్టడీని పొడిగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు ఉగ్రదాడి కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ పాటియాలా హౌస్ కోర్టులో అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో తహవ్వూర్ రాణా పేరును ఛార్జిషీట్‌లో పొందుపరిచింది. ఎన్ఐఏ దాఖలు చేసిన ఈ ఛార్జిషీట్‌ను ఆగస్టు 13న కోర్టు పరిశీలించనుంది.

హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహనరావు అరెస్ట్

విశాలాంధ్ర-హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్మోహనరావుతో పాటు మరొకరిని సీఐడీ అరెస్ట్ చేసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్), హెచ్‌సీఏ వివాదంలో ఈ మేరకు చర్యలు తీసుకుంది. విజిలెన్స్ నివేదిక ఆధారంగా ఇటీవల సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ క్రమంలో బుధవారం జగన్మోహనరావును అరెస్ట్ చేశారు. గత ఐపీఎల్ సీజన్‌లో ఎస్‌ఆర్‌హెచ్-హెచ్‌సీఏ మధ్య టికెట్ల వివాదం నెలకొంది. మ్యాచ్ టికెట్లు కేటాయించలేదని కార్పొరేట్ బాక్స్‌కు హెచ్‌సీఏ అధికారులు తాళాలు వేశారు. ఈ

- మిగతా 2 లో

అంతరిక్షంలో రైతుగా శుభాంశు

న్యూఢిల్లీ : భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో వివిధ పరిశోధనలు చేస్తున్నారు. తాజాగా ఆయన ఐఎస్ఎస్‌లో రైతు అవతారం ఎత్తారు. రోదసిలో గురుత్వాకర్షణ లేని పరిస్థితుల్లో మెంతి, పెసర సాగుపై ఉండే ప్రభావాలపై అధ్యయనం చేస్తున్నారు. ఇందులో భాగంగా చిన్నపాటి గాజు పాత్రల్లో మెంతి, పెసర విత్తనాలను వేసి... ఐఎస్ఎస్‌లోని నిల్వ ఫ్రీజర్‌లోఉంచి, జీరో గ్రావిటీలో అవి ఏ విధంగా మొలకెత్తుతాయనే విషయాన్ని అధ్యయనం చేశారు. వాటికి సంబంధించిన ఫొటోలను

- మిగతా 2 లో

మోదీకి 'నమీబియా' పురస్కారం

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ మరో ఘనత సాధించారు. నమీబియా అత్యున్నత పౌర పురస్కారాన్ని పొందారు. నమీబియా పర్యటనలో భాగంగా ఆ దేశ పార్లమెంటునుద్దేశించి ప్రసంగించారు. అంతకుముందు 'ఆర్డర్ ఆఫ్ ది మోస్ట్ ఏన్షియంట్ వెల్‌విట్షియా మిరాబిలిస్'తో ఆయనను నమీబియా అధ్యక్షురాలు నెతుంబో నంది-దైత్వా సన్మానించారు. ఈ అవార్డు అందుకున్న తొలి భారత ప్రధానిగా మోదీ నిలిచారు. మోదీకి ఇది 27వ అంతర్జాతీయ పురస్కారం.ఐదు దేశాల పర్యటనలో భాగంగా నమీబియా

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అయ్యలారా! మీరు తిట్టుకున్న బూతులు చాలు, కాస్త నాకోసం ఆలోచించండి!

పట్నాలో సార్వత్రిక సమ్మెలో రాజా, రాష్ట్ర సీపీఐ నాయకులు,కార్మిక శ్రేణులు

విజయవాడలో భారీ ప్రదర్శన

స్తంభించిన భారత్

కదం తొక్కిన కార్మిక, ఉద్యోగ వర్గం

మోదీ సర్కారు కార్మిక-కర్షక-ప్రజా వ్యతిరేక విధానాలపై పెల్లుబికిన నిరసనలు

- రోడ్డు-రైల్ రోకోలతో నిలిచిన రవాణా
- బెంగాల్‌లో స్వల్ప ఉద్రిక్తత: అరెస్టులు
- బీహార్‌లో 'ఇండియా' ర్యాలీ-చక్కాజామ్
- సార్వత్రిక సమ్మె విజయవంతం

న్యూఢిల్లీ: కేంద్ర కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జనాగ్రహం పెల్లుబికింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న కొత్త కార్మిక చట్టాలు రద్దు, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేత, కనీస వేతనం, కనీస పెన్షన్ అమలు తదితర డిమాండ్లపై కార్మిక, కర్షక, ఉద్యోగ వర్గాలు కదం తొక్కాయి. మోదీ ప్రభుత్వ వినాసకర ప్రజా- రైతు-కార్మిక వ్యతిరేక విధానాలను నిరసించాయి. సమ్మె ప్రభావంతో దేశ వ్యాప్తంగా వాణిజ్య సముదాయాలు మూతబడ్డాయి. రవాణా నిలిచిపోయింది. బ్యాంకుల్లో కార్యకలాపాలు స్తంభించాయి. కార్మికులు-కర్షకులు ఐక్యంగా గళమెత్తారు. రోడ్లను దిగ్బంధించారు. రైల్ రోకోలు నిర్వహించారు. ఇండియా ఐక్య సంఘటన అధ్వర్యంలో బీహార్‌లో చక్కా జామ్ జరిగింది. ఆ రాష్ట్రంలో ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా భారీ ర్యాలీని నిర్వహించారు. మోదీ విధానాలను, ఎన్నికల సంఘం వైఖరిని సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్), కాంగ్రెస్, ఆర్జేడీ తదితర ప్రతిపక్ష పార్టీల నాయకులు ఎండగట్టారు. ప్రజలకు వ్యతిరేకంగా, కార్పొరేట్లకు అనుకూలంగా అనుసరించే విధానాలను వ్యతిరేకించారు. మోదీ ప్రభుత్వ నిరంకుశత్వాన్ని ఎండగట్టారు. నాలుగు లేబర్ కోడ్ల రద్దు, ఎంఎస్‌పీకి చట్టబద్ధత తదితర రైతులు, కార్మికుల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నూతన కార్మిక చట్టాలు, ప్రైవేటీకరణ చర్యల్ని వ్యతిరేకిస్తూ 35 కోట్ల మందికిపైగా కార్మికులు, రైతులు సమ్మెలో పాల్గొన్నారు. రైతు సంఘాలతో పాటు బ్యాంకింగ్, రవాణా, ఇతర ప్రభుత్వ సేవల సంఘాల మద్దతుతో అన్ని రాష్ట్రాల్లో నిరసన ప్రదర్శనలు భారీ ఎత్తున జరిగాయి. పోస్టల్, మైనింగ్, నిర్మాణం, రవాణా రంగాల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు సమ్మెకు

- మిగతా 2 లో

కోల్‌కతాలోని జాదవ్‌పూర్ వర్సిటీ ఎదుట వామపక్ష విద్యార్థుల మానవహారం

తిరుపతి కార్మికుల ప్రదర్శనలో నారాయణ

ప్రజావ్యతిరేక విధానాలు

అడ్డుకుందాం

- మోదీ పాలనలో ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేట్‌పరం: కూనంనేని
- హైదరాబాద్‌లో నిరసన ర్యాలీ విజయవంతం

2 లో

ప్రదర్శనలో ప్రసంగిస్తున్న కూనంనేని, పశ్య పద్మ తదితరులు

బీహార్‌లో 'ఇండియా' ర్యాలీలో తేజస్వీ, రాజా, రాహుల్, దీపాంకర్ తదితరులు

ఎస్ఐఆర్ అంటే

'ఓట్ బందీ'

పేదల ఓటు హక్కు దోపిడీయే లక్ష్యం: డి.రాజా

- జాబితాల నుంచి పేర్లు తొలగింపు ప్రమాదకర చర్య
- రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం
- బీహార్‌లో బీజేపీ దాదాగిరి సాగనివ్వొద్దు- 'ఇండియా' నాయకుల పిలుపు
- ఈసీకి వ్యతిరేకంగా భారీ ర్యాలీ
- సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు

2 లో

పెట్టుబడులకు

తెలంగాణ స్వర్గధామం

- ఆధునీకత... అభ్యుదయానికి కేంద్రం
- సీఎఫ్‌వోలు సంస్థలకు మార్గదర్శకులు
- పారిశ్రామికరంగం ప్రభుత్వంలో భాగస్వామ్యం కావాలి: భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: ఆధునీకత, అభ్యుదయానికి కేంద్రంగా తెలంగాణ రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సోమాజిగూడలోని ఓ ప్రైవేటు హోటల్లో 'కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ' అధ్వర్యంలో బుధవారం సీఎఫ్‌ఓల (చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్స్) సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన భట్టి మాట్లాడుతూ... ఔటర్ రింగ్ రోడ్డు ఫలితాలను చూసాం, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రీజినల్ రింగ్ రోడ్డును ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఫార్మా, ఐటీ కంపెనీలతోపాటు హౌసింగ్, అగ్రికల్చర్, హ్యాండ్లూమ్స్ వంటి అనేక రకాల పారిశ్రామిక క్లస్టర్ల నిర్మాణం జరుగుతుందని వివరించారు. లండన్‌లోని థేమ్స్ నది మాదిరిగా మూసీ పునర్జీవనం ప్రాజెక్టు చేపట్టినట్టు పేర్కొన్నారు. పెట్టుబడులకు హైదరాబాద్ స్వర్గ ధామం అన్నారు. నైపుణ్యం ఉన్న మానవ వనరులను సృష్టించడమే లక్ష్యంగా రాష్ట్రంలోని 100 ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చామని వివరించారు. త్వరలో ఫ్యూచర్ సిటీ ఫోర్త్ సిటీగా అందుబాటులోకి రాబోతుందని తెలిపారు. అక్కడ పరిశ్రమల ఏర్పాటుకు ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిలో పారిశ్రామికవేత్తలు కీలకం అన్నారు. అభివృద్ధికి, ఉపాధి కల్పన, సంపద సృష్టికి వారి సలహాలు సూచనలు స్వీకరించి అమలు చేస్తామన్నారు. సీఎస్ఆర్ నిధులను పాఠశాలలు, నాలెడ్జ్ సెంటర్ల కోసమే కాకుండా రైతులు, మహిళల ప్రగతి కోసం కూడా ఖర్చు చేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. సీఎఫ్ఓలు సంస్థల దశను

- మిగతా 2 లో

కేసీఆర్, జగన్ అనుబంధం

తెలంగాణకు తీరని నష్టం

- సీమాంధ్ర పాలకుల కంటే వెయ్యి రెట్లు ద్రోహం
- కృష్ణా జలాల దోపిడీ ఏపీకి ఇచ్చారు: రేవంత్ ధ్వజం

విశాలాంధ్ర-హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్ అనుబంధం ఎలాంటిదైనా తెలంగాణకు తీరని నష్టం జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలకు మరణశాసనం రాసే అధికారం కేసీఆర్‌కు ఎవరూ ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వం వాదించి ఉంటే హైదరాబాద్‌కు తాగునీరు సాధించేవాళ్లమన్నారు. కృష్ణా జలాల అంశంపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌కు సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'బేసిన్లు లేవు... భేషజాలు లేవని కేసీఆర్ గతంలో అన్నారు. గోదావరి నుంచి మూడు వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని చెప్పారు. గోదావరి, కృష్ణా, పెన్నా బేసిన్ వరకు నీళ్లు తరలించుకోవచ్చన్నారు. రాయలసీమను రతనాల సీమ చేస్తామన్నారు. జగన్‌కు సూచనలతో పాటు టెండర్లు, జీవోలు ఇచ్చేలా సహకరించారు. ఉమ్మడి కోటా నుంచి హైదరాబాద్‌కు తాగునీరు జలాలను వేరు చేయాల్సి ఉంది. నగరంలో ఏపీ ప్రజలు 20 శాతం వరకూ ఉన్నారు. హైదరాబాద్‌కు ఉమ్మడి జలాల నుంచి తాగునీరిచ్చేలా కేసీఆర్ చర్చించాల్సింది. మిగిలిన జలాలను పరివాహక ప్రాంతాలకు పంపకాలు చేసి ఉంటే బాగుండేది. తుంగభద్ర, కృష్ణా, బీమా జలాలు తొలుత గద్వాలకు వస్తాయి. తెలంగాణకు వచ్చిన వెంటనే ఒడిసి పట్టుకోవాల్సి ఉంది. వెంటనే పాలమూరు-రంగారెడ్డి, నల్గొండ ఇతర ప్రాంతాలకు తరలించాలి. తెలంగాణ వదిలితేనే ఏపీ ప్రాజెక్టులకు నీళ్లు వెళ్తాయి. రాష్ట్రానికి వచ్చినప్పుడు వదిలేసి ఏపీ నుంచి తిరిగి వచ్చాక చివరకు తీసుకునేలా చేశారు. రాయలసీమకు వెళ్లిన జలాలను ఏపీ ఒడిసి

- మిగతా 2 లో

గుజరాత్‌లో కుప్పకూలిన వంతెన

13 మంది మృతి

గుజరాత్‌లోని వదోదర జిల్లాలోని పద్రా పట్టణం సమీపంలో నాలుగు దశాబ్దాల నాటి వంతెనలో ఒక భాగం కుప్పకూలింది. బుధవారం ఉదయం జరిగిన ఈ ఘటనలో ఒక చిన్నారి సహా 13 మంది మృతిచెందారు. మరో తొమ్మిది మందిని రక్షించినట్లు అధికారులు తెలిపారు.

5 లో

ఆందోళనకారుల్ని కాల్చివేయండి

షేక్ హసీనా ఆదేశం... ఫోన్ కాల్ లీక్

ఢాకా: బంగ్లాదేశ్‌లో గత సంవత్సరం జరిగిన సామూహిక నిరసనల సందర్భంగా విద్యార్థులపై కాల్పులు జరపాలని అప్పటి ప్రధానమంత్రి షేక్ హసీనా భద్రతా బలగాలను ఆదేశించినట్లుగా ఆమె మాట్లాడిన ఓ ఫోన్‌కాల్ ఆడియో క్లిప్పింగ్ బయటకొచ్చింది. దీనిని బీబీసీ ధ్రువీకరిస్తూ లీక్ అయిన ఫోన్ కాల్ గురించి నివేదించింది. ఆందోళనకారులపై కనిపిస్తే కాల్చివేయాలని చెబుతున్నట్లు సదరు ఆడియోలో ఉంది. జులై 18, 2024న ఢాకాలోని తన అధికారిక నివాసం నుండి చేసిన ఫోన్ కాల్‌లో "నేను వారందరినీ ఈ రాత్రి అరెస్టు చేయాలని ఆదేశించాను. అందరికీ సమాచారం అందింది. మీరు వారిని పట్టుకోండి. నేను బహిరంగ ఉత్తర్వు జారీ చేశాను. ఇప్పుడు, వారు ప్రాణాంతక ఆయుధాలను ఉపయోగిస్తారు. వారు కనిపిస్తే కాల్చివేయండి" అని ఫోన్ కాల్‌లో షేక్ హసీనా చెప్పారు. సివిల్ సర్వీస్ ఉద్యోగాల్లో బంగ్లాదేశ్ విముక్తి పోరాటంలో పోరాడిన కుటుంబాలకు రిజర్వేషన్లు కల్పించడంపై గతేడాది పెద్ద ఎత్తున ఉద్యమం ప్రారంభమైంది. చివరకు ఈ అల్లర్లు షేక్ హసీనా పదవి పోవడానికి కారణమైంది. ఈ అల్లర్ల అణచివేతలో 1400 మంది వరకు మరణించినట్లు చెబుతున్నారు. 1971 యుద్ధం తర్వాత బంగ్లాదేశ్‌లో దారుణమైన హింస ఇదే. మానవత్వానికి విరుద్ధంగా జరిగిన నేరాలకు సంబంధించి షేక్ హసీనాపై బంగ్లాదేశ్ లో కేసులు ఫైల్ చేశారు. అయితే, ఇప్పుడు ఈ ఆడియో లీక్‌ని ఉపయోగించుకోవాలని బంగ్లా ప్రాసిక్యూటర్లు ఆలోచిస్తున్నారు. ఆగస్టు 5న ఢాకాలోని జత్రాబారి పరిసరాల్లో అత్యంత దారుణమైన మారణహోమం జరిగింది, అక్కడ సైన్యం ఆ ప్రాంతం నుండి వైదొలిగిన తర్వాత పోలీసులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. కొత్తగా బయటపడిన ఆధారాల ప్రకారం, కనీసం 52 మంది మరణించారు. ఇది మునుపటి నివేదిక కన్నా ఎక్కువ. హసీనాతో పాటు, మాజీ పోలీసులు, ప్రభుత్వ అధికారులతో సహా 203 మందిపై అంతర్జాతీయ క్రిమినల్ ట్రిబ్యునల్ (ఐసీటీ) నేరారోపణలు చేసింది. 73 మంది కస్టడీలో ఉన్నారు.

కొరియాల మధ్య సయోధ్యకు బాటలు

సియోల్: తన ప్రత్యర్థి ఉత్తర కొరియాతో సంబంధాలను మెరుగుపరుచుకునేలా దక్షిణ కొరియా కీలక చర్య చేపట్టింది. ఈ ఏడాది సముద్రంలో రక్షించిన ఆరుగురు ఉత్తర కొరియా పౌరులను సురక్షితంగా వారి స్వదేశానికి తిరిగి పంపినట్లు దక్షిణ కొరియా యూనిఫికేషన్ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు లీ జే-మ్యుంగ్ పరిపాలనలో ఇరు దేశాల మధ్య సయోధ్యను పెంపొందించేందుకు జరుగుతున్న ప్రయత్నాలలో ఇది ఒక ముఖ్యమైన పరిణామంగా భావిస్తున్నారు. ఈ ఏడాది మార్చి, మే నెలల్లో వేర్వేరు సమయాల్లో కొందరు ఉత్తర కొరియా పౌరుల పడవలు దారి తప్పి దక్షిణ కొరియా సముద్ర జలాల్లోకి ప్రవేశించాయి. వారిని దక్షిణ కొరియా అధికారులు రక్షించి అదుపులోకి తీసుకున్నారు. అప్పటి నుంచి వారు తమను స్వదేశానికి పంపాలని పదేపదే కోరుకుంటున్నారని, వారి పూర్తి అంగీకారంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ ఉదయం ఇరు దేశాల మధ్య ఉన్న సముద్ర సరిహద్దు రేఖ (నార్తర్న్ లిమిట్ లైన్) దాటించి వారిని ఉత్తర కొరియా అధికారులకు అప్పగించినట్లు తెలిపింది. ఈ అప్పగింత ప్రక్రియ కోసం ఉత్తర కొరియాను సంప్రదించేందుకు సియోల్ చేసిన ప్రయత్నాలు విఫలమైనప్పటికీ, చివరికి ఉత్తర కొరియా అధికారుల సహకారంతో ఇది విజయవంతంగా పూర్తయింది.

స్తంభించిన భారత్

(మొదటిపేజీ తరువాయి)

మద్దతిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా, వామపక్షాల తోడ్పాటుతో సార్వత్రిక సమ్మె అన్ని రాష్ట్రాల్లో జయప్రదం అయింది. న్యాయం కోసం, తమ డిమాండ్ల పరిష్కారం కోసం కార్మికులు, రైతులు డిమాండ్ చేశారు. తమ యూనియన్ల జెండాలతో కదం తొక్కారు. మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

బీహార్, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, అసోం, కర్నాటక, జమ్మూకశ్మీర్, జార్ఖండ్, నాగాలాండ్, తమిళనాడు, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, ఒడిశా, గుజరాత్, నాగాలాండ్, చత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, త్రిపుర తదితర రాష్ట్రాల్లో కార్మికులు, రైతులతో పాటు కలిసి విద్యార్థులు, యువజనులు కదం తొక్కారు. అన్ని రంగాల ప్రజలు మద్దతిచ్చారు. వ్యాపార -వాణిజ్య సంస్థలను స్వచ్ఛంధంగా మూసివేశారు. ప్రజా రవాణా స్తంభించింది.

బీహార్ ర్యాలీలో సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ దేశంలో ఎమర్జెన్సీ కంటే దీనస్థితి ఉందన్నారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ ప్రజలు, దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టేస్తోందని విమర్శించారు. అమెరికాకు తలొగ్గుతోందని దుయ్యబట్టారు. అగ్రరాజ్యంతో వాణిజ్య ఒప్పందం భారత్‌కు తీవ్ర నష్టం చేకూరుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశీయ మార్కెట్లు కుదేలవుతాయని, ముఖ్యంగా డెయిరీ, వ్యవసాయ రంగంపై ప్రభావం ఉంటుందని రాజా హెచ్చరించారు. మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఏకం కావాలని ప్రతిపక్షాలకు, ప్రజాస్వామ్య-లౌకిక సంఘాలకు పిలుపునిచ్చారు. బీహార్ బంద్‌తో రవాణా స్తంభించింది. రైల్ రోకోలు, రోడ్ల దిగ్బంధాలు సాగాయి. పట్నాలోని మహాత్మా గాంధీ సేతు వద్ద టైర్లు తగలపెట్టి ప్రతిపక్ష నాయకులు నిరసన తెలిపారు. సచివాలయ హాల్ట్ రైల్వే స్టేషన్‌లో రైళ్లను నిరసనకారులు నిలిపివేశారు. అరారియా, పూర్నియా, కథిహార్, ముజఫర్‌పూర్‌తో పాటు అనేక ప్రాంతాల్లో సమ్మె విజయవంతంగా సాగింది. ఆర్జేడీ, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) కార్యకర్తలు అర్వాల్, జెహానాబాద్, దర్భంగాలో రోడ్లు దిగ్బంధించారు. టైర్లు తగలపెట్టి నిరసన తెలిపారు.

దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఏఐటీయూసీ అధ్వర్యంలో నిరసన జరిగింది. వందల సంఖ్యలో కార్మికులు కదం తొక్కారు. రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్, ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య పిలుపునిచ్చారు. స్వాతంత్రానికి పూర్వం సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో నాలుగు లేబర్ కోడ్స్‌లు తేవడం వల్ల కార్మిక వర్గానికి అనేక హక్కులు అంటే 29 చట్టాలు రద్దు కాపడతాయని అందులో భాగంగా 8 గంటల పనిని 10 గంటలు చేస్తూ ప్రభుత్వాలు నిర్ణయిస్తున్నాయని మహిళలకు రాత్రి వేళల్లో పనిచేయాలని నిబంధనలు వస్తున్నాయని అమర్‌జీత్ కౌర్ తెలిపారు. ఈ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కేంద్రంలో ఎనిమిదవ వేతన సంఘం వెంటనే నియమించాలని ఆమె డిమాండ్ చేశారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగిస్తూ కార్పొరేట్ వర్గాల కొమ్ముకాస్తుందని కార్మిక చట్టాలను కార్పొరేట్లకు అనుకూలంగా మార్చి వేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తుందని అందులో భాగమే 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికుల హక్కులను కాలరాస్తుందని ఇందువల్ల కార్మిక వర్గం అనేక హక్కులను కోల్పోయిందని రావుల వెంకయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

సార్వత్రిక సమ్మె కేరళలో విజయవంతం అయింది. అన్ని జిల్లాల్లో కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొని నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. మోదీ ప్రభుత్వ విధానాలకు కార్మికులు, రైతులు, సామాన్యుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వం, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేపీ రాజేంద్రన్ పాల్గొన్నారు. ప్రజా పోరాటాలకు కేరళ కట్టుబడి ముందుకెళుతున్నట్లు నాయకులు ఉద్ఘాటించారు. తిరువనంతపురంలో రాజ్ భవన్ వరకు ర్యాలీ జరిగింది. కొచ్చిలోని బీపీసీఎల్ వర్కర్లు ధర్నా నిర్వహించారు.

బెంగాల్‌ను వామపక్షాలు స్తంభింపజేశాయి. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. దుకాణాలు మూసివేశారు. సమ్మె క్రమంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అక్కడి బస్సు డ్రైవర్లు హెల్మెట్ పెట్టుకొని విధులు నిర్వర్తించారు. పశ్చిమ బర్ధామన్‌లోని దుర్గాపూర్, ముర్షిదాబాద్‌లోని లాల్‌గోలా, డైమండ్ హార్బర్, ఉత్తర 24 పరగణాల్లో బరాక్‌పుర; హుగ్లీలోని కోన్నగర్‌లో రైల్‌రోకో జరిగింది. బస్సులను నిరసనకారులు నడవనివ్వలేదు. జాతీయ రహదారులను దిగ్బంధించారు. దీంతో పోలీసులు, ఆర్‌పీఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగి రైల్వే ట్రాక్‌లపై నుంచి నిరసనకారులను చెదరగొట్టే క్రమంలో ఘర్షణలు జరిగాయి. కలకత్తా వర్సిటీ వద్ద ఎస్ఎఫ్ఐ ఆందోళన, జాదవ్‌పూర్‌లో వామపక్షాల అధ్వర్యంలో టైర్లను తగలబెట్టి నిరసన తెలపారు. ఉత్తర 24 పరగణాలలో రిలయన్స్ జూట్ మిల్లు ప్రవేశాన్ని కార్మిక నేతలు దిగ్బంధించారు. కొన్ని చోట్ల నేతలను పోలీసులు అడ్డుకున్నారు. కార్యకర్తలను అరెస్టు చేశారు. మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సమ్మె చేస్తుంటే మమత సర్కార్ ఎందుకు అడ్డుకుంటోందని వామపక్ష నాయకులు ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగులంతా విధులకు హాజరు కావాలని మమత సర్కారు ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ, ప్రైవేటు రవాణా యధావిధిగా కొనసాగాలని ఆదేశించింది.

జమ్మూకశ్మీర్, హిమచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లా ఎరుపెక్కాయి. వేలాది మంది వీధుల్లోకి వచ్చి నిరసనల్లో పాల్గొన్నారు. తూర్పు నుంచి పశ్చిమం వరకు ఒడిశా నుంచి గుజరాత్ వరకు సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. మేఘాలయలో విద్యుత్ కార్మికులు, నాగాలాండ్‌లో ఎల్‌పీజీ బాటిలింగ్ ప్లాంట్ వర్కర్లు, చత్తీస్‌గఢ్‌లో భారత్ అల్యూమీనియం లిమిటెడ్ కార్మికులు ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించారు. అసోం నుంచి ఉత్తరాఖండ్ వరకు భవన నిర్మాణ కార్మికులు నిరసన తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోనూ ఆందోళనలు, ప్రదర్శనలు నిర్వహించారు. సముద్రంలో ఇండియన్ సీఫేర్స్ సైతం సమ్మెకు మద్దతు పలికారు. త్రిపుర స్తంభించిపోయింది. అక్కడి మార్కెట్లు మూతబడ్డాయి. వీధులు నిర్మానుష్యమయ్యాయి. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, బ్యాంకు ఉద్యోగులు సమ్మెలో భాగస్వాములయ్యారు. పంజాబ్, లూథియానా బస్టాండ్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. తమిళనాడులోనూ భారీస్థాయిలో ఆందోళనలు, ప్రదర్శనలు జరిగాయి.

మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మధురై రైల్వే స్టేషన్ ఎదుట రోడ్ రోకో జరిగింది. ఈరోడ్‌లో రోడ్ రోక్ సందర్భంగా కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. కర్నాటక రాజధాని బెంగళూరులో ఫ్రీడం పార్కు వద్ద వేలాది మంది కార్మికులు ధర్నా చేశారు. అసోంలో తేయాకు తోటల కార్మికులు, రవాణా కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. బస్సులు, ట్రక్కులు, వాణిజ్య వాహనాలు రోడ్డెక్కలేదు. గువహటిలో బస్సులతో పాటు ట్యాక్సీ సేవలు నిలిచిపోయాయి. మహారాష్ట్ర, ముంబైలో బ్యాంకు ఉద్యోగులు భారీ బ్యాక్ ర్యాలీ నిర్వహించారు. జార్ఖండ్‌లో మైనింగ్, బ్యాంకు రంగాల కార్మికుల అధ్వర్యంలో సమ్మె జరిగింది. రాంచీలో వామపక్షాలు, జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ సంయుక్త అధ్వర్యంలో రెండు ర్యాలీలు జరిగాయి. కార్మిక కోడ్ల రద్దుతో సహా 17 డిమాండ్లను నాయకులు చేశారు. సైనిక్ మార్కెట్, కుట్చేరిలో ర్యాలీలు నిర్వహించారు. అల్బర్ట్ ఎక్కా చౌక్ వద్ద బహిరంగ సభ జరిగింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి మహేంద్ర పాఠక్ మాట్లాడుతూ కార్మిక కోడ్ల రద్దు, ఒప్పందీకరణ, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కనీస వేతనాల పెంపుదల కోసం డిమాండ్ చేసినట్లు తెలిపారు.

అంతరిక్షంలో రైతుగా శుభాంశు

(మొదటిపేజీ తరువాయి)

తీశారు. ధార్వాడ్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన రవికుమార్ హోసమణి, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన సుధీర్ సిద్ధపురెడ్డి అనే ఇద్దరు శాస్త్రవేత్తల సహాయంతో శుక్లా ఈ ప్రయోగం చేశారు. భూమిపైకి వచ్చాక ఆ మొలకలలో వచ్చిన జన్యు మార్పులు, పోషక విలువలను పరిశీలించనున్నట్లు ఆక్సియం స్పేస్ వెల్లడించింది. మరొక ప్రయోగంలో శుక్లా మైక్రోఆల్గేలను అధ్యయనం చేశారు. వీటికి జీరో గ్రావిటీలో ఆహారం, ఆక్సిజన్, జీవ ఇంధనాలను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని పరిశీలించారు. స్టెమ్ సెల్ పరిశోధన, విత్తనాలపై సూక్ష్మ గురుత్వాకర్షణ ప్రభావాన్ని అధ్యయనం చేయడం, వ్యోమగాములు స్టేషన్‌లోని స్క్రీన్‌లతో సంభాషించేటప్పుడు సమాచారాన్ని విశ్లేషించే వారి మానసిక సామర్థ్యం వంటి విషయాలను గమనిస్తున్నానని, ఈ విషయాలు తనకు ఆనందాన్ని కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఖగోళంలో మానవ జీర్ణ వ్యవస్థ ఎలా పనిచేస్తుందన్న అంశంపై ఒక వీడియోను భారత విద్యార్థుల కోసం చిత్రీకరించారు. వ్యోమగాముల బృందం తమ మానసిక ఆరోగ్యంపై సైతం అధ్యయనం నిర్వహించింది.

తెలంగాణకు తీరని నష్టం

(మొదటిపేజీ తరువాయి)

పట్టుకుంటోంది. జూరాల నుంచే తెచ్చుకుంటే ఏపీ జలాలను కొల్లగొట్టే అవకాశం ఉండేది కాదు. కేసీఆర్ నిర్ణయాలు కృష్ణా పరివాహక ప్రాంతాల రైతులకు మరణ శాసనంగా మారాయి. ప్రాజెక్టుల్లో రాష్ట్రానికి వాటా వస్తే తక్కువ ధరకు విద్యుత్ దక్కేది' అని రేవంత్ స్పష్టం చేశారు. ఉమ్మడి ఏపీలో సీమాంధ్ర పాలకులు చేసిన అన్యాయానికి వెయ్యి రెట్లు కేసీఆర్ ద్రోహం చేశారని సీఎం అన్నారు. గతంలో పాలమూరు-రంగారెడ్డి సామర్థ్యాన్ని ఒక టీఎంసీకి తగ్గించారు. ఏపీ 10 టీఎంసీలతో ప్రాజెక్టులు చేపడితే పాలమూరును ఒక టీఎంసీకి తగ్గించారు. ఏడాదికి కిలోమీటర్ టన్నెల్ పూర్తిచేసి ఉంటే ఎస్ఎల్‌బీసీ పూర్తయ్యేది. గతంలో వెయ్యికోట్ల ప్రాజెక్టు అంచనా రూ.3వేల కోట్లకు పెరిగింది. 3.64 లక్షల ఎకరాలకు సాగునీరిచ్చే ఎస్ఎల్‌బీసీని పక్కన పెట్టారు. కృష్ణా జలాలను దారి దోపిడీ చేసే అవకాశం ఏపీకి ఆయనే ఇచ్చారని ధ్వజమెత్తారు. 'కేసీఆర్ ఏ తేదీ చెబితే అప్పుడు అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేస్తాం. కేసీఆర్ అసెంబ్లీకి రావాలి. ఆయన ఆరోగ్యంగా ఉండాలి. కేసీఆర్‌కు ఇబ్బంది లేకుంటే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లోనే చర్చపెడదాం. అక్కడ మాక్ అసెంబ్లీ నిర్వహిద్దాం. ఫామ్‌హౌస్‌లో భేటీకి కేసీఆర్ తేదీ నిర్ణయించి చెప్పాలి. ఎర్రవల్లికి మంత్రుల బృందాన్ని పంపిసా' అని రేవంత్ అన్నారు.

తైవాన్ భారీ సైనిక విన్యాసాలు

తమతో విలీనం తప్పదంటూ చైనా హెచ్చరిక

తైపీ: తైవాన్ అతిపెద్ద సైనిక విన్యాసాలను ప్రారంభించింది. చైనా తమపై దాడి చేస్తే ఎలా ఎదుర్కోవాలనే దానిపై 'హాన్ కువాంగ్' పేరుతో 10 రోజుల పాటు ఈ లైవ్-ఫైర్ విన్యాసాలను నిర్వహిస్తోంది. బుధవారం ఈ విన్యాసాలు ప్రారంభమయ్యాయి. తైవాన్‌ను తమ దేశంలో విలీనం చేసుకోవడం అనివార్యమని చైనా గట్టిగా హెచ్చరించిన నేపథ్యంలో తైవాన్ చర్య ఉద్రిక్తతలను మరింత పెంచింది. ఈ విన్యాసాలలో భాగంగా, చైనా మొదట తమ కమ్యూనికేషన్ వ్యవస్థలపై దాడి చేయవచ్చని అంచనా వేస్తున్న తైవాన్... అలాంటి పరిస్థితుల్లో సైన్యం ఎలా స్పందించాలనే దానిపై ప్రధానంగా దృష్టి సారించింది. సైన్యం, నౌకాదళం, వాయుసేనతో పాటు రికార్డు స్థాయిలో 22,000 మంది రిజర్విస్టులు ఈ విన్యాసాలలో పాల్గొంటున్నారు. ఉక్రెయిన్ యుద్ధం నుంచి నేర్చుకున్న పాఠాలతో వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఈ డ్రిల్స్ నిర్వహిస్తున్నామని తైవాన్ రక్షణ శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఈ విన్యాసాల్లో భాగంగా, అమెరికా నుంచి కొనుగోలు చేసిన శక్తిమంతమైన 'హిమార్స్' రాకెట్ సిస్టమ్స్‌తో పాటు, దేశీయంగా అభివృద్ధి చేసిన 'స్కై సోర్డ్' క్షిపణులను తైవాన్ తొలిసారిగా ప్రయోగించనుంది. చైనా తీరానికి కేవలం 160 కిలోమీటర్ల దూరంలో ఉన్న తమ ద్వీపంలోని ఓడరేవులను, కీలక ప్రాంతాలను ఎలా కాపాడుకోవాలనే దానిపై కూడా సైన్యం దృష్టి పెట్టింది. మరోవైపు, తైవాన్ చర్యలపై చైనా తీవ్రంగా స్పందించింది. హాన్ కువాంగ్ విన్యాసాలు కేవలం బూటకపు ప్రదర్శనలని తెలిపింది. తైవాన్ ప్రజలను రెచ్చగొట్టి, తమ స్వార్థ రాజకీయాల కోసం అధికార డీపీపీ పార్టీ ఆడుతున్న నాటకం ఇదని చైనా రక్షణ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి కల్నల్ జియాంగ్ బింగ్ పేర్కొన్నారు. తైవాన్ ఎలాంటి ఆయుధాలు ప్రయోగించినా, తమతో విలీనాన్ని అడ్డుకోలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ విన్యాసాలకు ముందు కూడా చైనా తమ గగనతల, సముద్ర జలాల వద్ద కవ్వింపు చర్యలకు పాల్పడిందని తైవాన్ రక్షణ మంత్రిత్వ శాఖ ఆరోపించింది.

మరోసారి ట్రంప్ టారిఫ్‌ల మోత

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సుంకాల మోత మోగించారు. తాజాగా ఆయన ప్రకటించిన భారీగా దిగుమతి సుంకాల విధింపు నిర్ణయాలు ప్రపంచ వాణిజ్యంపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. ఈ క్రమంలో భారత దేశానికి కూడా భారీగానే ప్రతికూలతలు ఎదురయ్యే అవకాశముంది. ట్రంప్ తాజాగా రాగి (కాపర్)పై 50 శాతం దిగుమతి సుంకం విధిస్తున్నట్లు ప్రకటించగా... ప్రజల మందులపై 200 శాతం వరకు సుంకాలు విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. 'ఈ రోజు కాపర్ విషయంలో నిర్ణయం తీసుకుంటున్నాం. దీని మీద టారిఫ్ 50 శాతం ఉండేలా చేస్తాం' అని ట్రంప్ కేబినెట్ సమావేశంలో వెల్లడించారు. ఆయన ప్రకటన అనంతరం కాపర్ ధరలు భారీగా పెరిగాయి. ఇక ఆ దేశ వాణిజ్య కార్యదర్శి హొవార్డ్ లుట్నిక్ ప్రకారం... ఈ కొత్త సుంకం జులై చివర లేదా ఆగస్టు 1న అమల్లోకి రానున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా కీలక ఔషధాలు, సెమీకండక్టర్లు, లాంబర్, క్రిటికల్ మినరల్స్ వంటి వాటిపై భవిష్యత్తులో మరింత సుంకాలు విధించే అవకాశముందని సూచించారు. ఒక సంవత్సరం లోపల ఉత్పత్తిదారులు తమ కార్యకలాపాలను అమెరికాలోకి తరలించాలి. తర్వాత వారిపై 200 శాతం సుంకాలు అమలవుతాయని ట్రంప్ హెచ్చరించారు. ఇక భారత్ కాపర్ దిగుమతుల్లో అమెరికా మూడో అతిపెద్ద మార్కెట్. 2024-25లో భారత్ మొత్తం 2 బిలియన్ డాలర్ల విలువైన కాపర్, దాని ఉత్పత్తులను ఎగుమతి చేయగా... అమెరికాకు చేసిన ఎగుమతులు 360 మిలియన్ల డాలర్లుగా ఉన్నాయి. అయితే కాపర్ వాడకం ఎనర్జీ, మానుఫ్యాక్చరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో విస్తృతంగా ఉండటంతో, అమెరికాలో డిమాండ్ తగ్గినా.. దీన్ని దేశీయ పరిశ్రమ తట్టుకునే అవకాశముంది. కానీ, అసలు ప్రభావం ఔషధ రంగంపై ఉంటుంది. అమెరికా భారత్‌కు అతిపెద్ద ఔషధ ఎగుమతి గమ్యం. 2025 ఆర్థికసంవత్సరంలో అమెరికాకు ఔషధ ఎగుమతులు 9.8 బిలియన్ డాలర్లుగా ఉంది. గతేడాది తో పోలిస్తే ఇది 21% వృద్ధి. ఇది భారత మొత్తం ఔషధ ఎగుమతుల్లో 40%. ఒకవేళ వీటిపై 200 శాతం సుంకం విధిస్తే, భారత జనరిక్ ఔషధ పరిశ్రమపై భారీ ప్రభావం ఉండనుంది. ప్రస్తుతం భారత్-అమెరికా మధ్య ఒక చిన్న స్థాయి వాణిజ్య ఒప్పందం చర్చల్లో ఉంది. ఈ ఒప్పందంలో వివిధ రంగాల సుంకాల చర్చ జరుగుతోంది. ఆగస్టు 1 నాటికి ఒప్పందం పూర్తి అయితే, కొత్తగా విధించబోయే సుంకాలు భారత మార్కెట్లను ప్రభావితం చేయకుండా ఉండే అవకాశం ఉంది.

ఎస్ఐఆర్ అంటే 'ఓట్ బందీ'

పట్నా: ఇండియా ఐక్య సంఘటన ఎల్లప్పుడు ప్రజల పక్షాన నిలుస్తుందని, అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోకుండా అండగా నిలుస్తుందని సీపీఐ, కాంగ్రెస్, ఆర్జేడీ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) తదితర ప్రతిపక్ష పార్టీల నాయకులు ఉద్ఘాటించారు. బీహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితాల నిశిత పరిశీలన (ఎస్ఐఆర్) ప్రక్రియను వ్యతిరేకించారు. పేదలు, దళితులు, వలస కూలీలు, అణగారిన వర్గాలు, మైనారిటీ ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించే ప్రమాదకర చర్యగా విమర్శించారు. ఎస్ఐఆర్ నిలిపివేతకు డిమాండ్ చేశారు.

ఎస్ఐఆర్ అంటే 'ఓట్‌బందీ' అని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా వ్యాఖ్యానించారు. పేదలు, వెనుకబడిన వర్గాల వారి ఓటు హక్కు హరణకు సాగిస్తున్న ప్రక్రియగా దుయ్యబట్టారు. 'బీహార్ మేల్కొన్నది... ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కలేరు' అని స్పష్టం చేశారు.

ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా బుధవారం బీహార్ రాజధాని పట్నాలో సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శులు డి.రాజా, ఎంఏ బేబి, దీపాంకర్ భట్టాచార్య, కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ అధ్వర్యంలో భారీ ప్రదర్శన జరిగింది. నాయకులు భుజం భుజం కలిపి వీధుల్లో తిరిగారు. వాహనంపై ఊరేగింపుగా వెళ్లారు. ఆయా పార్టీల కార్యకర్తలు వేలాది మంది కదం తొక్కారు. పట్నాలోని ఐటీ గోలంబర్ నుంచి ఈసీ కార్యాలయం వరకు మార్చ్ జరిగింది. 'ఓట్ బందీ కే ఖిలాఫ్, బీహార్ కా దహాడ్' (ఓట్ల రద్దుకు వ్యతిరేకంగా బీహార్ గర్జన) నినాదం మార్మోగింది. పది కేంద్ర కార్మిక సంఘాల పిలుపుతో తలపెట్టిన సార్వత్రిక సమ్మెతో పాటు ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ప్రదర్శనను విపక్షాలు నిర్వహించాయి. ఈ సందర్భంగా రహదారులను, రైలు మార్గాలను నిరసనకారులు దిగ్బంధించారు. మోదీ-నితీశ్ దిష్టిబొమ్మలు దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు. కార్మికులు, కర్షకులు, ప్రజలకు వ్యతిరేకంగా, కార్పొరేట్‌కు అనుకూలంగా అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకించారు. కార్మికులు, రైతులు, ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు భారీ స్థాయిలో నిరసనల్లో పాల్గొన్నారు. కొన్ని చోట్ల టైర్లను తగలపెట్టి నిరసన తెలిపారు.

ఇండియా ఐక్య సంఘటన నాయకులు ప్రసంగిస్తూ మోదీ-నితీశ్ ప్రభుత్వాలను విమర్శించారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ కేవలం పేదల ఓట్ల హరణ కోసమేనని దుయ్యబట్టారు. మహారాష్ట్ర తరహాలో బీహార్‌లోనూ ఓట్లను దోచుకొని గెలవడమే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం పనిచేస్తున్నదని విమర్శించారు. ఎస్ఐఆర్ అంటే ఓట్ బందీ అని వక్కాణించారు. ప్రజాస్వామ్యాన్ని హైజాక్ కానివ్వమన్నారు. పేదలైన ఓటర్ల పేర్లను తొలగించేందుకు ఓటర్ జాబితాల పరిశీలనను చేపట్టారంటూ దుయ్యబట్టారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని 'ఇండియా' నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఐక్యంగా ముందుకెళుతున్నట్లు వక్కాణించారు. బీజేపీ దాదాగిరి, నితీశ్ కుమార్ గోది ఆయోగ్‌ను సాగనివ్వమని స్పష్టంచేశారు.

రాహుల్ గాంధీ రాజ్యాంగం ప్రతిని పట్టుకొని మాట్లాడుతూ. 'మన రాజ్యాంగం దేశంలోని ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించింది. ఎన్నికల సంఘం బీజేపీ కోసం పనిచేస్తోంది. అది స్వయంప్రతిపత్తిగల సంస్థ అని, ఏ రాజకీయ పార్టీ పరిధిలోకి రాదన్న విషయాన్ని మరిచింది' అని విమర్శించారు. రాజ్యాంగ పరిరక్షణ బాధ్యతను విస్మరిస్తూ అధికార పక్షానికి తలొగ్గుతున్నదని దుయ్యబట్టారు. 'ఎంతటి వారైనా తప్పు చేస్తే చట్టం వదిలిపెట్టదని తెలుసుకోండి' అని ఈసీని ఉద్దేశించి రాహుల్ అన్నారు. బీజేపీ-నితీశ్ కుమార్ 'గోది ఆయోగ్'పై తిరుగుబాటుకు తేజస్వి యాదవ్ పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్-బీజేపీ-నితీశ్ సర్కారు నిరంకుశత్వానికి తెర దించాలని, ప్రజాస్వామ్యానికి తల్లి బీహార్... రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కనుమరుగు కానివ్వమన్నారు. పట్న ర్యాలీకి స్వతంత్ర ఎంపీ పప్పు యాదవ్ మద్దతిచ్చారు. ఆయన అధ్వర్యంలో సచివాలయ హాల్ట్ రైల్వేస్టేషన్ వద్ద నిరసన జరిగింది. యాదవ్ మాట్లాడుతూ 'పౌరసత్వాన్ని ఎందుకు ప్రశ్నిస్తున్నారు? అలా చేసేందుకు మీరు ఎవరు? పౌరసత్వం లేకుండా మేము ఇన్నేళ్లుగా ఓటు ఎలా వేయగలుగుతున్నాం? ఆధార్ కార్డుకుగల విలువ ఏమిటో మీరు చెప్పగలరా?' అంటూ ఎన్నికల సంఘాన్ని నిలదీశారు. ఎన్నికల సంఘాన్ని వదిలిపెట్టేది లేదని, దేశంలోని పేద ప్రజల జీవితాలను నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తేజస్వీ, రాహుల్, రాజా, దీపాంకర్ మాట్లాడుతూ 'లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా ఐక్య సంఘటనకు మహారాష్ట్రలో మెజారిటీ వచ్చినా కానీ కొద్ది నెలల తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తారుమారయ్యాయి. డేటా చూస్తే కొత్తగా కోటి మంది ఓటర్లను చేర్చినట్లు తెలిసింది. కొత్త ఓటర్లు చేరిన నియోజకవర్గాల్లో బీజేపీ గెలిచింది. ఓటర్ల జాబితాను కోరితే ఈసీ మౌనమే సమాధానమైంది. మహారాష్ట్ర తరహాలోనే బీహార్‌లో జరిగేందుకు ఇక్కడి ప్రజలు ఒప్పుకోరని వారికి (బీజేపీ) తెలియదు' అని అన్నారు. గుజరాత్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు కలిసి బీహార్ ప్రజలు ఎవరికి ఓటు వేయాలో నిర్ణయిస్తారా అది ప్రశ్నించారు. ఎన్నికల సంఘం విశ్వసనీయతను కోల్పోయిందని విమర్శించారు. ముందు పేర్లు తొలగిస్తారు ఆపై పింఛన్లు, రేషన్‌కు చెక్ పెడతారని వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం బీజేపీ-ఆర్ఎస్ఎస్‌కు ఏజెంటుగా మారిందని దుయ్యబట్టారు. చట్టాన్ని, తమ విధి ధర్మాన్ని మరిచిన ఎన్నికల సంఘం పాలక పక్షానికి వంత పాడుతోందని విమర్శించారు. గతంలో ఎన్నికల కమిషనర్‌ను పార్టీలు, సీజేఐ కలిసి నియమించేవారు కానీ ఇప్పుడు బీజేపీ ఆ పని చేస్తున్నది. ఓటు మాత్రమే కాదు మీ భవిష్యత్ కూడా దోపిడీకి కుట్ర జరుగుతోందని ప్రజలు గ్రహించాలని నాయకులు సూచించారు. ఇండియా ఐక్య సంఘటన అండగా నిలుస్తుందని, ఓటు హక్కు పరిరక్షణకు ప్రజల తరపున పోరాడుతుందని నాయకులు హామీనిచ్చారు.

ప్రజావ్యతిరేక విధానాలు అడ్డుకుందాం

విశాలాంధ్ర- హైదరాబాద్: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో చేపట్టిన నిరసన ర్యాలీ విజయవంతమైంది. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ... కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ ప్రైవేట్ పరం చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ... దేశ వ్యాప్తంగా కార్మికులు సమ్మె చేస్తున్నారని చెప్పారు. దేశంలో ప్రభుత్వ రంగ బ్యాంకులను సగంపైగా ప్రైవేట్‌పరం చేశారన్నారు. కేంద్ర కార్మిక వ్యతిరేక విధానాలపై ఆగ్రహించిన దాదాపు 30 కోట్ల మంది కార్మికులు, ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారన్నారు. బ్రిటీష్ కాలంలో సాధించుకున్న ఎనిమిది గంటల పని హక్కును మార్చేయాలన్న కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా రోజుకు 10 గంటలు పని చేయాలని ఉత్తర్వులు జారీచేసిందని, గంట విరామమని చెప్పి, క్రమేణ దాన్ని పక్కన పెట్టి 10 గంటలు మాత్రమే పని మిగులుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మోదీ అడుగు జాడలలో నడవకూడదని సూచించారు. బ్యాంకులన్నీ విలీనం చేసి... సిబ్బందిని ఎనిమిది లక్షలకు కుదించారన్నారు. 25 లక్షల మంది అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో బ్యాంకింగ్ రంగంలో ఉన్నారని పేర్కొన్నారు. పెద్దఎత్తున ప్రైవేట్‌బ్యాంకులు వచ్చాయని అన్నారు. ఎల్ఐసీలో ఉండే 12 లక్షల మంది ఉద్యోగులు ఎనిమిదితొమ్మిది లక్షలకు పరిమితమయ్యారన్నారు. సింగరేణిలో లక్ష 16 వేల మందికి నేడు 35 వేల మంది ఉన్నారన్నారు. కేంద్రం అడుగుజాడలో ఆర్టీసీ నిర్వీర్యం చేస్తున్నారన్నారు. రైల్వేను, రక్షణ రంగాన్ని కూడా ప్రైవేట్ పరం చేస్తున్నారన్నారు. పంచాయతీ కార్మికులకు ఐదు నెలల నుంచి జీతాలు లేవని అన్నారు.

ఉమ్మడి వరంగల్‌లో...

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త సమ్మెలో భాగంగా జిల్లాలో వివిధ పార్టీలు, అనుబంధ సంఘాలు, ఉద్యోగులు, కార్మికుల అధ్వర్యంలో వరంగల్‌లో భారీ నిరసన ర్యాలీలు చేపట్టారు. దేశంలోని ప్రభుత్వ ఉద్యోగులు, కార్మిక హక్కులు కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన నల్ల చట్టాలను ఉపసంహరించుకోవాలని, నాడు పోరాడి సాధించుకున్న పాత చట్టాలనే తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ శక్తుల కనుసన్నల్లో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఏళ్ల తరబడి వస్తున్న ఉద్యోగ, కార్మిక హక్కులను అణచివేసే కుట్రలో భాగంగానే నాలుగు లేబర్ కోడ్స్ తీసుకవస్తుందని ఆరోపించారు. ఇకనైనా కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని లేదంటే దేశవ్యాప్తంగా కార్మికులు ప్రజలు బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని సంఘ నేతలు హెచ్చరించారు.

ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు కనీస వేతనం ఇవ్వండి

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం)లో గత 25 ఏళ్లగా పైగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వాలు శ్రమదోపిడీ చేస్తున్నాయని కూనంనేని ఆరోపించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరా పార్క్ వరకు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ర్యాలీ నిర్వహించింది. జిల్లా నుంచి పల్లె వరకు ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు అన్యాయం చేస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వీరికి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నర్సింహ మాట్లాడుతూ.. ఎన్‌హెచ్ఎంలో పని చేస్తున్న 78 క్యాడర్ల ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం గత నెల 28న డైరెక్టరేట్ కార్యాలయంలో సమ్మె నోటీస్ ఇచ్చామన్నారు. ఎలాంటి పరిష్కారం కాలేదని, అందుకే మహాధర్నా చేపట్టినట్టు పేర్కొన్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ..కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఏడు నెలల పీఆర్‌సీ బకాయిలు అందజేయాలన్నారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సారంగుల బాలసుబ్రహ్మణ్యం, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ సిద్దిపేట రాజేశ్వరి రెడ్డి, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్, పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు ఎల్.సురేష్ నాయక్, జనగామ జిల్లా అధ్యక్షురాలు గంగరబోయిన జ్యోతి, పుట్ట మహేందర్ రావు, డాక్టర్ శ్రీనివాసు, డాక్టర్ దయానంద్, డాక్టర్ వినయ్, పార్థసారథి, నవీన్, శ్యామల, దిలీప్ కుమార్, ఎన్.శ్రీనివాస్, మమత, నరసింహులు, అశోక్, శ్రీనివాస్ సాంబరాజు, రామనాథం పాల్గొన్నారు.

పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామం

(మొదటిపేజీ తరువాయి)

నిర్దేశించే మార్గదర్శకులన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, అనలిటిక్స్, ఆటోమేషన్ ఇవన్నీ నిర్ణయాలు తీసుకునే విధానాన్ని మార్చి వేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రగతిశీల విధానాలు, మౌలిక సదుపాయాలు, నవ ఆవిష్కరణలపై స్ఫూర్తి, లైఫ్ సైన్సెస్, గ్రీన్ పవర్ పరిశ్రమల పెట్టుబడులకు తెలంగాణ ఒక ఆకర్షణీయ గమ్యంగా మార్చాయని తెలిపారు. అన్ని వర్గాల విద్యార్థులకు సమానమైన, నాణ్యమైన విద్యను అందించేందుకు ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ తో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నాం అన్నారు. ఒక్కో పాఠశాలను 25 ఎకరాల్లో రూ.200 కోట్లు వెచ్చించి నిర్మిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతలో ప్రతిభను పెంపొందించేందుకు స్కిల్ డెవలప్మెంట్, డిజిటల్ లెర్నింగ్ కేంద్రాలుగా అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఎన్నికల హామీ మేరకు అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే రూ.రెండు లక్షల వరకు రైతు రుణమాఫీ కింద రూ.21 వేల కోట్లు ఖర్చు చేసినట్టు చెప్పారు. ప్రతి సంవత్సరం రూ.20 వేల కోట్లు వడ్డీ లేని రుణాలు స్వయం సహాయక సంఘాల మహిళలకు అందిస్తున్నట్టు తెలిపారు. మొదటి సంవత్సరంలోనే రూ.21,500 కోట్లు పంపిణీ చేశామని వివరించారు. ప్రభుత్వంలో పారిశ్రామిక రంగం భాగస్వామిగా ఉండాలని పిలుపునిచ్చారు. సీఐఐ నిర్వాహకులు శేఖర్ రెడ్డి, శివ ప్రసాద్ రెడ్డి, బి.వి.ఆర్ మోహన్ రెడ్డి, ఎం.వి. నరసింహం, గౌతమ్ రెడ్డి, సమీయుద్దీన్ పాల్గొన్నారు.

హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహనరావు అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

ఘటనతో ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైదరాబాద్‌ను వదిలివెళ్లిపోతామని పేర్కొంది. జగన్మోహనరావుపై ఎస్ఆర్‌హెచ్ తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఎస్ఆర్‌హెచ్ ఫ్రాంచైజీపై హెచ్‌సీఏ అధ్యక్షుడు ఒత్తిడి తెచ్చినట్లు విజిలెన్స్ అధికారులు నిర్ధారించారు. ఆ నివేదిక ఆధారంగా సీఐడీ కేసు నమోదు చేసింది.

మోదీకి 'నమీబియా' పురస్కారం

(మొదటిపేజీ తరువాయి)

వెళ్లిన మోదీ... ఆ దేశాన్ని సందర్శించిన మూడో భారత ప్రధానిగా నిలిచారు. నమీబియా అధ్యక్షురాలితో ఆయన ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఆరోగ్య సంరక్షణ, ఇంధనం తదితర రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేసుకునేందుకు నాలుగు ఒప్పందాలు చేసుకున్నారు. ఇప్పటికే ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్ దేశాల్లో మోదీ పర్యటించారు. బ్రిక్స్ సదస్సులో పాల్గొన్నారు. అర్జెంటీనా మినహా మిగతా దేశాల అత్యున్నత పురస్కారాలను మోదీ అందుకున్నారు.

భూభారతి దరఖాస్తులను మూడు రకాలుగా విభజించి పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : భూ భారతిపై వచ్చిన దరఖాస్తుల న్నింటిని 3 రకాలుగా విభజించుకుని పరిష్కరిం చాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి రెవెన్యూ అధికారు లకు సూచించారు. సాదాబైనామాల తిరస్కరణకు గురైనవి, అంగీకరించిన దరఖాస్తులుగా మూడు భాగాలుగా విభజించుకోవాలని, ప్రతిరోజు ఈ వివరాలన్నింటినీ స్ప్రెడ్ షీట్లో పంపించాలని చెప్పారు. బుధవారం జిల్లా కలెక్టర్ నల్గొండ జిల్లా, నార్కెట్పల్లి మండల తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి మీ సేవ ద్వారా తహసిల్దార్ కార్యాలయానికి నూతన రేషన్ కార్డుల కై వచ్చిన యూనిట్లు, కొత్త దరఖాస్తుల వివరాలను ఆర్ఐ లాగిన్‌తో పరిశీలించారు. అలాగే రేషన్ కార్డులపై తహసీల్దార్ కార్యాలయంలో తీసుకొన్న చర్యలు పరిశీలించారు. భూ భారతిపై ఎన్ని దరఖాస్తులు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె తహసిల్దార్, ఆర్ఐలకు భూ భారతి దరఖాస్తుల పరిశీలన, పరిష్కారంపై సూచనలు చేశారు. ఆర్డీవో వై.అశోక్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారిశ్రవణ్, డిఈఓ భిక్షపతి, డిఎస్ఓ వెంకటేశం, మత్స్య శాఖ ఏడి చరిత ఉన్నారు.

ఏఐవైఎఫ్ జిల్లా సంయుక్త కార్యదర్శిగా ఖయ్యూమ్

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : గత 12 ఏళ్లుగా అఖిల భారత యువజన సమాఖ్య సంఘంలో పనిచేస్తు ఎన్నో ప్రజా, యువజన ఉద్యమాల్లో కీలక పాత్ర పోషిస్తూ వస్తున్న ఖయ్యూమ్ ఆ సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. రామవరం ఏఐవైఎఫ్ భగత్ సింగ్ షాక కార్యదర్శిగా కూడా పనిచేసిన ఆయన అంచలం చెలుగా సంఘంలో ఎదుగుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో బుధవారం జిల్లా పదవికి ఎంపికయ్యారు. జూలూరుపాడులో జరిగిన జిల్లా 2వ మహాసభలో ఖయ్యూమ్‌ను ఎన్నుకున్నారు. ఖయ్యూమ్ మాట్లాడుతు జిల్లా సంయుక్త కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు బాధ్యతగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావుతో పాటు జిల్లా కార్యదర్శి ఎస్ కె. షాబీర్ పాషా, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలిఉల్లా ఖాద్రీ, రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్రలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి : మంత్రి

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం ములుగు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఇన్ఫోసిస్ సంస్థచే ఏర్పాటు చేసిన కంప్యూటర్ల ల్యాబ్‌ను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, గ్రంధాలయ చైర్మన్ బానోత్ రవి చందర్‌లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటినుండే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటి సాధన దిశగా ముందుకు సాగాలని అన్నారు. తాను కూడా ప్రాథమిక, ఉన్నత విద్య జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ములుగు యందు చదువుకున్నానని తెలిపారు.

దివ్యాంగులు రెండు మోటారు వెహికల్స్‌ను పంపిణీ చేసిన మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్ కార్యాలయ ఆవరణంలో జిల్లా సంక్షేమ శాఖ, మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లాలోని అర్హులైన దివ్యాంగులు రెండు మోటారు వెహికల్స్‌ను గ్రామం కోడిసెలకుంటలోని బనోతు యాకూబ్, గ్రామం నర్సాపూర్ గుర్రం శ్రీహరిలకు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, గ్రంధాలయ చైర్మన్ బానోత్ రవి చందర్ లతో కలసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి టి.రవి, సి.డి.పి.ఓ. శిరీష, ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి నానో యురియా లిక్విడ్

విశాలాంధ్ర - గూడూరు : రైతులు మోసే బరువును తగ్గించింది. పొలాల దగ్గరికి తీసుకువెళ్లే వాహనాల కిరాయినీ మిగిల్చింది. శ్రమ ఆదా అయింది. రైతులకు అందుబాటులో నానో యురియా లిక్విడ్ ను అందుబాటులోకి వచ్చిందని గూడూరు మండల వ్యవసాయ అధికారి ఎండి.అబ్దుల్ మాలిక్ తెలిపారు. బుధవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ లిక్విడ్ ను 94 పంటల పై పిచికారి చేయొచ్చని, నైట్రోజన్ 40 వేల పిపిఎంల వరకు ఉంటుందని ఈ మందు ఎలాంటి హాని చేయాలేదని నీటిలో కలిపి వాడాలని రైతులు వాడేటప్పుడు ముఖానికి మాస్క్, గ్లౌజులు తప్పకుండా వేసుకోవాలని తెలిపారు. పర్యావరణ సమస్యల నుండి విముక్తి లభిస్తుందని మాలిక్ అన్నారు. ఏమైనా అనర్థాలు జరిగితే వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించి తగిన జాగ్రత్తలు సూచనలు తీసుకొని పాటించాలని ఆయన కోరారు.

సింగరేణి తహసీల్దార్‌గా అనంతుల రమేష్

విశాలాంధ్ర - కారేపల్లి : సింగరేణి మండల తహసీల్దార్‌గా అనంతుల రమేష్ నియమితులైనారు. కల్లూరు రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో డీఏవోగా పని చేస్తున్న రమేష్ సింగరేణి మండలానికి తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. బుధవారం సింగరేణి రెవిన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. సింగరేణి తహసీల్దార్‌గా పని చేసిన ఎస్.సంపత్ కుమార్ బదిలీపై మహబుబాబాద్ వెళ్ళారు. ఆయన స్థానంలో అనంతుల రమేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రమేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారంకు కృషి చేస్తానన్నారు. రెవిన్యూకి సంబంధించిన ఏ సమస్య ఉన్న తనను సంప్రదించాలని సూచించారు.

విజయవంతమైన సార్వత్రిక సమ్మె

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా జరిగిన సమ్మెలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సంపూర్ణంగా సమ్మె విజయవంతమైంది. జిల్లా కేంద్రం కొత్తగూడెంతో పాటు ప్రతి మండలం, పట్టణంలో కేంద్రాల్లో సర్వత్ర జాతీయ సంఘాల నాయకులు కార్యకర్తలు ఉద్యమించారు. కార్మిక కర్షక హక్కులను కాలరాస్తూ కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలు, చట్టాలు అన్నివర్గాలకు గుదిబండగా మారుతున్నాయని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా, సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, మాస్ లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు గౌని నాగేశ్వరరావు విమర్శించారు. కేంద్రప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేఖ విధానాలు, కార్మికచట్టాల సవరణ, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర కార్మిక, ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్లు, ఫెడరేషన్ల ఇచ్చిన పిలుపులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటీ రంగ సంస్థల కార్మికులు, ఉద్యోగులు బుధవారం స్వచ్ఛందంగా సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నారు. సమ్మె సందర్భంగా పట్టణంలోని ఓల్డ్ డిపో సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ అమరవీరుల స్తూపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం జరిగిన సభలో నాయకులు మాట్లాడారు. ఐదు దశాబ్దాల క్రితం పోరాటాలు, ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం యాజమాన్యాలకు, కార్పొరేట్లకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడులుగా మార్చివేసిందని, కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో కార్మికులు పనిగంటలు పరిమితి హక్కు, సంఘం ఏర్పాటు చేసుకునే హక్కు కనీసవేతనాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎనిమిది గంటల పనివిధానాన్ని రద్దు చేసి శ్రమ దోపిడీకి కేంద్రం తెరలేపిందని విమర్శించారు. ఉపాధి హామీ పథకం ద్వారా 200 రోజులు పని కల్పించి, రూ.600కూలి చెల్లించాలని విపక్షాలు డిమాండ్ చేస్తుంటే కేంద్రం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతూ కార్మికులు, ఉద్యోగులకు ఉపాధి లేకుండా చేస్తోందని ఆరోపించారు. సిపిఐ, ఏఐటీయూసీ నాయకులు నరాటి ప్రసాద్, చంద్ర నరేంద్రకుమార్, కంచర్ల జమలయ్య, వంగ వెంకట్, వాసిరెడ్డి మురళి, భూక్యా శ్రీనివాస్, రమణమూర్తి, సిపిఎం, సిఐటియు నాయకులు ఏజే రమేష్, మధు, భూక్యా రమేష్, లిక్కి బాలరాజు, న్యూ డెమోక్రసీ, మాస్ లైన్, ఇఫ్టూ, టియుసిఐ నాయకులు సంజీవ్, మల్లికార్జున్, సారంగపాణి, సురేందర్, యాకుబ్ శావలి, కెచ్చెల రంగయ్య, కందగట్ల సురేందర్, ఏఐటీయూసీ నాయకులు గౌనెమని, విజయలక్ష్మి, అమర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర బ్యూరో - ఖమ్మం : ఖమ్మంలో సార్వత్రిక సమ్మెను పురస్కరించుకుని బుధవారం బంద్ నిర్వహించారు. బంద్ ప్రశాంతంగా, సంపూర్ణంగా జరిగింది. వామపక్షాలు కార్మిక సంఘాల నేతలు బంద్ను పర్యవేక్షించారు. ఆర్టిసి బస్సులు డిపోలకు, బస్టాండ్లకు పరిమితమయ్యాయి. మధ్యాహ్నం వరకు ఆటోలు కూడా తిరగకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డా బంద్కు సహకరించడం విశేషం. బంద్ సందర్భంగా సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్) మాస్లైన్, సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ, ఏఐటియుసి, సిఐటియు, ఐఎన్టియుసి, టియుసిఐ, బిఆర్టియు తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అగ్రభాగాన బాగం హేమంతరావు, దండి సురేష్, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మాస్లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, టియుసిఐ నాయకులు కె. రామయ్య, కార్మిక సంఘాల నేతలు నేతృత్వం వహించారు. ఈ -సందర్భంగా వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ మోడీ కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నారని నాలుగు లేబర్ కోడ్లతో కార్మికులను మూడు నూతన సాగు చట్టాలతో రైతాంగాన్ని ఇబ్బందుల పాలు చేస్తున్నారన్నారు. కార్మికులకు పని భద్రత లేకుండా చేయడంతో పాటు శ్రమ దోపిడీని స్వయంగా కేంద్ర ప్రభుత్వమే ప్రోత్సహిస్తుందని వామ పక్షాల నేతలు ఆరోపించారు. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతుందని ప్రశ్నించే వారిపై ప్రభుత్వం జులుం చేస్తూ చట్టాలను ప్రయోగించి నిర్బంధించే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. రవాణా రంగానికి సంబంధించి అమల్లోకి వచ్చిన చట్టాలు తీవ్ర అభ్యంతర కరంగా ఉన్నాయని సమ్మె సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన మార్పును గమనించైనా నూతన సాగు చట్టాలను, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ నాయకులు ఎస్కె జానిమియా, మహ్మద్ సలాం, పోటు కళావతి, శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వర రావు, -మిడికంటి చిన్నవెంకటరెడ్డి, మేకల శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ - నాయకులు కొత్తా సీతారాములు, మొక్కా శేఖర్ గౌడ్, పాషా, నాగేశ్వరరావు, ఝాన్సీ పాల్గొన్నారు.

విశాలాంధ్ర - పెనుబల్లి : సిపిఐ, సిపిఎం అనుబంధ కార్మిక సంఘాలు ఇతర అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన దేశవ్యాప్త సమ్మె పెనుబల్లి మండలంలో విజయవంతమైంది. కార్మిక హక్కులు కాలరాస్తూ, భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని తలపెట్టిన సమ్మె విజయవంతం అయిందని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చాలమాల విఠల్ రావు అన్నారు. అఖిలపక్ష కార్మిక సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సిపిఎం, సిపిఐ, ఎమ్మెల్ మాస్ లైన్, టిఆర్ఎస్, టిడిపి, కాంగ్రెస్, ఎమ్మార్పీఎస్, పూర్తిస్థాయిలో మద్దతు ప్రకటించి సంఘీభావం ప్రకటించారు. ఆశా, అంగన్వాడి, మధ్యాహ్న భోజన కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, అమాలి కార్మికులు, గ్రామపంచాయతీ వర్కర్స్, షాపు గుమస్తాలు, రిక్షా కార్మికులు, రైస్ మిల్ హమాలీ కార్మికులు, మోటర్ మెకానిక్ వర్కర్స్, రైస్ మిల్ లో పనిచేసే హమాలీ కార్మికులు, హాస్పటల్ శానిటేషన్ వర్కర్స్, వివిధ వర్గాలకు చెందిన కార్మికవర్గం మొత్తం సమ్మెలో పాల్గొని ప్రదర్శన నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు గాయం తిరపతిరావు అధ్యక్షతన, జరిగిన సభలో వామపక్ష పార్టీల నాయకులు కార్మిక సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు. సిపిఐ నాయకులు పాదిలి భాస్కర్, ఎమ్మెల్ మాస్ లైన్ జిల్లా నాయకులు బీరెల్లి లాజర్ మాట్లాడుతూ, కార్మిక వర్గాన్ని దెబ్బతీసే కార్మిక చట్టాలను తక్షణమే రద్దు చేయాలని హితవు పలికారు. తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తుమ్మలపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ కార్మిక వర్గానికి అండగా నిలబడతామని అన్నారు. ఎస్. డి.బాబు, పంతంగి వెంకటేశ్వరరావు, కోమటి కృష్ణా రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నపురెడ్డి శ్రీనివాస్, సిపిఎం నాయకులు చెమట విశ్వనాథం, తడికమళ్ళ చిరంజీవి, సత్యం, సిఐటియు నాయకులు తాండ్ర రాజేశ్వరరావు, గుడిమెట్ల బాబు, పోతిని సత్యనారాయణ, చిలక రామచంద్రుడు, హెల్త్ సూపర్వైజర్స్ యూనియన్ నాయకులు బి. నాగేశ్వరరావు, అంగన్వాడి యూనియన్ నాయకులు పద్మ, రాజ్ కుమారి, కే.సుజాత, ఎం.కృష్ణకుమారి, ఆశా వర్కర్స్ యూనియన్ శాంతా, శ్రీదేవి, నాగమణి, వెంకటరమణ, తిరుపతమ్మ, మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ నాయకులు నీలమ్మ, రాధా, హమాలి యూనియన్ నాయకులు మిద్దె స్వామి, అన్నపురెడ్డి లక్ష్మయ్య, జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి : కార్మిక చట్టాలు రద్దుచేస్తూ లేబర్ కోడులను తీసుకురావడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా బుధవారం జరిగిన ఒకరోజు సార్వత్రిక సమ్మెలో భాగంగా సింగరేణిలో సమ్మె విజయవంతమైందని సింగరేణి జేఏసి సంఘాల వి.సీతారామయ్య,నాయకులు తుమ్మల రాజారెడ్డి, మిర్యాల రాజిరెడ్డి, పి.ధర్మపురి, కట్ల విశ్వనాథంలు అన్నారు. ఉదయం షిఫ్ట్ జరిగిన సమ్మె అనంతరం వారు గోదావరిఖనిలో ర్యాలీ తీశారు. గోదావరిఖని చౌరస్తాలో మానవ హారం నిర్మించి కొంతసేపు వాహనాలను స్థంభింప చేశారు.ఈ సందర్భంగా సీతారాయ్య జేఏసి నాయకులతో కలిసి మాట్లాడుతూ సింగరేణిలో దాదాపు నలబై వేల మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారని, కొద్దిమంది మంది అత్యవసర సిబ్బందిని మాత్రమే విధులకు అనుమతించామని అన్నారు. గోదావరిఖని, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి, గోలేటి, భూపాలపల్లి, కొత్తగూడెం, ఇల్లందు, మణుగూరులో ఎవరూ విధులకు హాజరు కాలేదని జేఏసి నాయకులు తెలిపారు. ఈ సమ్మె వల్ల కేంద్రప్రభుత్వానికి కనువిప్పు కలగాలని, ఇది ఆరంభం మాత్రమేనని, కోడ్ లను విరమించుకోకుంటే దీర్ఘకాలిక సమ్మె చేయక తర్పదని వారు హెచ్చరించారు. జేఏసి నాయకులతో పాటు ఏఐటీయుసి నాయకులు మడ్డి ఎల్లా గౌడ్, ఆరెల్లి పోషం, మాదన మహేష్, సంకె అశోక్, రంగు శ్రీను, ఎం.ఎ.గౌస్, బోగ సతీష్ బాబు, గండి ప్రసాద్, పెర్క మహేందర్, సయ్యద్ సోహేల్, చెప్యాల భాస్కర్, ఎం.చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - తొర్రూర్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాన్ని కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా పోరాటాలు చేసి కార్మిక చట్టాలను పరిరక్షించుకుందామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఓమ బిక్షపతి, సిఐటియు జిల్లా నాయకులు బొల్లం అశోక్, టియుసిఐ జిల్లా నాయకులు ముంజంపల్లి వీరన్న, రిటైర్డ్ ఉద్యోగ సంఘాల నాయకులు వెంకటాచారి, ఏఐకేఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఉడుగుల లింగన్న, ఐఎఫ్టియు జిల్లా నాయకులు ఆలకుంట్ల సాయిలు, స్ఫూర్తి భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రామచంద్రులు అన్నారు. బుధవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఆల్ ట్రేడ్ యూనియన్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సార్వత్రిక సమ్మెలో భాగంగా స్థానిక మున్సిపల్ పట్టణ కేంద్రములో ప్రధాన రహదారిపై భారీ ర్యాలీ మానవహారం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎందరో ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక సంక్షేమ చట్టాలను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టే విధంగా సంస్కరణలు చేస్తుందని అన్నారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను సవరించి 4 కోడ్లుగా కుదించారని విమర్శించారు. ఈ సార్వత్రిక సమ్మె లో సిపిఎం పార్టీ తొర్రూర్ మండల కార్యదర్శి ఎండి యాకుబ్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి గణపురం లక్ష్మణ్, స్ఫూర్తి భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు ఆంజనేయులు, శ్యామ్, రామచంద్రు, కిరణ్, శ్రీరాం పుల్లయ్య, కొమ్మనబోయిన యాకయ్య, సాయిమల్లు, దొనక దర్గయ్య, తిమ్మిడి రవి, గూడేల్లి ఎల్లయ్య, మంగళపల్లి మల్లయ్య, మున్సిపాలిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కొమ్ము దేవేందర్, మహేందర్, బిక్షపతి, రామస్వామి, హెచ్ యాకయ్య, ధరావత్ బిక్షపతి, సాయిలు, ఊడుగుల లింగయ్య లేక మల్లయ్య, కొండ సుధాకర్, ప్రభాకర్, శ్యాంసుందర్, పల్లె వెంకటేష్, ఇసంపల్లి యాకన్న, మంగళపల్లి నాగరాజు, మధు, పందుల మహేష్, కొండా రాము, అంగన్వాడీలు శైలజ, పద్మ, సురేఖ, ఉమ్మగాని యాకయ్య, దొమ్మటి సోమయ్య, మోహన్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్: నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, రాజ్యాంగ పరిరక్షణ, కార్మిక హక్కుల పరిరక్షణకై జరుగుతున్న పోరాటంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని సిపిఎం, సిపిఐ, సిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్, సిపిఐ ఎంఎల్ ప్రజా పందా జిల్లా కార్యదర్శులు సాదుల శ్రీనివాస్, బి విజయ సారధి, గౌని ఐలయ్య, పాయం చిన్న చంద్రన్న, సనప పొమ్మయ్యలు డిమాండ్ చేశారు. బుధవారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ వద్ద నుండి భారీ ర్యాలీ నిర్వహించారు. బుధవారం కార్మిక సంఘాల నాయకులు ఆకుల రాజు, రేషపల్లి నవీన్, పర్వత కోటేష్, కొత్తపల్లి రవి, ఎస్.కె మదర్ అధ్యక్షత వహించారు. ఈ సభలో వక్తలు మాట్లాడుతూ కార్మిక వర్గం ఎన్నో ఉద్యమాలు, త్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నరేంద్ర మోడీ ప్రభుత్వం రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లుగా చేసిందన్నారు. రాబోయే కాలంలో ఈ పోరాటాలను మరింత ఉధృతం చేయాలని సిఐటియు, ఏఐటీయూసీ ఐఎఫ్ఎస్సి, టి యు ఐ సి ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, బి అజయ్, బిల్లాకంటి సూర్యం, హలవత్ లింగన్న, కుమ్మరి కుంట్ల నాగన్న లు కోరారు. కార్మిక, రైతు సామాజిక సంఘాల నాయకులు దారా స్నేహ బిందు, కాంపల్లి శ్రీనివాస్, గుణగంటి రాజన్న, దుద్దేలా రామ్మూర్తి, మైసా శ్రీనివాస్, సులోచన, గుజ్జ దేవేందర్, పెరుగు కుమార్, మంద శంకర్, వెలుగు శ్రావణ్, చింతకుంట్ల వెంకన్న, ఆవుల కట్టయ్య, పాపారావు, తుపాకుల వెంకన్న, పుచ్చకాయల శ్రీనివాస్, ఎండి జబ్బార్, తెలబోయిన లక్ష్మయ్య, చైతన్య, బండపల్లి వెంకటేశ్వర్లు, సట్ల యాకయ్య, వీరన్న పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని పల్లా నరసింహారెడ్డి కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె దేవరకొండ నియోజకవర్గం కేంద్రంలో సిపిఐ ప్రజాసంఘాలు ఏఐటియుసి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్ల నర్సింహారెడ్డి పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత 44 కార్మిక చట్టాలను 29 కార్మిక చట్టాలను పూర్తిగా తొలగించి నాలుగు కోడులుగా తీసుకువచ్చిందని ఇది కార్మికులకు పూర్తిగా వ్యతిరేకమని భారతదేశానికి స్వాతంత్రము రాకపూర్వమే 1926 కార్మిక సంఘాలు పెట్టుకునే చట్టం సాధించుకోవడం జరిగిందన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాల పైన ముమ్మందు మరింత పోరాటాలు తీవ్రతరం చేయాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. ఏఐటి యుసి జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు, సిపిఐ మండల కార్యదర్శి దీప సుదర్శన్ రెడ్డి, వెంకటయ్య, గుమ్మకొండ వెంకటేశ్వర్ రెడ్డి, కుంభం జయరాములు, జూలూరి వెంకట రాములు,పళ్ళ రంగారెడ్డి, మైనుద్దీన్, నీల వెంకటయ్య, జూలూరు జ్యోతిబసు,అలమూరు మల్లయ్య, రామేశ్వరమ్మ శారద దేవరాజ్ వీరయ్య వెంగలయ్య, మహేష్, చరణ్ రెడ్డి, వెంకటమ్మ, శివకుమార్,అరవిందు, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు

పట్టణ, జిల్లా మహాసభలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం : ఈ నెల 21న జరగనున్న కొత్త గూడెం పట్టణ మహాసభకు అదేవిధంగా 26, 27తేదీల్లో అశ్వారావుపేటలో జరిగే జిల్లా మహాసభలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా కార్యకర్తలకు సూచించారు. బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో జరిగిన కొత్తగూడెం పట్టణ ముఖ్య నాయకుల సమావేశానికి అయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు 15 మండలాల మహాసభలు పూర్తి చేశామన్నారు. యువజన సమాఖ్య, విద్యార్థి సమాఖ్య జిల్లా మహాసభలు పూర్తయ్యాయని తెలిపారు. ఈ నెల 21లో కొత్తగూడెం పట్టణంలోని వార్డు, బస్తి శాఖల మహాసభలు పూర్తి చేసి పట్టణ మహాసభకు సిద్ధం కావాలన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికలు ఎప్పుడు ప్రకటించినా పార్టీ శ్రేణులు ఎన్నికల్లో తలబడేందుకు సిద్ధంగా వుండాలన్నారు. స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు కృషితో పట్టణంతోపాటు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సిపిఐ నాయకులు కంచర్ల జమలయ్య, వేంగా వెంకట్, మునిగడప వెంకటేశ్వర్లు, గెడ్డాడు నగేష్, భూక్యా శ్రీనివాస్, ఎస్ కె. ఫహీమ్, పార్టీ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెకు ఇల్లందు న్యాయవాదుల సంఘీభావం

విశాలాంధ్ర - ఇల్లందు : దేశవ్యాప్తంగా జరిగిన సమ్మెలో భాగంగా కార్మిక వ్యతిరేక విధానాలపై కేంద్ర వైఖరిని ఖండిస్తూ ఇల్లందు బార్ అసోసియేషన్ న్యాయవాదులు మంగళవారం నిరసన కార్యక్రమం చేసి సంఘీభావం తెలిపారు. కార్మికులు ఎంతో కష్టపడి సాధించుకున్న కార్మిక చట్టాలను విభజన చేసి, నాలుగు కొడ్లు గా రూపొందించడం కార్మికుల హక్కులను హరించడమే అని న్యాయవాదులు ఆరోపించారు. విభజించిన కార్మిక చట్టాలను వెంటనే రద్దుచేసి యథాస్థితికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వం ఇలాంటి ముందు చూపులేని చర్యలు చేపట్టినట్టయితే రైతు, కార్మిక సంఘాలన్నీ కలుపుకుపోయి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇల్లందు బార్ అధ్యక్షులు కే.ఉమేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కీర్తి కార్తిక్, సీనియర్ న్యాయవాదులు ఎన్.మల్లికార్జునరావు, పీ. కరుణాకర్ పి. గోపీనాథ్, దంతాల ఆనంద్, కొండ నారాయణ, మామిడి సత్య ప్రకాష్ ,బి. రవికుమార్ నాయక్ టీ. మహేశ్వరరావు, పి. అనిల్ కుమార్, ఎస్. బన్సిలాల్ తదితరులు పాల్గొన్నారు.

మెగా ఆధార్ క్యాంప్‌నకు విశేష స్పందన

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : కలెక్టరేట్ క్యాంపస్‌లో నిర్వహించిన మెగా ఆధార్ క్యాంపుకు జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున జనం తరలివచ్చారు. బుధవారం చేపట్టిన ఈ క్యాంపుకు ప్రజల నుండి విశేష స్పందన లభించిందని జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అన్నారు. జిల్లా కలెక్టరేట్ క్యాంపస్‌లోనే రెండు రోజులపాటు నిర్వహించెందుకు (బుధ, గురువారాల్లో) ముందుగా ప్రకటించినప్పటికీ ఇంత మందికి ఇక్కడ ఇచ్చే అవకాశాలు కనిపించలేదు. ఆధార్ సవరణలకు ఒకే చోట అందుబాటులో వుంటాయని విస్తృత ప్రచారం జరగటంతో పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చారు. జనానికి అనుగుణంగా కావలసిన ఏర్పాట్లు చేసినప్పటికీ రెండు రోజుల్లో జిల్లా మొత్తం కవర్ చేయటం సాధ్యం కాదని తేలిపోయింది. ఈ నెల 10, 11 తేదీల్లో కొత్తగూడెం, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, జులూరు పాడు, చంద్రుగొండ మండలాలకు కలెక్టరేట్ లోనే సేవలు అందించనున్నట్లు చెప్పారు. 14, 15, 16 తేదీల్లో భద్రాచలం, బుర్గంపాడు, చర్ల, దుమ్ముగూడెం మండలాలకు భద్రాచలం ఆర్డీఓ కార్యాలయంలోనూ ఇల్లందు, టెకులపల్లి, ఆళ్లపల్లి, గుండాల మండలాలకు అదే రోజుల్లో ఇల్లందు మున్సిపల్ కార్యాలయంలో క్యాంపులు జరుగుతాయన్నారు. 15, 16, 17 తేదీల్లో దమ్మపేట ఎంపీడీఓ కార్యాలయంలో దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, అశ్వరావుపేట మండలాల్లో క్యాంపులు వుంటాయన్నారు. అదే తేదీల్లో మణుగూరు ఎంపీడీఓ కార్యాలయంలో మణుగూరు, అశ్వపురం, పినపాక, కారకగూడెం మండలాల్లో నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్ రీజియన్ యు ఐ డి ఐ అసిస్టెంట్ మేనేజర్ మహమ్మద్ సౌబన్, జిల్లా ఈ డిస్టిక్ మేనేజర్ సైదేశ్వరరావు పాల్గొన్నారు.

దేవాలయ ఈఓ రమాదేవిపై దాడి గర్హనీయం..

విశాలాంధ్ర - భద్రాచలం : జిల్లా టీజీవోస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు, శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఈఓ రమాదేవిపై జరిగిన దాడి గర్హనీయమని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టిజీ వొస్) భద్రాద్రి జిల్లా శాఖ అధ్యక్షులు సంగం వెంకట పుల్లయ్య, కార్యదర్శి యు. మహేష్ తీవ్రంగా ఖండించారు. బుధవారం వారు ప్రకటన విడుదల చేస్తూ దోషులు ఎంతటి వారైన చట్టపరమైన శిక్షించాలని డిమాండ్ చేశారు. మన సరిహద్దు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పురుషోత్త పట్నంలో గల దేవస్థానం భూమిలో అక్రమ నిర్మాణాలను అడ్డుకున్నందుకు ఈఓపై మంగళవారం కొందరు దాడి చేయడంతో ఆమె స్పృహతప్పి పడిపోయిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, మహిళా అధికారులు తమ విధులను నిర్వర్తిస్తున్నప్పుడు ఇలాంటి దాడులకు గురికావడం సమాజానికి మంచిది కాదన్నారు. చట్టబద్ధంగా విధులు నిర్వర్తించే అధికారులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దేవస్థానం భూములను దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోకి తీసుకురావాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఈఓ చర్యలు తీసుకున్నారని తెలిపారు.

త్రిబుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థిని పూజిత

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నేరేడుచర్ల మండల కేంద్రంలోని శ్రీ వాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన గుగులోతు పూజిత, తండ్రి రాంకోటి, 2025-26 విద్యా సంవత్సరానికి గాను రాజీవ్ గాంధీ యూనివర్సిటీ అఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ, నిర్మల్ జిల్లా బాసరలో త్రిబుల్ ఐటీలో ప్రవేశ అర్హత సాధించినది. శ్రీవాణి పాఠశాలలో చదివిన ఈమె పదవ తరగతిలో 574 మార్కులు సాధించింది. పాఠశాల కరస్పాండెంట్ కొనతం సీతారాం రెడ్డి మాట్లాడుతూ కార్పోరేట్ స్థాయి విద్యకు దీటుగా గ్రామీణ ప్రాంతంలోని తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం తమ పాఠశాలకు గర్వకారణమని, ట్రిపుల్ ఐటీ సీటు సాధించిన పూజితకు అభినందనలు తెలియజేశారు.

రైతు సంఘం ఆధ్వర్యంలో ట్రాక్టర్ ర్యాలీ

విశాలాంధ్ర - ఖమ్మం : సార్వత్రిక సమ్మెను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (సిపిఐ అను బంధం) ఆధ్వర్యంలో ఖమ్మంలో భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. సిపిఐ కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ బస్ డిపో రోడ్డు, పెవిలియన్ మైదానం నుంచి మయూరి సెంటర్, జెడ్పి సెంటర్, ఇల్లందు క్రాస్ రోడ్డు, శ్రీశ్రీ సెంటర్ మీదుగా బైపాస్ రోడ్డులో తిరిగి సిపిఐ కార్యాలయానికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి కొండపర్తి గోవిందరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం రైతుల పట్ల కక్షసాధింపు ధోరణిని అవలంభిస్తుందన్నారు.రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, రైతు సంఘం నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, ఏపూరి రవీంద్రబాబు, కూచిపూడి రవి, యడ్లపల్లి శంకరయ్య, దొబ్బల వెంగళరావు, మామిళ్ల సుదర్శన్రెడ్డి. యన్నం భాస్కర్, ఏలూరి భాస్కర్, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, బాగం ప్రసాద్, కొల్లి రవి పాల్గొన్నారు.

సంపాదకీయం

ఎగిసిన జనాగ్రహ జ్వాల

బుధవారం దేశమంతా స్తంభించి పోయింది. ప్రతిపక్ష పార్టీలు, అనేక కార్మిక సంఘాలు ఇచ్చిన బంద్ పిలుపులో 30 నుంచి 40 కోట్ల మంది శ్రామికులు పాల్గొన్నట్టు అంచనా. ఈ బంద్‌లో 25 కోట్ల మంది దాకా పాలు పంచుకోవచ్చునని ముందు అనుకున్నా చాలా గ్రామాల్లో రైతులు, వ్యవసాయ కార్మికులు కూడా సమ్మెలో భాగస్వాములయ్యారు. బీజేపీకి అనుబంధంగా ఉన్న భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ఈ సమ్మెలో పాల్గొనలేదు. కానీ ఆ సంఘానికి చెందిన చాలా మంది కార్మికులు వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. బీఎంఎస్ సమ్మెలో పాల్గొనకపోవడానికి అధికేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి అనుబంధ కార్మిక సంఘం కావడమే ప్రధాన కారణం. కానీ బీఎంఎస్ నాయకులే "మేం సమ్మెలో పాల్గొనం అయితే సమ్మెను వ్యతిరేకించబోం" అని చెప్పారు. సమ్మెలో పాల్గొనకపోవడానికి బీజేపీ అనుబంధ సంస్థ కావడం కారణం. అయితే తటస్థంగా ఉండడం లేదా వ్యతిరేకించకపోవడానికి ఆ కార్మిక సంఘం వాస్తవ పరిస్థితిని గుర్తించిందనడానికి సంకేతం. 213 కార్మిక సంఘాలు ఈ సార్వత్రిక సమ్మెలో పాల్గొనబోమని తెలియజేశాయని కేంద్ర కార్మిక శాఖ చెప్తోంది. అది నిజమే అనుకున్నా దేశంలో ఉన్న 16,000 కార్మిక సంఘాలలో ఈ 213 సంఘాల నిర్ణయానికి విలువే లేదు. వాటిలో బీఎంఎస్ మాత్రమే పెద్ద కార్మిక సంఘం. మిగతావన్నీ చిన్నాచితక కార్మిక సంఘాలే. లేదా అనామకమైనవే. 2020 సంవత్సరం నవంబరు 26న జరిగిన సమ్మెలో 25 కోట్ల మంది శ్రామికులు పాల్గొన్నారు. ఇప్పుడు సమ్మె కట్టిన వారి సంఖ్య 30–40 కోట్లకు పెరిగింది. ఈ రెండు సమ్మెలూ మోదీ హయాంలోనే జరిగాయి. మరింత మంది బుధవారం నాటి సమ్మెలో పాల్గొనడం మోదీ ప్రభుత్వం మీద అసంతృప్తికి చిహ్నం. బుధవారం నాటి సార్వత్రిక సమ్మె కేవలం పారిశ్రామిక ప్రాంతాలకే పరిమితం కాలేదు. సమ్మె కారణంగా జన జీవితంపై ప్రభావం స్పష్టంగా కనిపించింది. రైల్వే కార్మికులు ఈ సమ్మెలో భాగస్వాములు కానప్పటికి రైల్వే కార్మిక సంఘాలు వివిధ చోట్ల నిరసన ప్రదర్శనలు నిర్వహించి సంఘీభావం ప్రకటించాయి. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్‌ఎంఎస్., సీఐటీయూ, టీయూసీసీ, ఏఐసీసీటీయూ., ఎల్‌పీఎఫ్., యూటీయూసీ లాంటి పది కార్మిక సంఘాలు ఈ సమ్మెకు పిలుపు ఇచ్చాయి. బ్యాంకుల, బీమా రంగ సిబ్బంది సంఘాలు, సం యుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) కూడా సమ్మెకు మద్దతిచ్చాయి. ముందుగా అనుకున్న ప్రకారం ఈ సార్వత్రిక సమ్మె గత మే 20ననే జరగాల్సింది. కానీ ఆపరేషన్ సిందూర్ కారణంగా జులై 9కి వాయిదా పడింది. కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపు ఇచ్చినప్పుడు మొత్తం 17 డిమాండ్లు ప్రభుత్వం ముందుంచాయి. కానీ కార్మికులకు అపార నష్టం కలిగించే నాలుగు వివాదాస్పద కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలన్నవి ప్రధానమైన డిమాండ్లు. అందుకే సమ్మెకు మద్దతివ్వని కార్మిక సంఘాలు కూడా దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణ వివాదంపై నిరసన కూడా నేడే జరిగింది. కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ, రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జేడీ) అగ్రనాయకుడు తేజస్వీ యాదవ్ ఈ ర్యాలీలో పాల్గొన్నారు. దానితో పాటు బీహార్‌లో సార్వత్రిక సమ్మె కూడా సంపూర్ణంగా జరిగింది. "ఇండియా" ఐక్య సంఘటనలోని భాగస్వామ్య పక్షాలన్నీ సమ్మెకు పిలుపు ఇచ్చాయి. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో ఉన్న బీహార్‌లో ఓటర్ల జాబితాలో అవకతవకలకు నిరసన, సార్వత్రిక సమ్మెకు కూడా భారీ మద్దతు లభించింది. భారత ఆర్థిక వ్యవస్థలో కీలక భూమిక నిర్వహించే బ్యాంకింగ్, రవాణా, విద్యుత్ రంగాలలో సమ్మె ప్రభావం తీవ్రంగా ఉంది. బీజేపీ పాలనలో ఉన్న గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లో విద్యుత్‌రంగ సిబ్బంది సమ్మెలో పాల్గొనడం విశేషం. ప్రతిపక్ష ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలలో ఎటూ సమ్మె సంపూర్ణమే. బీమా, తపాలా ఉద్యోగులు, బొగ్గు గనుల కార్మికులు కూడా సమ్మెకు చేయూత ఇచ్చారు. బీజేపీ పాలనలోని అసోంలోనూ వివిధ రంగాలలో కార్యకలాపాలకు తీవ్ర విఘాతం కల్గింది. అనేక రాష్ట్రాలలో అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు కూడా సమ్మె కట్టారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి కార్మికులు కూడా సమ్మెలో పాల్గొన్నారు.

వామపక్ష ఫ్రంట్ ప్రభుత్వం అధికారంలో ఉన్న కేరళలో సమ్మె సంపూర్ణంగా జరగడంలో ఆశ్చర్యం లేదు. బెంగళూరు, కోల్‌కత, తమిళనాడు, బీహార్‌లో సమ్మె ప్రభావం మరింత ఎక్కువ కనిపించింది. బీజేపీకి మద్దతిచ్చే తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోనూ పారిశ్రామిక వాడలు, పట్టణాల్లో తీవ్ర ప్రభావం ఉంది. జార్ఖండ్, మధ్యప్రదేశ్‌లో అనేక బొగ్గు గనులు మూతపడ్డాయి. రోడ్డు రవాణా స్తంభించింది. "ఇండియా" ఐక్య సంఘటనలో భాగస్వామ్యం లేని తెలంగాణలోని బీఆర్ఎస్, ఒడిశాలో బలంగా ఉన్న బిజూ జనతా దళ్ (బీజేడీ) కూడా సమ్మె చేస్తున్న వారికి అండగా నిలిచాయి. మోదీ పాలనలో కార్మికుల, రైతుల సమస్యలు అంతకంతకు పేరుకు పోతున్నాయి. ప్రజలు ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, ప్రభుత్వ రంగ సంస్థలను ఆశ్రిత పక్షపాతంతో ప్రైవేట్ రంగానికి అప్పగించడంతో ప్రజలు విసిగిపోయి ఉన్నందువల్ల సమ్మె విజయ వంతమైంది. రక్షణ రంగంలోని దాదాపు 400 సంస్థలలో పని చేస్తున్న మూడు లక్షల మంది సివిల్ సిబ్బంది దేశమంతటా సమ్మెకు సంఘీభావంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మోదీ హయాంలో పారిశ్రామిక సంబంధాలు బాగా దెబ్బ తినడంవల్ల సమ్మెకు అపూర్వమైన మద్దతు సమకూరింది. 2015 నుంచి భారత కార్మిక సంఘాల సమావేశమే నిర్వహించలేదు. ఇది కార్మిక వర్గాన్ని పూర్తిగా విస్మరించడమే. దళితులు, అల్పసంఖ్యాక వర్గాల వారు, వలస కార్మికులు కూడా సమ్మెకు అండగా నిలిచారు. ఈ సారి సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని ప్రతిపక్షాలు, కార్మిక సంఘాలు పెద్దగా ప్రచారం చేయవలసిన అవసరమే కనిపించలేదు. వివిధ సంఘాల వారు వారం కిందటే సమ్మెకు మద్దతు ప్రకటించారు. ఈ సమ్మె ప్రభావం చూసైనా మోదీ తన ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి ఎంత విస్తారంగా ఉందో గ్రహించాలి. కానీ మోదీ నుంచి అలాంటిది ఆశించడం అత్యాశే అవుతుంది. ఈ సమ్మె బాధిత జన ఘోష. దోపిడీకి గురవుతున్న వర్గాల నిరసన గళం. మతతత్వ, విద్వేష రాజకీయాలకు స్పష్టమైన నిరాకరణ. జనంలో ఆగ్రహ జ్వాలల తీవ్రతకు సంకేతం. ఇంత భారీ ఎత్తున సార్వత్రిక సమ్మె మునుపెన్నడూ జరిగిన దాఖలాలు లేవు.

బాల్యంపై బరువైన భారం

వెంకటరమణ గిలకత్తుల

లేత చేతులు రాళ్ళ కొడుతూ, బట్టీల్లో ఇటుకలు కాలుస్తున్నాయి. పాలు కారే వయసు ప్రమాదకర పరిశ్రమల్లో, వెట్టి చాకిరీ వలలో చిక్కుకుపోయి మగ్గిపోతున్నది. బాల కార్మికులు అంటే పిల్లలను పాఠశాల విద్యకు దూరం చేసి పిల్లల బంగారు బాల్యాన్ని, సామర్థ్యాన్ని, సంతోషాన్ని, ఆత్మ గౌరవాన్ని హరించి వేసి శారీరకంగా, మానసిక పెరుగుదలకు హాని కలిగించడం. ఇది మన సమాజానికి సిగ్గుచేటు. ప్రతిబిడ్డ ఏ మోసానికి గురికాకుండా తన బాల్యాన్ని ఆస్వాదించడమే నిజమైన ఆనందం. జాతీయ బాలల హక్కుల కమిషన్ ప్రకారం "14 సంవత్సరాల లోపు పిల్లలు వారి వయసుకు తగని శారీరక, మానసికంగా హాని కలిగించే పనులకు దూరంగా ఉండాలి. బాల

కార్మిక వ్యవస్థ నేడు ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న అంతర్జాతీయ ఆర్థిక, సామాజిక సమస్య. ఇది భవిష్యత్ తరాలకు తీవ్ర సవాలుగా మారనుంది.

బాల కార్మిక వ్యవస్థనిర్మూలన కోసం అనేక చట్టాలు (బాల కార్మిక నిషేధ చట్టం 1986,1988, గనుల చట్టం 1952, జువైనల్ జస్టిస్ ఆఫ్ చిల్డ్రన్ యాక్ట్ 2015, విద్యా హక్కు చట్టం 2009, సమానత్వపు హక్కు ఆర్టికల్ 14, ఆర్టికల్ 21 లో వ్యక్తిగత జీవించే హక్కు, ఆర్టికల్ 21ఏ, ఆర్టికల్ 24) రక్షణ చట్రాలుగా ఉన్నప్పటికీ ఈ సమస్య ఇంకా అంతం కాకపోవడం అత్యంత విచారకరం. ఐఎల్ఓ లెక్కల ప్రకారం దాదాపు 160 మిలియన్ల పిల్లలు ప్రపంచవ్యాప్తంగా బాల కార్మికులుగా పనిలో ఉన్నారు. ఇందులో 70% వ్యవసాయం, ఇంటి పనులు, వస్త్ర పరిశ్రమ, ఫుడ్ ప్రొడక్ట్స్, రవాణా మొదలగు రంగాల్లో పనిచేస్తున్నారు. 30% కర్మాగారాలు, గాజు, రంగులు, టపాసుల తయారీ, గనుల వంటి ప్రమాదకర రంగాల్లో పనిచేస్తున్నారు. ఈ సమస్య గ్రామీణ ప్రాంతాల్లో మరీ ఎక్కువగా కనబడుతుంది. సబ్ సహారా ఆఫ్రికాలో పిల్లలు బాల కార్మికులుగా ఎక్కువగా ఉన్నారు. 2030 నాటికి దీని తీవ్రత ఎక్కువ అయ్యే అవకాశం ఉందని యూనిసెఫ్ అంచనా. ఉదర పోషణార్థం,కనీస అవసరాల కోసం అనివార్య పరిస్థితుల్లో బాలలు కార్మికులుగా అరకొర వేతనాలతో, అత్యంత దయనీయ స్థితిలో దుర్భర జీవితాలు గడుపుతున్నారు.

పిల్లలు తెచ్చే డబ్బు పేద కుటుంబాలకు జీవనాధారం.తల్లిదండ్రులు పిల్లలను నమ్మకమైన ఆదాయ వనరుగా పరిగణించి బలవంతంగా పనులకు ప్రోత్సహిస్తున్నారు. పిల్లలు క్రమేపి స్వతంత్రంగా ఉత్పాదక వనరుగా పరిణితి చెందుతూ ఆయా పనుల్లో స్థిరపడి పోతారు. ఇది తక్షణ ఆదాయానికి ప్రాధాన్యత ఇవ్వవచ్చు కానీ ఇది పేదరిక చట్రాన్ని శాశ్వతంగా చేస్తుంది. పేదరికం, నిరక్షరాస్యత ఏకైక అతిపెద్ద కారణం. రెక్కాడితే గాని డొక్కాడని జీవితాలు. తల్లిదండ్రుల అనారోగ్య పరిస్థితి, అధిక సంతానం, ప్రాథమిక విద్య అందుబాటులో లేకపోవడం, పట్టణీకరణ, విపత్తులు, వలసలు, ఈ పరిస్థితికి దారితీస్తాయి. దారిద్ర్య రేఖకు దిగున ఉన్న పేదరిక కుటుంబాలు కొనుగోలు శక్తి స్థాయి లేకపోవడం వలన పిల్లలు కట్టుబానిసలుగా మారుతున్నారు.

పిల్లలు శ్రమ వల్ల బాల్యంలోనే శక్తిని కోల్పోతారు. అనేక సమస్యలు చుట్టుముట్టి ఆ పసి హృదయాలను కలవరపెడతాయి. దీని వల్ల పిల్లలు శారీరకంగా, మానసికంగా మెరుగైన స్థితిలో ఎదగలేరు. కీలక దశలో చదువులు కోల్పోవడం ద్వారా భవిష్యత్ నిర్మాణం కష్టతరమవుతోంది. సామాజిక అనుబంధాల పట్ల, వారి భావోద్వేగ శ్రేయస్సు కోల్పోతోంది. ఇది సామాజిక విచ్ఛిన్నతకు గురిచేసి తరతరాల పేదరికానికి దారి తీస్తుంది. ప్రపంచవ్యాప్తంగా పోటీ పడటానికి, అభివృద్ధి లక్ష్యాలను చేరుకోలేక దేశ భవిష్యత్ పై తీవ్ర ప్రభావం చూపుతుంది. బాలల విషయంలో ప్రతి క్షణం విలువైనదే. పాఠశాల జీవితంలో ఏ ఒక్క రోజు పనిలోకి పోయినా విలువైన జీవితాన్ని కోల్పోయినట్టే లెక్క. అసంఘటిత రంగాలైన హోటళ్లు, ఇంటి పనులు, వ్యవసాయ రంగాల్లో పిల్లల శ్రమను గుర్తించడం కష్టతరమవుతున్నది. బీహార్, జార్ఖండ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఇది మరింత తీవ్రం. తల్లిదండ్రులకు ఉపాధి అవకాశాలను కల్పించడం ద్వారా కుటుంబాదాయం పెంచడం చేయాలి. సాంకేతిక నైపుణ్యాలలో తర్ఫీదు అవకాశాలు కల్పించాలి.

పిల్లలకు బాల్య దశలో చదువులు, ఆటలు, ఆరోగ్యం, ప్రేమ లభించేలా చేయాలి. పేదరిక పిల్లలతో దేశం పురోగతి సాధించలేదు. పిల్లలు జాతి సంపద అని, భావి భారత నిర్మాతలని గుర్తెరగాలి. పిల్లలు పనిముట్లు వదిలి పుస్తకాలు పట్టాలి. కలలు కనే హక్కు కలిగి ఉండాలి. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి విద్య ఒక అద్భుతమైన నిరూపిత వ్యూహం. పేదరిక చట్రాన్ని విచ్ఛిన్నం చేయగల శక్తివంతమైన ఆయుధం. స్థానిక సంఘాలు, వర్క్ షాపుల ద్వారా, ఎన్జీవోలు ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి. "ఓ చిరుతల్లారా మీదే, మీదే సమస్త విశ్వం, మీరే లోకపు భాగ్య విధాతలు" అన్న మహాకవి శ్రీశ్రీ మాటలు నిజం కావాలి. "బంగారు బాల్యం నా హక్కు" అనే నినాదం ద్వారా బాల కార్మిక శ్రమ రహిత భారత్ ను నిర్మించాలనే సదాశయంతో,దృఢ సంకల్పంతో ముందుకు వెళదాం.

సెల్:866 8787 69

ఊపిరాడని స్థితిలో 23లక్షల మంది

పలస్తీనాలో భాగమైన గాజా ప్రాంతంపై 21 నెలలకు పైగా ఇజ్రాయిల్ నిరంతరం బాంబులు వేస్తోంది. ఇప్పటికే దాదాపు 55 వేల మందికిపైగా ప్రజలను ఇజ్రాయిల్ సైన్యం పొట్టన పెట్టుకుంది. గాజా ప్రాంతం నుంచి బలవంతంగా ఇతర ప్రాంతాలకు తరలించి బందీలుగా ఉంచిన దాదాపు 23 లక్షల మంది ఊపిరాడని స్థితిలో ఉన్నారు. బందీలుగా ఉంచిన ప్రాంతం గాజా స్ట్రిప్‌లో 15 శాతం కంటే తక్కువ ప్రాంతంలో బిక్కుబిక్కుమంటున్నారు. ఎంతమాత్రం ఊపిరాడని పరిస్థితిలో ఉన్నారు. వీరంతా గ్వాంటనామా బే ప్రాంతంలో బందీలుగా ఉన్నారు. బందీలకు కేటాయించే స్థలం కూడా వీరికి లేదు. అత్యంత ఇరుకైన స్థలంలో భీతిల్లుతున్న పలస్తీనా ప్రజలపై నిరంతరం బాంబులు వేస్తున్నారు. వీరికి నీళ్ళు, ఆహారం, స్వేచ్ఛగా జీవించే తాత్కాలిక నివాసం, ఆరోగ్య భద్రత లేవు. గాజా ప్రాంతంలోని ప్రజలందరిని అక్కడ లేకుండా తరలించి భౌతికంగా నాశనం చేయాలని ఇజ్రాయిల్ మారణకాండకు పూనుకున్నది. ఆహారం లేక నకనకలాడి ప్రాణాలు వదులుతున్నారు. ఒక పద్ధతి ప్రకారం ప్రాణాలు తీస్తున్నారు. పిల్లలు, మహిళలు అనే భేదం లేకుండా చంపుతున్నారు. ఈ మారణకాండ 22 వ నెలకు వచ్చింది. గాజాలో ఏమాత్రం స్థలాన్ని వదలకుండా అన్ని చోట్ల ఇజ్రాయిల్ సైన్యం బాంబులు కురిపిస్తోంది. ప్రతిరోజు బందీలుగా తరలిస్తూనే ఉన్నారు. బందీలు ఉన్న ప్రాంతం కేవలం 55 కిలోమీటరకు పరిమితమైంది. ఈ ప్రాంతంలో సైన్యం ఎల్లవేళలా కాపలాకాస్తోంది. గాజాలో కూడా 85 శాతం ప్రాంతంలో సైన్యం కఠినమైన జోన్లుగా విభజించి అంతర్జాతీయ చట్టాలను సైతం ఉల్లంఘిస్తోంది.

ప్రస్తుతం గాజాలో నివసిస్తున్న కొద్దిమంది ప్రజలు ధ్వంసమైన ప్రాంతంలో ఉంటున్నారు. వీరికి మౌలిక సదుపాయాలు లేవు. జనం కిక్కిరిసి ఉన్నారు. కిలోమీటరుకి 40 వేల మంది నివసిస్తున్నారు. అల్ - మవాసి ప్రాంతంలో కిలోమీటరుకు 47 వేల మంది ఉన్నారు. భూమిపైన కిలోమీటరుకు ఇంత ఎక్కువ మంది ఉండటం మరెక్కడా లేదు. ప్రపంచ దేశాలన్నీ చూస్తుండగానే ఇజ్రాయిల్ యుద్ధ నేరాలకు పాల్పడుతోంది. దాదాపు గాజా ప్రాంతంలో ప్రపంచ దేశాలన్నీ చూస్తుండగానే పట్టపగలే ఇజ్రాయిల్ బాంబులు వేస్తూ అమాయకుల ప్రాణాలు తీస్తూ ఉంది. నివాస ప్రాంతాల నుంచి ప్రజలను గ్వాంటనామా బే ప్రాంతానికి

బలవంతంగా తరలించి బందీలుగా ఉంచారు. ఇది కూడా ఏమాత్రం భద్రతా జోన్లుగా లేవు. కనీసం మానవత్వం లేని నెతన్యాహు అమెరికా సహాయంతో మారణకాండకు పాల్పడుతున్నారు. గాజా ప్రాంతంలో నివసిస్తున్న అన్ని కుటుంబాలను బందీలుగా ఉంచిన ప్రాంతానికి తరలించారు. ఒకొక్క కుటుంబాన్ని 5, 6 సార్లు బలవంతంగా తరలించారు. గాజాకు తిరిగి వచ్చిన కొన్ని కుటుంబాలను మళ్లీ మళ్లీ తరలిస్తూనే ఉన్నారు. గాజాలో ఏ ప్రాంతమూ సురక్షితంగా లేదు. కనీసం తాత్కాలిక షెల్టర్ కూడా లేకుండా ధ్వంసం చేశారు. విద్యుత్, తాగునీరు, వైద్యం, ఆహారం పూర్తిగా అందుబాటులో లేదు. మురికి వరదలై పారుతోంది. నిత్య జీవనం ధ్వంసం అయింది. వాస్తవంగా ఇక్కడ ఉంటున్న ప్రజలు భయంతో అల్లాడుతున్నారు. బందీలుగా ఉన్నవారు శారీరకంగా, మానసికంగా అయోమయంలో జీవిస్తున్నారు. ఒకవైపు బాంబులు మరోవైపు ఆకలి మధ్య బిక్కుబిక్కుమంటున్నారు.

గాజా ప్రాంతంలో తక్షణం ప్రజలను తరలించటం తాత్కాలికమేమీ కాదు. శాశ్వతమే. శాశ్వతంగా గాజాను నిర్మానుష్యం చేయాలన్నది దుర్మార్గుడైన నెతన్యాహు లక్ష్యం. గాజాను ప్రజా నివాసం లేకుండా పూర్తిగా ఖాళీ చేయించడం అతి త్వరలోనే జరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి. జులై నాటికి ఇజ్రాయిల్ 92 శాతానికి పైగా ఇళ్లను దాదాపు 80 శాతం పాఠశాలలను, 90 శాతం ఆసుపత్రులను మొత్తం యూనివర్సిటీలను సైనికులు ధ్వంసం చేశారు. ప్రపంచపటం నుంచి గాజాను అంతర్ధానం చేయడానికి పూనుకున్నారు. మొత్తం చుట్టుపక్కల ప్రాంతాలను, నగరాలను, గ్రామాలను, క్యాంపులను, వీధులను, వివిధ సంస్థలను, మార్కెట్‌లను, మసీదులను చివరకు జ్ఞాపకాలను తుడిచివేశారు. భవిష్యత్‌లో ఏవిధంగాను గాజా ప్రాంతం తిరిగి పూర్వస్థితికి వచ్చే అవకాశం కల్పించటం లేదు. పలస్తీనా అనేది లేకుండా చేయాలని అమెరికా దాని మిత్ర దేశాలు చేయని ప్రయత్నం లేదు. పలస్తీనా స్వతంత్ర దేశం కోసం 70, 80 సంవత్సరాలుగా పోరాడుతూనే ఉన్నారు. ఐక్యరాజ్య సమితి సైతం స్వతంత్ర పలస్తీనాకు సానుకూలంగా ఉంది. చివరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కలిసి నెతన్యాహు పలస్తీనానే నాశనం చేయడానికి పూనుకున్నారు. నాలుగవ జెనీవా కన్వెన్షన్ 49 వ ఆర్టికల్ ప్రకారం, ఆక్రమిత ప్రాంతాల నుంచి పౌరులను సామూహికంగా లేదా ఒంటరిగా బలవంతంగా ఇతర ప్రాంతాలకు తరలించరాదు. ప్రజల భద్రతకు సంబంధించిన ముప్పు వచ్చినప్పుడు తరలించవచ్చు. ఈ ఆర్టికల్ ప్రకారం తరలించిన వారిని తిరిగి వారి స్థానాలకు తీసుకువచ్చి వారి నివాసాలను కూడా ఏర్పాటు చేయాలి. అయితే ప్రస్తుతం ఇజ్రాయిల్ జెనీవా కన్వెన్షన్ నియమాలను పూర్తిగా ఉల్లంఘించింది. యుద్ధ నేరాలకు పాల్పడుతోంది. రోజురోజుకి ఎక్కువమందిని చంపివేస్తూ కావాలని ఆహారం సరఫరా చేయకుండా ఆకలి చావులకు గురి చేస్తుంది. గాజాను పూర్తిగా ఖాళీ చేయించడానికి ప్రతిరోజు బాంబు దాడులు చేస్తున్నారు. 22 మాసాలుగా మారణకాండ సాగుతూనే ఉంది. దాదాపు 2 లక్షల మందికి పైగా గాయపడ్డారు. వీరికి వైద్య చికిత్సలు అందడం లేదు. గాజాలో మౌలిక సదుపాయాలన్నీ ధ్వంసం అయ్యాయి. మళ్లీ జనం జీవించే పరిస్థితులు లేవు. మానవత్వం మరిచిన ప్రపంచ దేశాలు ఇజ్రాయిల్, ఈ దేశానికి అన్ని విధాలుగా సహకరిస్తున్న అమెరికా, శాంతి తమ మార్గమని చెప్పుకుంటున్న దేశాలు ఈ మారణహోమాన్ని చూస్తూ మౌనంగా ఉండటం అత్యంత దారుణం. అన్ని దేశాలు ఒంటరిగా లేదా కలిసి గాజాలో మారణహోమాన్ని తక్షణం నిలిపివేయాలని న్యాయ పరమైన బాధ్యతలను తీసుకోవాలి. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తున్న ఇజ్రాయిల్‌పై చర్య తీసుకోవాలి. అంతర్జాతీయ నేరాల విచారణ కోర్టు నిర్ణయాన్ని అమలు జరపవలసిందిగా ఐక్యరాజ్య సమితి ప్రపంచ దేశాలు సిద్ధపడాలి. అంతర్జాతీయ చట్టాల ప్రకారం పలస్తీనాకు ప్రత్యేకించి గాజా ప్రాంతానికి ఉపశమనం కలిగించి భవిష్యత్‌లో స్వతంత్ర పలస్తీనా ఏర్పాటుకు సహకరించాలి. అలాగే అంతర్జాతీయంగా, సామూహికంగా ఇజ్రాయిల్ పైన ఆర్థిక, దౌత్యపరమైన, సైనిక ఆంక్షలను విధించాలి. రాజకీయమైన ఆర్థికపరమైన సైనిక పరమైన మద్దతును ఇవ్వరాదు.

పచ్చని పొలాల్లో కారు చిచ్చులా సోలార్ ప్రాజెక్టు

ముప్పాళ్ల భార్గవశ్రీ

రాష్ట్రంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వం సోలార్ ప్రాజెక్ట్ ఉత్పత్తి పరికరాలను తయారు చేసే బడా కార్పొరేట్ కంపెనీ ఇండో సోల్ కంపెనీకి 8,234 ఎకరాల భూమి కావాలని, తొలి విడతలో కరేడు గ్రామపంచాయతీలోని 4,912 ఎకరాల భూమి సేకరించేందుకు జూన్ 21వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసింది. కొద్దిరోజులకే కరేడు ప్రాంత గ్రామాలలో భూసేకరణకు అధికారులు ప్రయత్నాలు ప్రారంభించడంతో ఆగ్రహించిన రైతులు, వామపక్ష పార్టీలు, రైతు సంఘాల నాయకత్వాన జూన్ 28వ తేదీన ఆందోళన ప్రారంభించడంతో రంగంలోకి దిగిన పోలీసులు కొందరు రైతులతో పాటు రైతు సంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టులు చేయడంతో ఆగ్రహించిన రైతులు 29వ తేదీన వేలాదిమంది జాతీయ రహదారికి చేరుకుని గంటల కొలది ట్రాఫిక్‌ను స్తంభింపచేశారు. చివరికి సబ్ కలెక్టర్ వచ్చి ఆందోళనకారులతో చర్చించి రైతులకు తగిన న్యాయం చేస్తానని హామీ ఇవ్వటంతో రైతులు ఆందోళనను విరమించారు. మరోవైపు ఆందోళనలో పాల్గొన్న రైతులు, రైతు సంఘాల నాయకులపై పోలీసులు అక్రమ కేసులు బనాయించారు.

రైతుల ఆందోళన తీవ్రతను గమనించిన వామపక్ష పార్టీల రైతు సంఘాల నాయకులు జులై 2వ తేదీన నిజనిర్ధారణ కమిటీగా ఏర్పడి కరేడు మేజర్ పంచాయతీలోని గ్రామాలను సందర్శించి రైతుల్లో పూర్తి భరోసా కల్పించారు. రైతులు తమ భూములకోసం రోడ్డు ఎక్కిన ఫలితంగానే జులై 4వ తేదీన కరేడు గ్రామపంచాయతీ సచివాలయం దగ్గర జిల్లా అధికారులు జరిపిన గ్రామసభకు 5 వేలకు పైగా గ్రామాల ప్రజలు, అత్యధిక సంఖ్యలో మహిళలు హాజరై "భూమి మా జీవనాధారం, మా భూముల్ని అమ్ముకోం, ఇది మా భవిష్యత్తుకు ముప్పు, పరిశ్రమల పేరుతో రైతుల భవిష్యత్తును నాశనం చేస్తామంటే అంగీకరించేది లేదు, చావనైనా చస్తాం కానీ సెంటు భూమిని కూడా ఇవ్వం, రైతుల నిర్ణయాన్ని తీర్మానంగా చేసి ప్రభుత్వానికి పంపండి... అని రైతులు ముక్తకంఠంతో నినదించి గ్రామసభను స్తంభింపచేశారు. చివరకు గ్రామ సభలో పాల్గొన్న సబ్ కలెక్టర్ రైతులు చెప్పిన నిర్ణయాన్ని తీర్మానంగా ప్రకటించి సభను ముగించారు. ఆ విధంగా కరేడు గ్రామ రైతులు వివిధ రైతు, పౌర హక్కుల సంఘాల అండతో తొలి విజయాన్ని సాధించారు. కరేడు ప్రాంత గ్రామాల పచ్చని

పొలాలలో కారు చిచ్చును అంటించింది ఎవరు? రైతుల జీవితాల మనుగడకే ప్రమాదంగా ముంచుకొచ్చిన ఈ సమస్యను సృష్టించింది ఎవరు?

సోలార్ విద్యుత్తు పర్యావరణహితం అంటూ కేంద్ర, రాష్ట్ర పాలకులు ప్రచారం ప్రారంభించి, తాము అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాల్లో భాగంగా ఈ సోలార్ విద్యుత్ ప్రాజెక్టులను కూడా బడా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టటమే కాక వాటికి కావలసిన వేలాది ఎకరాల భూములను కూడా భూసేకరణ చట్టం కింద సేకరించి అప్పజెప్తున్నారు. సోలార్ ప్రాజెక్టుకు అవసరమైన పరికరాలను తయారుచేసే ఇండోసోల్ సోలార్ కంపెనీకి 8,348 ఎకరాలను కరేడు ప్రాంత గ్రామాల భూములు ఇవ్వటానికి చంద్రబాబు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ సోలార్ ప్రాజెక్టుకు భూములను జగన్ ప్రభుత్వ కాలంలోనే చేవూరు - రావూరు గ్రామాల్లో ఇండోసోల్ కంపెనీకి అనుమతులిచ్చినప్పుడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు వ్యతిరేకించారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం మాట మార్చి ఆ ప్రాజెక్టు అమలుకు ఉలవపాడు మండలంలోని కరేడు గ్రామ భూములను కేటాయించడానికి రంగంలోకి దిగింది. కేంద్రంలోని మోదీ ప్రభుత్వ అండతో చంద్రబాబు డబుల్ ఇంజిన్ ప్రభుత్వం మరింత దూకుడుగా బడా కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలను కాపాడటానికి చేస్తున్న ప్రయత్నాల్లో భాగమే కరేడు ప్రాంత రైతుల గుండెలపై పెట్టిన సోలార్ ప్రాజెక్టు కుంపటి.

ఈ సోలార్ ప్రాజెక్టుని పెట్టటానికి ఎక్కడా భూములు లేనట్లు కరేడు ప్రాంత భూములను కూటమి ప్రభుత్వం ఎంచుకోవడం విడ్డూరంగా ఉంది. ఎందుకంటే ఇలాంటి ప్రాజెక్టులను పెట్టడానికి పంటలు పండని భూములు, కొండ ప్రాంతాలను ఎంచుకుంటారు. చైనా దేశంలో నిర్మించిన సోలార్ ప్రాజెక్టులు ఇందుకు మంచి ఉదాహరణగా నిలుస్తాయి. అయితే రైతుల సంక్షేమం కంటే బడా కార్పొరేట్ శక్తుల ప్రయోజనమే మన పాలకులకు ముఖ్యం కదా! అందుకనే కరేడు ప్రాంతంలోని గ్రామాల్లో భూమిలో 15 అడుగుల్లోనే నీరు పడే మాగాణి భూముల్లో, ఆరుగాలం వివిధ రకాల పూలు, కూరగాయలు మొదలుకొని వరి, పత్తి, మిర్చి, మినుములు, వేరుశనగ, ప్రత్యేక రుచి కలిగిన మామిడి పండ్ల వరకు సుమారు 19 రకాల పంటలు పండే బంగారు భూములను ఎంచుకున్నారు. అమరావతి రాజధాని భూముల విషయంలో తీసుకున్న వైఖరినే ఇక్కడా చంద్రబాబు ప్రభుత్వం తీసుకుంది. ఈ ప్రాంత రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి వివిధ రకాల పంటలతోపాటు వ్యవసాయ కార్మికులకు ఎల్లవేళలా పనులు లభించి వారికి మంచి ఉపాధి వనరులుగా ఈ పంటభూములు ఉన్నాయి. అలాంటి భూములు పది పరకా కాదు ఏకంగా 8 వేల ఎకరాలకు పైగా భూములను సేకరించడానికి కూటమి ప్రభుత్వం పూనుకుంది. ఈ ప్రాంతంలో పెట్టేది సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసే ప్రాజెక్టు కాదు. ఆ ప్రాజెక్టుకు కావలసిన పరికరాలను తయారుచేసే ఫ్యాక్టరీ మాత్రమే ఇది. మరి అలాంటి ఫ్యాక్టరీకి వేలాది ఎకరాల భూములు ఎందుకు కట్టబెడుతున్నారు! ఎందుకంటే బడా కార్పొరేట్ శక్తి అదానికి బినామీగా ఉన్న ఇండోసోల్ సోలార్ కంపెనీకి రియల్ ఎస్టేట్ వ్యాపారం ద్వారా లబ్ది చేకూర్చటానికేనని వేరే చెప్పనవసరం లేదు.

నెల్లూరు జిల్లా కందుకూరు డివిజన్ ఉలవపాడు మండలం తీర ప్రాంతంలో ఉన్న కరేడు గ్రామం ఓ మేజర్ పంచాయతీ. 20 చిన్న చిన్న గ్రామాలు ఉన్న ఈ పంచాయతీలో సుమారు 15 వేల మంది ప్రజలు నివాసముంటున్నారు. ఈ గ్రామాల్లో నూటికి 90 శాతం మంది ప్రజలు చిన్న సన్న కారు రైతులే. వీరిలో ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలవారు ఉన్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో పిడుగులాంటి ఈ వార్త ఇక్కడ ప్రజల కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. వ్యవసాయ భూమితో పాటు 300కు పైగా ఎస్సీ, ఎస్టీలకు చెందిన ఇళ్లను కూడా ఈ ప్రాజెక్టులో భాగంగా తొలగిస్తామని నోటిఫికేషన్‌లో ప్రకటించారు. అంతేకాదు ఈ భూములను అమ్మకూడదు కొనకూడదని రిజిస్ట్రార్ ఆఫీసులలో ప్రకటించాలని కూడా నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అలాగే సామాజిక ప్రభావ అంచనా కూడా ఈ భూసేకరణకు వర్తించదని కూడా ప్రకటించారు. ఈ నోటిఫికేషన్‌లో ప్రకటించిన ఆంక్షలు ఈ ప్రాంత రైతుల పాలిట ఉరితాళ్లుగా మారాయి.

తమ జీవనాధారంగా ఉన్న భూములను బడా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి వ్యతిరేకంగా కరేడు గ్రామాల వేలాది ప్రజలతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో కూడా కార్పొరేట్ కంపెనీలకోసం చేసే అక్రమ భూసేకరణకు వ్యతిరేకంగా రైతులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఎక్కడో కాదు కుప్పం నియోజకవర్గంలో కుప్పం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ కోసం చిత్తూరు జిల్లా శాంతిపురం మండలంలోని గ్రామాల చిన్న సన్న కారు రైతులు 2014లోనే 450 ఎకరాల భూసేకరణ చేసి ఈనాటికీ పునాది రాళ్ళు కూడా వేయలేదని, మొత్తం 1474 ఎకరాల బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా ఈనాటికీ రైతులు ఆందోళన చేస్తున్నారు. అలానే అనంతపురం జిల్లా రాప్తాడు మండలంలో సోలార్ ప్రాజెక్టు కోసం భూసేకరణను అడ్డుకుంటామని రైతులు ప్రకటించారు. ఉద్దానములో కార్గో ఎయిర్ పోర్టు కోసం భూముల సేకరణపై రైతులు ఆందోళన బాటపట్టారు. కాకినాడతో పాటు ఇతర ప్రాంతాలలో ప్రత్యేక ఆర్థిక మండలాలు (సెజ్)లకు అక్రమంగా కేటాయించిన భూముల కోసం రైతులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. తాజాగా కరేడు గ్రామంలో పచ్చని పంటలతో కళకళలాడుతున్న వేలాది ఎకరాల బంగారు భూములను బడా కార్పొరేట్ శక్తి అదానీకి బినామీగాఉన్న ఇండోసోల్ పవర్ కంపెనీకి అన్యాయంగా కట్టబెట్టడానికి వ్యతిరేకంగా కరేడు ప్రాంత గ్రామాల రైతాంగం ప్రారంభించిన ధర్మపోరాటం ఇతర ప్రాంతాల రైతాంగానికి తమ పంట భూములను కాపాడుకోవడానికి మంచి ఉత్తేజంగా నిలుస్తుందని ఆశిద్దాం. కూటమి ప్రభుత్వం అక్రమ భూసేకరణను అధికారికంగా ఆపేవరకు కరేడు ప్రాంత రైతాంగం సాగిస్తున్న పోరాటానికి ప్రజలు, ప్రజాతంత్ర వాదులు, వామపక్ష పార్టీలు, రైతు సంఘాలు అన్ని రూపాలలో సహాయ సహకారాలు అందించటానికి ముందు వరుసలో నిలుస్తున్నాయి. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ కరేడు గ్రామ రైతుల ఉద్యమానికి సంఘీభావం ప్రకటించేందుకు ఆ ప్రాంతంలో గురువారం పర్యటిస్తున్నారు.

సెల్ నెం. 98481 20105

ఆధార్ ఎప్పుడూ మొదటి గుర్తింపు కాదు: ఉడాయ్

పట్నా: బీహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కోసం ఆమోదయోగ్యమైన గుర్తింపు పత్రాల జాబితా నుంచి ఆధార్ ను మినహాయించడంపై వివాదం కొనసాగుతోంది. ఈ వివాదం వేళ భారత విశిష్ట ప్రాధికార సంస్థ స్పందించింది. ఈ మేరకు ఉడాయ్ సీఈవో భువనేశ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆధార్ ఎప్పుడూ మొదటి గుర్తింపు కాదని స్పష్టం చేశారు. ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో భువనేశ్ కుమార్ మాట్లాడుతూ... ఫేక్ ఆధార్ కార్డులను కట్టడి చేసేందుకు ప్రత్యేక ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా క్యూఆర్ స్కానర్ యాప్‌ను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. 'కొత్త ఆధార్ కార్డులపై క్యూఆర్ కోడ్ ఉంటుంది. ఉడాయ్ అభివృద్ధి చేసిన ఆధార్ క్యూఆర్ స్కానర్ యాప్ ద్వారా స్కాన్ చేసి వివరాలను సరిపోల్చుకోవచ్చు. ఈ యాప్ ద్వారా ఫేక్ ఆధార్ కార్డులను అడ్డుకోవచ్చు' అని తెలిపారు. ఈ కొత్త ఆధార్ యాప్ అభివృద్ధి దశలో ఉందని ఉడాయ్ అధికారి వెల్లడించారు.

పక్షి ఢీ... విమానం అత్యవసర ల్యాండింగ్

పట్నా: దిల్లీ వెళ్తున్న ఇండిగో విమానానికి పెను ప్రమాదం తప్పింది. విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే సాంకేతిక సమస్య కారణంగా ఎమర్జెన్సీ ల్యాండ్ చేయాల్సి వచ్చింది. విమానం పట్నా ఎయిర్‌పోర్ట్‌లో సురక్షితంగా దిగింది. ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... ఇండిగో 6ఈ509 విమానం పట్నా నుంచి దిల్లీకి బయల్దేరింది. పట్నాలోని జయప్రకాష్ నారాయణ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉదయం 8.42 గంటలకు టేకాఫ్ అయింది. అయితే టేకాఫ్ అయిన వెంటనే ఇంజిన్‌లో వైబ్రేషన్స్ రావడాన్ని గమనించిన పైలట్ వెంటనే అధికారులను సంప్రదించారు. అనంతరం విమానాన్ని పట్నా ఎయిర్‌పోర్ట్‌లోని రన్‌వే 7లో ఉదయం 9.03 గంటలకు సురక్షితంగా దించేవేశారు. ఆ సమయంలో విమానంలో దాదాపు 169 మంది ప్రయాణికులు ఉన్నారు. వారంతా సురక్షితంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే పక్షి ఢీ కొనడంతోనే ఈ సమస్య తలెత్తినట్లు అధికారులు గుర్తించారు. తనిఖీల సమయంలో ఎయిర్‌పోర్ట్ రన్‌వేపై చనిపోయిన పక్షిని గుర్తించినట్లు ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపారు. ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

'గగన్‌యాన్'కు మరో ముందడుగు

బెంగుళూరు: అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపేందుకు ఇస్రో గగన్‌యాన్ ప్రాజెక్టు చేపడుతోంది. దానిలో భాగంగానే ఈ నెల మూడో తేదీన మహేంద్రగిరిలో ఉన్న ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో స్పేస్ ఏజెన్సీకి చెందిన సర్వీస్ మాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టమ్‌లో రెండు పరీక్షలు నిర్వహించారు. ఒకటి స్వల్ప కాల వ్యవధి 30 సెకన్లు పాటు కాగా మరొకటి 100 సెకన్ల పాటు ప్రొపల్షన్ పరీక్షలు చేపట్టారు. హాట్ టెస్ట్‌లు నిర్వహిస్తున్న సమయంలో ప్రొపల్షన్ సిస్టమ్ సాధారణ స్థాయిలోనే పనిచేశాయి. 100 సెకన్ల పరీక్ష సమయంలో... రియాక్షన్ కంట్రోల్ సిస్టమ్ త్రస్టర్స్‌తో పాటు వేర్వేరు దశల్లో లిక్విడ్ అపోజి మోటార్ ఇంజిన్లు సక్రమంగా పనిచేశాయి. గగన్‌యాన్ ప్రాజెక్టు కోసం ఇస్రోకు చెందిన లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్ సెంటర్... టెక్నాలజీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు చూసుకుంటుంది. గగన్‌యాన్ ఆర్బిటాల్ మాడ్యూల్‌లో ఎస్ఎంపీఎస్ విధానం కీలకం కానున్నది. ఆర్బిటాల్ మాన్యువోరింగ్ సమయంలో ఎస్ఎంపీఎస్ తప్పనిసరి అవుతుందని ఇస్రో పేర్కొంది. అయిదు లిక్విడ్ అపోజీ మోటారు ఇంజిన్‌లు, 16 రియాక్షన్ కంట్రోల్ సిస్టమ్‌లు ఉంటాయి.

డాంకీ రూట్ కేసు... పంజాబ్, హర్యానాలో ఈడీ సోదాలు

చండీగఢ్: డాంకీ రూట్ కేసుతో సంబంధమున్న వారిపై పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో బుధవారం ఈడీ సోదాలు చేపట్టింది. నగదు కుంభకోణం కోణంలో ఆ తనిఖీలు జరుగుతున్నాయి. వందల సంఖ్యలో అక్రమ రీతిలో అమెరికాకు వెళ్లిన పంజాబ్, హర్యానాకు చెందిన వారిని ఫిబ్రవరిలో అమెరికా నుంచి గెంటివేశారు. చేతులకు బేడీలు వేసి మరీ వాళ్లను ఇండియాకు తీసుకొచ్చారు. అక్రమ ఇమ్మిగ్రేషన్‌తో సంబంధం ఉన్న నిందితుల కార్యాలయాలు, ఇళ్లల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. అమృత్‌సర్, సంగ్రూర్, పాటియాలా, మోగా, అంబాలా, కురుక్షేత్ర, కర్నాల్ నగరాల్లో తనిఖీలు జరుగుతున్నాయి. పంజాబ్, హర్యానాలో డాంకీ రూట్‌పై 17 కేసుల నమోదు అయ్యాయి. ట్రావెల్ ఏజెంట్లు, మధ్యవర్తులపై ఆ కేసులు నమోదు చేశారు. అమెరికాకు వెళ్లాలనుకునేవారిని అక్రమ రీతిలో ఆ ఏజెంట్లు తీసుకెళ్లారు. ఒక దేశం నుంచి మరో దేశానికి, అక్కడ నుంచి దొంగ దారిలో అమెరికా తీసుకెళ్లారు. దీన్నే డాంకీ రూట్ అని సంబోధిస్తున్నారు. విదేశాలకు వెళ్లాలనుకున్న అమాయక వ్యక్తులను మోసం చేసినట్లు నిర్ధారించారు. సక్రమమైన రీతిలో అమెరికాకు పంపిస్తామని చెప్పి, తప్పుడు పద్ధతుల్లో వాళ్లను పంపించేశారు. ఒక్కొక్క అభ్యర్థి వద్ద సుమారు రూ.50 లక్షలు తీసుకునేవారు. డొంకర్లు, మాఫియా ఆధారంతో అనేక మందిని సరిహద్దులు దాటించేవారు.

గుజరాత్‌లో కుప్పకూలిన వంతెన

13 మంది మృతి

- మహిసాగర్ నదిలో పడిపోయిన వాహనాలు
- అనేక మందిని రక్షించిన ఈతగాళ్లు... సహాయక సిబ్బంది

వదోదర : గుజరాత్‌లోని వదోదర జిల్లాలోని పద్రా పట్టణం సమీపంలో నాలుగు దశాబ్దాల నాటి వంతెనలో ఒక భాగం కుప్పకూలింది. బుధవారం ఉదయం జరిగిన ఈ ఘటనలో ఒక చిన్నారి సహా 13 మంది మృతిచెందారు. మరో తొమ్మిది మందిని రక్షించినట్లు అధికారులు తెలిపారు. మధ్య గుజరాత్‌ను రాష్ట్రంలోని సౌరాష్ట్ర ప్రాంతంతో కలిపే మహిసాగర్ నదిపై ఉన్న గంభీర వంతెన స్లాబ్ కూలిపోవడంతో 13 మంది మరణించారని పోలీసు సూపరింటెండెంట్ (వదోదర గ్రామీణ) రోహన్ ఆనంద్ తెలిపారు. ఈ ప్రమాదంలో మరో తొమ్మిది మందిని రక్షించగా... ఐదుగురిని వదోదరలోని ఎస్ఎస్‌జీ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. వీరెవరికీ ప్రాణాపాయం లేదని, సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు ఆనంద్ చెప్పారు. ఉదయం 7.30 గంటల ప్రాంతంలో వంతెనలోని 10 నుంచి 15 మీటర్ల పొడవైన స్లాబ్ కూలిపోయిందని వివరించారు. ఆ తర్వాత ఐదు వాహనాలు... రెండు ట్రక్కులు, రెండు వ్యాన్లు, ఒక ఆటోరిక్షా నదిలో పడిపోయాయని వదోదర కలెక్టర్ అనిల్ ధమేలియా తెలిపారు. ప్రమాదకరంగా పడిపోవడానికి దగ్గరగా వచ్చిన మరో రెండు వాహనాలను సురక్షిత ప్రదేశానికి లాక్కెళ్లినట్లు ఆయన చెప్పారు. నదిలో పడిపోయిన ద్విచక్ర వాహనంపై ఉన్న ముగ్గురు వ్యక్తులు సురక్షితంగా ఈదగలిగారని అన్నారు. స్థానిక ఈతగాళ్లు, పడవలు, మునిసిపల్ కార్పొరేషన్ నుంచి ఒక బృందం సంఘటనా స్థలానికి వెంటనే చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించినట్లు వివరించారు. కాగా ఐదుగురిని రక్షించగా, స్వల్ప గాయాలతో వారు చికిత్స పొందుతున్నారని పద్రా పోలీసు ఇన్‌స్పెక్టర్ విజయ్ చరణ్ తెలిపారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని, మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. గుజరాత్ మంత్రి రుషికేష్ పటేల్ మాట్లాడుతూ వంతెనను 1985లో నిర్మించారని, అవసరమైనప్పుడు దాని నిర్వహణను క్రమానుగతంగా నిర్వహించామని చెప్పారు. ఈ సంఘటన వెనుక కచ్చితమైన కారణాన్ని దర్యాప్తు చేస్తాము' అని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ పటేల్ ఈ విషాద ఘటన పట్ల విచారం వ్యక్తం చేశారు. వంతెన కూలిపోవడంపై దర్యాప్తు నిర్వహించి నివేదిక సమర్పించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల విభాగానికి ఆదేశించినట్లు చెప్పారు. కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల కూలిపోయి ఉండొచ్చని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. నదిలో పడిన వాహనాలను తొలగించడానికి వదోదర అగ్నిమాపక శాఖ బృందాలు, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళాలు చర్యలు తీసుకుంటున్నాయి. ఈ సంఘటన ఆనంద్-వదోదర మధ్య రోడ్డు అనుసంధానాన్ని దెబ్బతీసింది. ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. 900 మీటర్ల పొడవున్న గంభీర వంతెన 23 స్తంభాలను కలిగి ఉంది. దీనిని 1985లో ప్రారంభించారు. ఈ వంతెన నిర్మాణం సరిగా లేకపోవడంపై జులై 23 నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. అహ్మదాబాద్‌కు చెందిన ప్రముఖ జర్నలిస్ట్ దీపల్ త్రివేది తన 'ఎక్స్' ఖాతాలో ఇలా రాశారు. 'గుజరాత్ ప్రభుత్వం ఏమీ చేయలేదు. బాధ్యుల పేర్లను పేర్కొనడం, అవమానించడం ఇప్పుడు ప్రభుత్వం చేయగలిగే అతి తక్కువ పని. ఈ గుజరాత్ అభివృద్ధి నమూనా... వికాసం చెత్తగా ఉంది' అని పేర్కొన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల పరిహారం : ప్రధాని మోదీ

వంతెన కూలిన ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున పరిహారం ప్రకటించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

డబుల్ ఇంజిన్... డబుల్ డిజాస్టర్ : టీఎంసీ విమర్శ

వదోదరలో వంతెన కూలిపోయిన ఘటనపై నరేంద్ర మోదీపై బెంగాల్ అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. మార్చి 31, 2016న కోల్‌కతా పై వంతెన కూలిపోయిన తర్వాత ప్రధాన మంత్రి చేసిన 'మోసం' అనే వ్యాఖ్యను గుర్తు చేసింది. 'డబుల్ ఇంజిన్... డబుల్ డిజాస్టర్' అని పేర్కొంటూ టీఎంసీ తన 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) ఖాతాలో 2022 అక్టోబరు 30న గుజరాత్‌లోని మోర్బిలో వదోదర వంతెన కూలిపోవడంతో పాటు కనీసం 141 మంది మరణించిన పాదచారుల సస్పెన్షన్ వంతెన కూలిపోవడాన్ని చూపించే ఛాయాచిత్రాన్ని పోస్ట్ చేసింది. 'దేవుని చర్య లేదా మోసపూరిత చర్య' అని ప్రశ్నించింది. కోల్‌కతాలోని వివేకానంద రోడ్డు పై వంతెన కూలిపోయిన తర్వాత బెంగాల్‌ను ఎగతాళి చేసిన ప్రధాన మంత్రికి ఇది ఎదురుదెబ్బ.

భారీ వర్షాలు... కొట్టుకుపోయిన రోడ్డు

మరో ఘటనలో రాజస్థాన్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఝుంఝును జిల్లాలో కొత్తగా నిర్మించిన రోడ్డు కొట్టుకుపోయిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. భారీ వర్షాలకు కట్లి నదిలో నీటిమట్టం పెరగడంతో వరద ఉధృతి కారణంగా కొత్తగా వేసిన రహదారి కొట్టుకుపోయిందని అధికారులు పేర్కొన్నారు. కాగా రోడ్డు నాణ్యత పైనా స్థానికులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

మతం... కులం లేని పిల్లలు భవిష్యత్‌కు ఆశాకిరణం

కేరళ హైకోర్టు జడ్జి అరుణ్

తిరువనంతపురం : సమాజానికి మరింత హేతుబద్ధమైన భవిష్యత్ కోసం మతపరమైన లేదా కుల గుర్తింపులు లేకుండా పెరిగిన పిల్లలు నిజమైన ఆశా కిరణాలని కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.జి.అరుణ్ అన్నారు. హేతువాదులు, నాస్తికుల సమూహం అయిన కేరళ యుక్తివాది సంఘం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల రికార్డులలో తమ పిల్లలకు మతం ప్రకటించకూడదని నిర్ణయించుకున్న తల్లిదండ్రులను ప్రశంసించారు. 'మతం కాలమ్ నింపకుండా మీ పిల్లలను పాఠశాలకు పంపినందుకు నేను మిమ్మల్ని అభినందిస్తున్నాను. ఎందుకంటే ఈ పిల్లలు రేపటి ఆశా కిరణాలు. సమాజం నుంచి వ్యతిరేకత ఎదురైనప్పటికీ, రేపు ఇతరులు అడగడానికి వెనుకాడే ప్రశ్నలను వారు లేవనెత్తుతారు' అని జస్టిస్ అరుణ్ చెప్పినట్లు బార్ అండ్ బెంచ్ ఉటంకించింది. హేతువాద రచయితలు పవన్, వైశాఖన్‌ను ఈ సందర్భంగా కొనియాడుతూ సామాజిక నిబంధనలను ధైర్యంగా ప్రశ్నించగల పవన్, వైశాఖన్ వంటి వ్యక్తులు ప్రస్తుత కాలంలో అవసరమని అన్నారు. వారి కుల, ఇంటిపేర్లను తొలగించి కలం పేర్లకు అనుకూలంగా తార్కిక, లౌకిక విలువలకు వారి జీవితకాల నిబద్ధతను కొనియాడారు. అలాగే 'సైబర్ దాడులు' పెరుగుతున్న ధోరణిపై కూడా జస్టిస్ అరుణ్ ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వ్యాఖ్యలపై తాను విచారించిన అనేక కేసులు ఎఫ్ఐఆర్‌లకు సంబంధించినవని చెబుతూ, జస్టిస్ అరుణ్ మలయాళీలు అసభ్యకరమైన, దుర్వినియోగ పోస్టుల ద్వారా తమ సొంత భాషను ఎలా కలుషితం చేసి, దిగజార్చుకోవడంపై తాను ఆలోచిస్తూ ఉంటానని అన్నారు. పవనన్, వైశాఖన్ వంటి హేతువాదులు లేకపోవడం వల్ల ఇది జరిగిందని తాను నమ్ముతున్నట్లు చెప్పారు. ముఖ్యంగా జస్టిస్ అరుణ్ వ్యాఖ్యలు కేవలం బహిరంగ ప్రసంగాలకే పరిమితం కాలేదు. 2022లో అధికారిక పత్రాలలో వ్యక్తులు మతం లేనివారిగా గుర్తించే హక్కును సమర్థించే ఒక మైలురాయి తీర్పును ఆయన ఇచ్చారు. 12వ తరగతి పరీక్షలలో ఉత్తీర్ణులై కళాశాల ప్రవేశం కోసం మతం లేని విభాగంలో కుల సర్టిఫికెట్లు కోరిన విద్యార్థుల బృందం దాఖలు చేసిన కేసులో ఈ తీర్పు వెలువడింది.

జస్టిస్ వర్మ అభిశంసనపై సంతకాలు షురూ!

న్యూఢిల్లీ: తన అధికారిక నివాసంలో పెద్ద ఎత్తున నగదు కట్టలు దొరికిన కేసులో న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మని తొలగించాలని కేంద్రం, పార్లమెంటులో తీర్మానం తీసుకురానుంది. ఈ పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వం జస్టిస్ యశ్వంత్ వర్మపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టవచ్చని, దీనికి ప్రతిపక్ష పార్టీల మద్దతు సైతం ప్రభుత్వానికి ఉందని సమాచారం. లోక్‌సభలో ఈ తీర్మానానికి కనీసం 100 మంది ఎంపీల సంతకాలు అవసరం. తీర్మానంపై ఎంపీలు సంతకం చేసే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రతిపాదన అందిన తర్వాత దీనిపై దర్యాప్తు కమిటీ ఏర్పాటుకానుంది.

న్యూఢిల్లీలోని జస్టిస్ వర్మ అధికారిక నివాసంలో పెద్ద మొత్తంలో లెక్కల్లో లేని డబ్బు కట్టలు దొరికిన సంగతి తెలిసిందే. దీంతో జస్టిస్ వర్మపై అభిశంసన చర్యలను ప్రారంభించడంపై ఏకాభిప్రాయం కోసం కేంద్రం, ఆయా రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరుపుతోంది. న్యాయమూర్తిని తొలగించాలని కోరుతూ అధికారిక తీర్మానాన్ని ప్రతిపాదించడానికి అవసరమైన మద్దతును పొందేందుకు ప్రభుత్వం లోక్‌సభ, రాజ్యసభలోని అన్ని ప్రధాన పార్టీలను సంప్రదించింది. ఇప్పటికీ జస్టిస్ వర్మపై చర్యలు లేకపోవడంపై అనేకమంది ఎంపీలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుప్రీంకోర్టు అంతర్గతంగా ఏర్పాటు చేసిన నిజనిర్ధారణ కమిటీ, జస్టిస్ వర్మ తొలగింపును సిఫార్సు చేసినట్లు తెలిసింది. నోట్ల కట్టలు మంటల్లో కాలిపోయిన ఘటన జరిగిన సమయంలో దిల్లీ హైకోర్టుకు డిప్యుటేషన్‌పై ఉన్న జస్టిస్ వర్మను తరువాత అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేశారు. అయితే, జస్టిస్ వర్మ తనపై వచ్చిన అన్ని ఆరోపణలను ఖండించారు. మంటల్లో కాలిపోయిన, ఇంకా స్వాధీనం చేసుకున్న డబ్బు కట్టలు తనవి కాదని వాదించారు.

కలుషిత ఆహారం తిని 100 మంది విద్యార్థులకు అస్వస్థత

అహ్మదాబాద్: గుజరాత్ రాష్ట్రం వడోదరలో మహారాజా సాయాజీరావు వర్సిటీ ఎస్‌డీ హాల్ హాస్టల్‌లో 100 మందికిపైగా విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. హాస్టల్‌లో మంగళవారం రాత్రి భోజనం చేసిన కొన్ని గంటల తర్వాత విద్యార్థులు విరేచనాలు, వాంతులు, తీవ్రమైన కడుపు నొప్పితో ఇబ్బంది పడ్డారు. మెస్‌లో భోజనం చేసిన సుమారు 350 మంది విద్యార్థుల్లో 100 మందికిపైగా విద్యార్థుల్లో ఫుడ్ ఇన్ఫెక్షన్ లక్షణాలు కనిపించాయి. హాస్టల్ యాజమాన్యం వెంటనే విద్యార్థులను చికిత్స నిమిత్తం గోత్రి, సాయాజీ ఆసుపత్రులకు తరలించారు. ఫుడ్ పాయిజన్ వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు వైద్యులు నిర్ధారించారు. కలుషితమైన ఆహారం వల్ల ఈ పరిస్థితి తలెత్తినట్లు అనుమానిస్తున్నారు. అయితే, అదృష్టవశాత్తూ విద్యార్థుల పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఈ ఘటనతో వర్సిటీ హాస్టల్‌లో ఆహార భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం అందుకున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు వర్సిటీకి చేరుకొని హాస్టల్ మెస్‌నుంచి శాంపిల్స్ సేకరించారు. మరోవైపు ఆహారం నాణ్యత విషయంలో విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆహార నాణ్యత విషయంలో గతంలో చాలాసార్లు హాస్టల్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అయినప్పటికీ ఎలాంటి చర్యలూ తీసుకోలేదని తెలిపారు. నెలల తరబడి నాసిరకం ఆహారం తింటున్నామన్నారు. ఘటనపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

ముందు రాజకీయాలపై అవగాహన పెంచుకోండి

హీరో విజయ్‌పై కనిమొళి పరోక్ష వ్యాఖ్యలు

చెన్నై: తమిళనాడు రాజకీయాలు వేడెక్కుతున్నాయి. నటుడు విజయ్ రాజకీయ రంగ ప్రవేశం చేసిన నేపథ్యంలో అధికార డీఎంకే, ఆయన పార్టీ 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) మధ్య మాటల యుద్ధం మొదలైంది. తాజాగా డీఎంకే ఎంపీ కనిమొళి నటుడు విజయ్‌ను ఉద్దేశించి పరోక్షంగా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాజకీయ అనుభవం లేని కొందరు అకస్మాత్తుగా తెరపైకి వస్తున్నారని ఆమె విమర్శించారు. ఎట్టాయపురంలో జరిగిన డీఎంకే పార్టీ సమావేశంలో కనిమొళి మాట్లాడుతూ, "రాజకీయాల్లో ఏమాత్రం అనుభవం లేని కొందరు అకస్మాత్తుగా ఎక్కడినుంచో వస్తారు. కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాలు కూడా తెలుసుకోకుండా ప్రశ్నలు వేస్తుంటారు" అని అన్నారు. ప్రజల కోసం నిజంగా పోరాడాలనుకుంటే ముందు వారి సమస్యలు, రాజకీయాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని ఆమె సూచించారు. పరిపాలనా వ్యవస్థపై కనీస అవగాహన లేకుండానే ఎన్నికల వాగ్దానాలు చేస్తున్నారని కనిమొళి విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉందని, ప్రజలకు అలాంటి నాయకుడే అవసరమని ఆమె పేర్కొన్నారు. ఈ విషయాన్ని పార్టీ శ్రేణులు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆమె పిలుపునిచ్చారు. కాగా, వచ్చే ఏడాది జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తన పార్టీ తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు విజయ్ ఇటీవల ప్రకటించారు. తమ సైద్ధాంతిక శత్రువులైన డీఎంకే, బీజేపీలతో ఎప్పటికీ పొత్తు పెట్టుకోబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కనిమొళి చేసిన వ్యాఖ్యలు తమిళ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

"గాడ్సే" మార్గాన్ని తిరస్కరించండి

విద్యార్థులకు తమిళనాడు సీఎం స్టాలిన్ పిలుపు

చెన్నై: తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ బుధవారం విద్యార్థులతో ముచ్చటించారు. విభజన సిద్ధాంతాలను స్వీకరించవద్దని వారిని హెచ్చరించారు. గాంధీజీని హత్య చేసిన నాథూరామ్ గాడ్సే మార్గాన్ని తిరస్కరించాలని సూచించారు. "గాంధీ, అంబేద్కర్, పెరియార్ తీసుకున్న మార్గాలతో సహా మనకు అనేక మార్గాలు ఉన్నాయి. కానీ మనం ఎప్పుడూ గాడ్సే గ్రూపు మార్గాన్ని తీసుకోకూడదు" అని ఆయన తిరుచ్చిలోని జమాల్ మహమ్మద్ కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. రాష్ట్రానికి కేంద్రం ద్రోహం చేస్తుందనే ప్రచారంతో అధికార డీఎంకే 45 రోజుల రాష్ట్ర వ్యాప్త "ఓరనియిల్ తమిళనాడు" (తమిళనాడు ఒకటిగా) ప్రచారాన్ని ప్రారంభించింది. బలమైన తమిళనాడును నిర్మించడంలో ఐక్యత, సామాజిక న్యాయం, శాస్త్రీయ పురోగతి ప్రాముఖ్యతను స్టాలిన్ విద్యార్థులకు వివరించారు. తమిళనాడు ఐక్యంగా ఉంటే మనల్ని ఎవరూ ఓడించలేరని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్త ప్రచారానికి శ్రీకారం చుట్టారు. జులై 3న రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా ప్రచారం ప్రారంభించారు. మొత్తం 234 అసెంబ్లీలను కవర్ చేయాలని డీఎంకే ప్లాన్ చేసింది.

ఆర్టికల్ 326 ప్రకారమే ఓటర్ల జాబితా రివిజన్: ఈసీ

న్యూఢిల్లీ: బీహార్‌లో ఎన్నికల జాబితా రివిజన్ వివాదంపై ఎన్నికల కమిషన్ స్పష్టత ఇచ్చింది. బీహార్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక విస్తృత సమీక్ష చట్టపరంగానే జరుగుతోందని తెలిపింది. తమ వాదనకు బలం చేకూరేలా రాజ్యంగంలోని 326వ నిబంధనకు చెందిన స్నాప్‌షాట్‌ను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా తారుమారు చేసే ప్రయత్నంలో భాగంగానే ప్రత్యేక విస్తృత సమీక్షకు ఈసీ ఆదేశాలిచ్చిందంటూ 'ఇండియా' కూటమి విమర్శలు ఉధృతం చేస్తున్న నేపథ్యంలో ఈసీ తాజా వివరణ ఇచ్చింది. ఎన్నికల నిర్వహణ, పర్యవేక్షణ అధికారాన్ని ఎన్నికల కమిషన్ కలిగి ఉంటుందని రాజ్యాంగంలోని 324వ అధికరణ చెబుతోంది. 326వ అధికరణ ఓటర్ల రివిజన్ ఎక్సర్‌సైజ్‌తో అడల్ట్ ఇండియన్ సిటిజన్లకు ఓటు హక్కును తప్పనిసరి చేస్తోంది. రాజ్యాంగంలోని ఈ నిబంధనలను తు.చ. తప్పకుండా తాము పాటిస్తున్నట్టు ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. బీహార్‌లో ప్రత్యేక రివిజన్ రెండు దశాబ్దాల క్రితం 2003లో జరిగిందని ఈసీ తెలిపింది. ర్యాపిడ్ అర్బనైజేషన్, పెద్దఎత్తున వలసలు, తొలిసారి ఓటువేసే వారి సంఖ్య పెరగడం, మరణాలను రిపోర్ట్ చేయకపోవడం వంటివి కూడా ఓటర్ రివిజన్‌కు కారణాలని పేర్కొంది. ఎన్నికల కమిషన్ తాజాగా నిబంధనలను సడలిస్తూ ఓటర్లు తమ దరఖాస్తులను సమర్పిస్తే చాలని, ప్రస్తుతం సపోర్టింగ్ డాక్యుమెంట్లు అవసరం లేదని ప్రకటించింది. ఎన్నికల జాబితా రివిజన్ ప్రక్రియ గత నెల 25న ప్రారంభమైంది. డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్‌ను ఆగస్టు ఒకటో తేదీన ప్రచురణ చేసే అవకాశం ఉంది. సెప్టెంబరు 30న తుది ఓటర్ల జాబితా విడుదలవుతుంది. అక్టోబరు-నవంబరులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

జన్యు వనరుల రక్షణకు భారత్ కృషి చేయాలి

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి శాస్త్రవేత్తల లేఖ

విశాలాంధ్ర- హైదరాబాద్: ప్రస్తుతం జరుగుతున్న అంతర్జాతీయ చర్చల్లో అభివృద్ధి చెందిన దేశాలు ఎటువంటి పరిహారం లేకుండా భారతదేశ జన్యు బ్యాంకుల నుంచి వనరులను పొందేందుకు ప్రయత్నిస్తున్నాయని, ఇది తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, జన్యు వనరులు అపారమైన ఆర్థిక విలువ కలిగిన సార్వభౌమ వనరులని, ప్రపంచ ఆహార భద్రతకు ఆధారమైన జన్యు సముదాయానికి సంబంధించిన అభివృద్ధి చెందుతున్న దేశాల జన్యు వనరులను రక్షించడానికి భారతదేశం కృషి చేయాలని జన్యు వనరుల నిపుణులైన శాస్త్రవేత్తలు డాక్టర్ సుమన్ సహాయ్, డాక్టర్ బి. శరత్ బాబు, డాక్టర్ సోమా మార్ల, డాక్టర్ దినేశ్ కుమార్ అగ్రాల్ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. ఆహారం... వ్యవసాయం కోసం మొక్కల జన్యు వనరులపై అంతర్జాతీయ ఒప్పందం... ప్రతిపాదనలపై భారతదేశం తక్షణ జోక్యం అవసరమన్నారు. కాంట్రాక్టింగ్ పార్టీల 14వ అడ్‌హాక్ వర్కింగ్ గ్రూప్ సమావేశం ఈ నెల 11 వరకు పెరూలోని లిమాలో జరుగుతోంది. సభ్య దేశాలు అందించడానికి అంగీకరించిన పరిమిత మొక్కల జాబితాకు బదులుగా, అన్ని మొక్కల జన్యు వనరులను చేర్చడానికి ప్రస్తుత బహుపాక్షిక ఒప్పందం పరిధిని విస్తరించడం... జన్యు వనరులను అందించే అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలకు విరుద్ధం అన్నారు. ఒప్పందంలో ప్రముఖ సభ్యదేశమైన భారత్ ...మొక్కల జన్యు వనరులతో సమృద్ధిగా ఉందన్నారు. అందుబాటులో ఉన్న పంటల జాబితాల విస్తరణ... లాభాల భాగస్వామ్య చెల్లింపు యంత్రాంగాలపై నిర్దిష్ట భేదాభిప్రాయాలను పరిష్కరించడానికి... అన్ని వాటాదారుల మధ్య ముఖ్యంగా మొక్కల జన్యు వనరులను అందించేవారు, వినియోగదారుల మధ్య సమతుల్యతను సాధించడానికి చర్చలలో నాయకత్వం వహించాలని తాము కోరుతున్నామన్నారు. ఇది ప్రపంచ ఆహార భద్రత...జీవవైవిధ్యాన్ని పరిరక్షించే వారి హక్కులు న్యాయంగా సమర్థించబడే సురక్షితమైన భవిష్యత్తును నిర్ధారిస్తుందని తెలిపారు.

రైల్వే ట్రాక్‌పై ఏనుగు ప్రసవం...

రెండు గంటలు నిలిచిన రైలు

న్యూఢిల్లీ: ఓ ఏనుగు ప్రసవిస్తున్న సమయంలో దాదాపు రెండు గంటలపాటు రైలు నిలిచిపోయినట్లు కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలను కేంద్ర మంత్రి ఎక్స్‌లో షేర్ చేశారు. ఈ ఘటన జార్ఖండ్‌లో చోటు చేసుకుంది. ఓ ఏనుగు రైల్వే ట్రాక్‌పై ప్రసవ వేదన పడుతోంది. అదే సమయంలో అటుగా వెళ్తున్న స్థానికులు రైలు వస్తుండటాన్ని గమనించారు. వెంటనే దాన్ని ఆపేశారు. దాదాపు రెండు గంటల పాటు ట్రాక్‌పైనే రైలు నిలిచిపోయింది. కొద్దిసేపటి తర్వాత గజరాజు తన బిడ్డకు జన్మనిచ్చి ఎంతో సంతోషంగా బిడ్డతో కలిసి అడవిలోకి వెళ్లిపోయింది. ఏనుగు ప్రసవానికి సాయపడిన వారి సున్నితత్వానికి, జార్ఖండ్ అటవీ అధికారులను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. కేంద్ర మంత్రి షేర్ చేసిన ఈ వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఇది చూసిన నెటిజన్లు పాజిటివ్ కామెంట్స్ చేస్తున్నారు. 'ఈరోజు ఓ మంచి వార్తను చూశాము సర్. షేర్ చేసినందుకు ధన్యవాదాలు' అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

కూలిన యుద్ధవిమానం... ఇద్దరు పైలట్లు మృతి

జైపూర్: రాజస్థాన్‌లోని చురు జిల్లా రతన్‌గఢ్ ప్రాంతంలోని భానుడా గ్రామ సమీపంలో బుధవారం ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన యుద్ధ విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు పైలెట్లు మృతి చెందినట్లు తెలుస్తోంది. భారత వైమానిక దళానికి చెందిన జాగ్వార్ యుద్ధ విమానం కూలిపోయినట్లు రక్షణ శాఖ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంది. ఇద్దరు వైమానిక సిబ్బంది గాయపడినట్లు తెలిసింది. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న అధికారులు హుటాహుటిన ఘటనాస్థలికి బయల్దేరి వెళ్లారు. ప్రమాదం సమయంలో పెద్ద శబ్దం వచ్చినట్లు స్థానికులు తెలిపారు. ఫైటర్ జెట్ పొలాల్లో కూలిందని, భారీగా మంటలు, పొగ ఎగసిపడినట్లు చెప్పారు.

విశాలాంధ్ర హైదరాబాద్

పద్మారావునగర్ నాలాను పరిశీలించిన కమిషనర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ముషీరాబాద్ సర్కిల్ నాగమయ్య కుంట నుండి పద్మారావు నగర్ వరకు చేపట్టిన నాలాను జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్ పరిశీలించారు. గతంలో ఎస్ ఎన్ డి ద్వారా చేపట్టిన నాలా అభివృద్ధి పనులను ఇతర కారణాల వల్ల చివరి భాగంలో పూర్తి కాలేదు. మిగిలిపోయిన అసంపూర్తిగా ఉన్న నాలా పనులు సత్వరమే పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. అందుకు కావలసిన నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వరద సందర్భంగా నాలాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నాలా భద్రత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓపెన్ నాలాపై స్లాబ్ పనులు, సరిహద్దు వాల్ నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్ష కాలంలో వరద ఏర్పడిన సందర్భంలో గాని, రోడ్డు మరమ్మత్తులు చేసే సందర్భంలో గాని భద్రతా చర్యల్లో భాగంగా హెచ్చరిక బోర్డులు పెట్టకుండా ప్రమాదాలు జరిగిన సందర్భంలో సంబంధిత ఇంజనీర్ పై క్రమశిక్షణ చర్యలు తప్పవని ఇంజనీర్ అధికారులను ఆదేశించారు. కమీషనర్ వెంట జోనల్ కమీషనర్ రవి కిరణ్, డిప్యూటీ కమిషనర్ రామ సుజా రెడ్డి, జోనల్, సర్కిల్ స్థాయి ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి పాలమూరు రెడ్డి సేవ సమితి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : పాలమూరు రెడ్డి సేవ సమితి ద్వారా షాద్నగర్ వాస్తవ్యులు పి. సుచరిత తండ్రి లోకేశ్వర్ రెడ్డి, జె పి ఎన్ సి కళాశాలలో మూడవ సంవత్సరం బిటెక్ చదువు కోసం 15 వేల రూపాయలు ఆర్థిక సాయం బుధవారం సమితి కార్యాలయంలో అంసించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు తూము ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి వేపూరు రాజేందర్ రెడ్డి, ప్రచార కార్యదర్శి సురేందర్ రెడ్డి, కార్యదర్శి కోటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం దరఖాస్తులకు 12 వరకు గడువు పొడిగింపు

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు సింగరేణి సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రారం భించిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 12 వరకు పొడిగించి నట్లు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా తెలంగాణ రాష్ట్రం నుండి సివిల్స్ ప్రిలిమ్స్‌లో పాసై మెయిన్స్‌కు హాజరవుతున్న అభ్యర్థులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్లు వెల్లడించారు. దరఖాస్తుల స్వీకరణ కు గతంలో ఇచ్చిన గడువు తేదీ ఈ నెల 7తో ముగిసిపోయింది. అయితే అభ్యర్థుల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు ఈ నెల 12 వరకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. సివిల్స్ ప్రిలిమ్స్ లో పాసైన తెలంగాణ ప్రాంత అభ్యర్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని 12వ తేదీలోగా దరఖాస్తులు ఆన్లైన్‌లో సమర్పించాలని కోరారు. అలాగే సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన సింగరేణి ఉద్యోగుల పిల్లలకూ రూ.లక్ష చొప్పున ప్రోత్సాహకం అందించనున్నట్లు తెలిపారు. గతేడాది రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకాన్ని ప్రారంభించారు. వీరిలో 20 మంది మెయిన్స్ లోనూ పాసై ఇంటర్వ్యూకి ఎంపిక కాగా వారికి ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున ప్రోత్సాహకాన్ని అందించింది. ఈ ఏడాది కూడా తెలంగాణ ప్రాంత అభ్యర్థులకు ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించింది.

విద్యార్థులకు ఉచిత నోట్ బుక్స్ పంపిణీ

విశాలాంధ్ర - మల్కాజిగిరి : విద్యార్థులు చదువుతో పాటు వివిధ రకాల పోటీల్లో బాగా రాణించాలంటే లక్ష్య సాధనతో నిరంతరం కృషి చేయాలని అక్షర కౌముది సంస్థ అధ్యక్షురాలు తులసి విజయ లక్ష్మీ అన్నారు. బుధవారం అక్షర కౌముది సేవా సంస్థ దాతల సహకార సంయుక్త ఆధ్వర్యంలో నేరేడ్‌మెట్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచిత నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు మాట్లాడుతూ సమాజ సేవలో అక్షర కౌముది సంస్థ ఎప్పుడు ముందుంటుంది. అలాగే నేటి బాలలే రేపటి పౌరులు విద్యార్థుల భవితను నిర్దేశించే శక్తి కేంద్రాలు పాఠశాలలు అని పేర్కొన్నారు. పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి చదువుతున్న 250 మంది విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ దాతల సమక్షంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయప్రద మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువ మంది పేద విద్యార్థులు ఉంటారు వారికి ప్రభుత్వం పరంగా కొన్ని సదుపాయాలు ఉన్నప్పటికీ ఇంకా మెరుగైన విద్యను విద్యార్థులకు అందించాలనే ఉద్దేశంతో అక్షర కౌముది సంస్థ వంటి అనేక స్వచ్ఛంద సంస్థలు ఉచిత నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమం, వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టడం హర్ష దాయకం అన్నారు. ఈకార్యక్రమంలో అక్షర కౌముది సంస్థ గౌరవాధ్యక్షులు తులసి వెంకట రమణా చార్యులు, సంస్థ ప్రచార కార్యదర్శి బచ్చలి మాధవి, సహాయ కార్యదర్శి రామచంద్రుడు, సాంకేతిక కార్యదర్శి గరిమెళ్ళ రాజేంద్ర ప్రసాద్, పద్మ, శ్రీనివాస రావు, సుబ్బారావు, తెనాలి శేషు కుమార్, రాధిక కొండలలిత, పాఠశాల ఉపాధ్యాయ బృందం ఉమారాణి అనిత పార్వతమ్మ పద్మశ్రీ, దీప పాల్గొన్నారు.

వికలాంగుల సంక్షేమానికి చర్యలు : ముత్తినేని

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల అభివృద్ధి, సంక్షేమం కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య స్పష్టం చేశారు. బుధవారం సెర్ప్ ఆఫీస్‌లో సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్‌తో ప్రత్యేకంగా సమావేశం కావడం జరిగింది. ఈ సమావేశంలో సెర్ప్ ద్వారా వికలాంగుల సంక్షేమ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను సీఈఓ, సెర్ప్ డైరెక్టర్‌లు వివరించారు. వాటిలో అత్యంత ముఖ్యంగా వికలాంగులనీ ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా వికలాంగుల స్వయం సహాయక బృందాలను తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 18 వేల గ్రామాలలో 18 వేల వికలాంగుల స్వయం సహాయక బృందాల ఏర్పాటుతో పాటు ఆ గ్రూప్ లకి ఆర్థిక సహాయం అందిస్తూ ఆర్థికంగా వృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ డైరెక్టర్‌లు సాయి కిషోర్, కృష్ణమూర్తితో పాటు ఈ అంశంపై పనిచేస్తున్న అధికారులు పాల్గొనడం జరిగింది.

విద్యార్థులు పట్టుదలతో లక్ష్యాలను సాధించుకోవాలి

జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి

విశాలాంధ్ర - హైదరాబాద్ : విద్యార్థులు జీవితంలో వచ్చే ఒడిదుడుకులను ధైర్యం, పట్టుదలతో అధిగమించి తమ లక్ష్యాలను సాధించుకోవాలని జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి హితవు చెప్పారు. బుధవారం షేక్ పేట సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో కౌమార దశలో ఉన్న విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి "గెట్ ఆసమ్" పేరిట జరుగుతున్న వర్క్‌షాప్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ ప్రసంగించారు. మానవ జీవితంలో అవరోధాలు, అపజయాలు, ఒడిదుడుకులు సహజమని వాటిని ఎదుర్కొని తమ కలల సాకారానికి విద్యార్థులు కృషి చేయాలని ఆమె సూచించారు. చదువుతో పాటు వ్యాయామం తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ధ్యానం ద్వారా మానసిక వత్తిడిని జయించాలని అన్నారు. విద్యార్థులు తమ లక్ష్య సాధనలో ఒంటరిగా కాకుండా బృందంగా చేసే ప్రయత్నాలు ఉన్నత ఫలితాలు ఇస్తాయని ఉద్బోధించారు. సివిల్ సర్వీస్ సాధనలో తాను తన మిత్రులు బృందంగా ప్రిపేర్ అయ్యి అందరూ సివిల్ సర్వీసెస్ సాధించారని ఆమె తెలిపారు. సాలీడు ప్రయత్నాలను ఆదర్శంగా తీసుకొని విజయం సాధించిన బ్రూస్ రాజు కథను ఆమె ఉదాహరణగా వివరించారు. స్కాట్లాండ్ కోసం పోరాడి ఓటమి పాలై నిరాశ నిస్పృహలతో ఉన్న రాజు రాబర్ట్ బ్రూస్ ఒక సాలీడు తన గూడు నిర్మించుకోవడంలో పదే పదే విఫలమవుతున్నా పట్టుబడకుండా ప్రయత్నించడం గమనించాడు. సాలీడు చివరికి సఫలం కావడం గమనించి తాను పట్టు వదలక యుద్ధం చేసి విజయం సాధించాడని ఈ సందర్భంగా కలెక్టర్ వివరించారు. విద్యార్థులు కూడా ఇష్టపడి, మొక్కవోని దీక్షతో, బృందాలుగా ఏర్పడి తమ ప్రయత్నాలు సాధించాలని ఆమె విద్యార్థులకు సలహా ఇచ్చారు. టీనేజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ లలితా ఆనంద్ కౌమార దశలో ఉన్న విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి గెట్ ఆసమ్ పేరిట వర్క్‌షాప్‌ను నిర్వహించారు. వత్తిడిని జయించడం, ఏకాగ్రత, ఆత్మస్థైర్యం పెంపొందించుకోవడం కోసం ధ్యానం, యోగాసనాలు, డాన్స్ బృంద కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు ఈ వర్క్‌షాప్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అనంతరం షేక్ పేట సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల / జూనియర్ కళాశాల అభివృద్ధిని జిల్లా కలెక్టర్ సమీక్షించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ మరియు ఐఐటీ జేఈఈ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు, విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు ప్రిన్సిపాల్ ను అభినందించారు. కళాశాల మైదానంలో మొక్క నాటి అలాగే పాఠశాల ఆవరణలో విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ బాలస్వామి, అధ్యాపకులు బాలరాజు, బీమయ్య, వివిధ విభాగల అధ్యాపకులు పాల్గొన్నారు.

సామాన్యుల పిల్లలకు ఉత్తమ విద్యను అందించడమే లక్ష్యం

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : గురుకులాల లక్ష్యం సామాన్యుల పిల్లలకు ఉత్తమ విద్యను అందించడమే కాకుండా ప్రభుత్వం అందిస్తున్న వసతులను విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందేలా చూడడం అధికారుల బాధ్యత అని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు రాధికగుప్తా అన్నారు. బుధవారం శామీర్‌పేట మండలంలోని మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ పాఠశాల మరియు కళాశాలలో జిల్లా అదనపు కలెక్టరు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విద్యార్థుల వసతులు, ఆహార నాణ్యత, పరిశుభ్రత, విద్య బోధన వంటి ముఖ్య అంశాలపై సమగ్రంగా పరిశీలించారు. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని, విద్యతోనే భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. స్కూల్లో వసతులు ఎలా ఉన్నాయని, భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెను ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకొని, మెను చార్టును పరిశీలించారు. ఈరోజు మెనులో ఏమి వండారని అడిగి, వంటలను పరిశీలించారు. స్కూలు కాలేజీ కలిపి మొత్తం ఎంత మంది విద్యార్థులున్నారని ఇంటర్‌లో ఏఏ గ్రూపులు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. స్టోర్‌రూం లోని వంట సామాగ్రిని పరిశీలించి, నాణ్యమైన, ఎక్స్పైరీ డేట్ చెక్ చేస్తూ సామాగ్రిని వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేందుకు అవసరమైన బోధన ఉపకరణాలను ఉపయోగించి విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆరోగ్యపరంగా విద్యార్థులపై తగిన శ్రద్ధ తీసుకోవా లని అదనపు కలెక్టర్ సూచించారు. అందరికీ పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందాయా అని, గురుకుల పాఠశాలల్లో ఎదుర్కొంటున్న సమస్యలు అవసరాలపై విద్యార్థుల అభిప్రాయాలను అదనపు కలెక్టరు రాధికగుప్తా అడిగి తెలుసుకున్నారు. గురుకులాల లక్ష్యం సామాన్యుల పిల్లలకు ఉత్తమ విద్యను అందించడమేనని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. శామీర్ పేట్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను కూడా సందర్శించారు. అదనపు కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖాధికారి విజయ కుమారి, జిల్లా బిసి సంక్షేమ శాఖాధికారి ఝాన్సీరాణి, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్, గురుకుల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, అధికారులు ఉన్నారు.

మీ తలరాత మారుస్తాం : ఎమ్మెల్యే యెన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : మీ తలరాత మార్చి మిమ్మల్ని ఉన్నత శిఖరాలకు చేరుస్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి 2 కోట్ల రూపాయలతో 3.10 కోట్ల రూపాయలతో నిర్మించనున్న ఒకేషనల్ జూనియర్ కాలేజ్ భవన నిర్మాణానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మీ తల్లిదండ్రులు మీపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వారు కష్టపడి మిమ్మల్ని చదివిస్తున్నారని ఆయన చెప్పారు. ఈ రెండు సంవత్సరాలు కష్టపడితే భవిష్యత్తు బాగుంటుందని, టైపాస్ చేస్తే జీవితం కూడా టైంపాస్ అవుతుంది అని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖ మంత్రిగా ఉన్నారని, ఆయన ప్రతి వారం విద్య పైన సమీక్ష నిర్వహిస్తున్నారని తెలిపారు. వారి ఆశీస్సుల తోనే బాసర ఐఐఐటి కళాశాలను మన మహబూబ్ నగర్‌కు రావడం జరిగిందని చెప్పారు. మీకు ఎన్నో అద్భుతమైన అవకాశాలు వస్తున్నాయని, మీకు కావాల్సిన అన్ని సౌకర్యాలు, వసతులు కల్పించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. గతంలో మన తెలంగాణ రాష్ట్రం విద్యలో దేశంలో 36వ స్థానంలో ఉండేదని, కేవలం ఒక్క సంవత్సరంలోనే 26వ స్థానానికి తెలంగాణ రాష్ట్రం రావడం చాలా సంతోషంగా ఉందని, రానున్న రెండు మూడు సంవత్సరాల్లో 5స్థానాలలోపు తెలంగాణ రాష్ట్రం ఉండాలని, మనందరి కృషితోనే అది సాధ్యం అవుతుంది అని ఆయన చెప్పారు. రాబోయే రోజుల్లో ఉమ్మడి జిల్లాలోనే కాకుండా, తెలంగాణ రాష్ట్రంలోనే మన ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ఒకేషనల్ జూనియర్ కళాశాల మొదటి స్థానంలో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. మొన్నటి వరకు ఒక లెక్క ఇప్పటినుండి ఒక లెక్క అని ఆయన చెప్పారు. ఎలాంటి సౌకర్యాలు కావాలన్నా ఇవ్వడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, టిపిసిసి అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, రాజేందర్ రెడ్డి, గట్టు వెంకట్ రెడ్డి, సతీష్ రెడ్డి, భీం రెడ్డి, డా.జహంగీర్ అలీ, ఇంటర్మీడియట్ విద్యాధికారి కౌసర్ జహాన్, కళాశాల ప్రిన్సిపాల్ భగవంతచారి, నర్సింహులు, నర్సింహారెడ్డి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించిన పిఎంఓ డైరెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : పిఎంఓ ఆఫీస్ డైరెక్టర్ మన్మీత్ కౌర్ ఖైరతాబాద్ ఇందిరా నగర్, బన్సీలాల్ పేట్‌లోని జివై రెడ్డి నగర్‌లో నిర్మించిన రెండు పడకల గదుల నిర్మాణాలు బుధవారం పరిశీలించారు. ముందుగా ఇందిరా నగర్‌లో రెండు పడకల నిర్మాణాలను పరిశించించి లబ్ధిదారుల ఇంట్లోకి వెళ్లి స్వయంగా ఆమె మాట్లాడారు. మంజూరు కానప్పుడు మీరు ఎక్కడ ఉన్నారని లబ్ధిదారులను ఆమె అడిగారు. ఇంతకు ముందు ఇదే స్థలంలో గుడిసెలు వేసుకొని ఒక్క రూమ్‌లో ఉండే వారమని లబ్ధిదారులు ఆమెకు వివరించారు. సముదాయంలో ఏవైనా సమస్యలు, నిర్వహణ ఎలా చేసుకుంటున్నారని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి మాట్లాడుతూ సముదాయంలో నిర్వహణ కోసం నిర్మించినా కమర్షియల్స్ షాపులు కిరాయికి ఇవ్వడం జరుగుతుందని, అట్టి సొమ్ముతో సముదాయం లిఫ్ట్, కరెంట్ బిల్లులు చెల్లిస్తున్నట్లు అసోసియేషన్ ప్రతినిధి ఆమెకు వివరించారు. అంగన్వాడీ, బస్తీ దవాఖాన, పాఠశాల దగ్గర్లో ఉన్నాయా అంటూ మహిళా లబ్ధిదారులను అడిగారు. అంగన్వాడీ టీచర్ అందిస్తున్న సేవలు వివరించారు. ఇందిరా నగర్ కాలనీలో దగ్గరలోనే బస్తీ దవాఖానా, అంగన్వాడి, పాఠశాల అన్ని వసతులు ఉన్నాయని లబ్ధిదారులు వివరించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న పథకాలు అర్హులైన వారికి అందించేందుకు మేళాలు ఏర్పాటుకు అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. పెన్షన్, స్వయం సహాయక సంఘాలు ఆర్థికాభివృద్ధి పొందిన రుణాలు ఎలా సద్వినియోగం చేసుకుంటున్నారని డైరెక్టర్ మహిళలను అడిగి తెలుసుకున్నారు. పెన్షన్, మహిళలకు రుణాలు పొందుతున్నట్లు మహిళలు వివరించారు. అంతకు ముందు హౌసింగ్ అధికారులు ఏర్పాటు చేసిన ఫోటో చిత్ర ప్రదర్శన రెండు పడకల నిర్మాణ పరిస్థితిని హౌసింగ్ అధికారులు వివరించారు. గతంలో ఇన్ సీటు పరిస్థితిని వారు వివరించారు. తదనంతరం బన్సీలాల్ పేట్ జివై రెడ్డి రెండు పడకల గదుల నిర్మాణ సముదాయాన్ని పరిశీలించారు. ఇక్కడ కూడా అవే ప్రశ్నలు డైరెక్టర్ అడిగి లబ్ధిదారుల నుండి వివరాలను తెలుసుకున్నారు. డైరెక్టర్ మన్మీత్‌కౌర్‌తో పాటు జిహెచ్ఎంసి కమిషనర్

స్ట్రైకర్స్ మాకో రోబోటిక్ సిస్టమ్ ప్రారంభం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: కేర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీ , వైద్య రంగంలో మరో ముందడుగుగా, అత్యాధునిక ఏఐ ఆధారిత స్ట్రైకర్ మాకో రోబోటిక్ సర్జరీ సిస్టమ్‌లిను ప్రారంభించింది. ఇది తెలంగాణలో రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సలకు ఒక కొత్త దశను ప్రారంభించింది. ఈ సాంకేతికతను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ ఖన్నాలిలతో కలిసి ప్రారంభించారు. కేర్ హాస్పిటల్స్ గ్రూప్ చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ నిఖిల్ మాథుర్, గ్రూప్ చీఫ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్ శలభ్ డాంగ్, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్లు డాక్టర్ అశోక్ రాజు గొట్టెముక్కల, డాక్టర్ వాసుదేవ జువ్వాడి, డాక్టర్ జగన్ మోహన్ రెడ్డి, డాక్టర్ శరత్ బాబు, ఇతర సీనియర్ డాక్టర్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాట్లాడుతూ "తెలంగాణ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో అధునాతన ఏఐ ఆధారిత రోబోటిక్ సాంకేతికతను జోడించడం, తదుపరి తరం వైద్య సాంకేతికతను స్వీకరించడంలో మన రాష్ట్రం చేసిన ప్రగతిని సూచిస్తోంది. రోగులకి మెరుగైన ఫలితాలు అందించడంలో, వైద్యరంగంలో ఉన్నత ప్రమాణాలను స్థాపించడంలో కేర్ హాస్పిటల్స్ చేస్తున్న కృషిని నేను అభినందిస్తున్నాను" అని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే స్ట్రైకర్ మాకో రోబోటిక్ సిస్టమ్, శస్త్రచికిత్సను ఇంకా ఖచ్చితంగా చేయడంలో సహాయ పడుతుంది. ఇది ముఖ్యంగా మొత్తం మోకాలి, పాక్షిక మోకాలి, తుంటి మార్పిడి శస్త్రచికిత్సలలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

గ్లో బై కీర్తిలాల్స్ షోరూం ప్రారంభం

విశాలాంధ్ర - హైదరాబాద్: హౌస్ ఆఫ్ కీర్తిలాల్స్ నుండి వచ్చిన ఆధునిక డైమండ్ గోల్డ్ జ్యువెలరీ బ్రాండ్ గ్లో బై కీర్తిలాల్స్ తమ నూతన షోరూమ్‌ను నగరంలోని ఆర్‌కేవీ రోడ్‌లో తన అత్యాధునిక ప్రత్యేక షోరూమ్‌ను ఏర్పాటు చేసింది. షోరూం ప్రారంభించిన సందర్భంగా కీర్తిలాల్స్ బిజినెస్ స్ట్రాటజీ డైరెక్టర్ సూరజ్ శాంత కుమార్ మాట్లాడుతూ నూతన షోరూం దేశవ్యాప్తంగా బ్రాండ్ విస్తరణలో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని వెల్లడించారు. అత్యంత ప్రైమ్ లోకేషన్లలో ఒకటైన ఆర్ కేవీ రోడ్లో గ్లో బై కీర్తిలాల్స్ కొత్త షోరూంను ఏర్పాటు చేశామన్నారు. ఈ కొత్త షోరూమ్ గ్లో సిగ్నేచర్ కలెక్షన్లోని సొగసైన, తేలికపాటి సహజ వజ్రాలు, బంగారు ఆభరణాలను, అభిరుచి గల పట్టణ కస్టమర్ల కోసం అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. నేటి ఆధునిక మహిళల జీవనశైలిని ప్రతిబింబించేలా రూపొందించబడిన ఈ షోరూమ్, రోజువారీ ధరించదగిన, కాలాతీత సొగసును మేళవించే ఆభరణాలతో ప్రత్యేకతను చాటుతుందన్నారు. గ్లో బై కీర్తిలాల్స్ నగర వాసులకు సరైన గమ్యస్థానంగా నిలుస్తోందని, ఈ విస్తరణ ద్వారా తాము కొత్త కస్టమర్లతో కనెక్ట్ అవుతూ, వృద్ధి ఆవిష్కరణల పట్ల మా వ్యూహాత్మక నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నామన్నారు. బెంగళూరు, చెన్నై, కొచ్చి, త్రిస్సూర్, తిరుపూర్ హైదరాబాద్లలో ఇప్పటికే ఉన్న నెట్వర్క్‌లో చేరుతూ, ఈరోడ్‌లోని ఈ కొత్త షోరూమ్ గ్లో బై కీర్తిలాల్‌కు భారతదేశంలో ఏడవ కేంద్రంగా నిలిచిందని అన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధి, త్రాగునీరు, మురుగునీరు సమస్యల పట్ల జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో కలిసి వినతిపత్రాలు అందజేయడం జరిగింది. మల్కాజిగిరి నియోజకవర్గంలోనీ మచ్చ బొల్లారం డివిజన్ జనప్రియ ఆర్కేడ్‌లో నీటి బిల్లు బకాయిలను ఎత్తివేయాలని, భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టాలని, భూగర్భ డ్రైనేజీ త్రాగునీరు పైపులైను నూతన ప్రతిపాదనలు అందజేసి అదే విధంగా మచ్చ బొల్లారంలోని పంచశీల్ ఎన్ క్లేవ్ ఏడు కాలనీల పరిసర ప్రాంతంలో మురుగునీరు అవుట్లెట్ లేక నిల్వ నీరు నిల్వ ఉండి బోర్వెల్ నుండి కలుషితమై నీరు నురగగా రావడం, లాంటి సమస్యలను చర్చించి పరిష్కార దిశగా కృషి చేయాలని కోరారు. ఈ సమస్యల పట్ల జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.

ఐఎండిబి జాబితాలో చావా మొదటిస్థానం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఐఎండిబి 2025లో ఇప్పటివరకు వచ్చిన, ఎంతగానో ఎదురుచూడబడుతున్న ప్రముఖ భారతీయ సినిమాలను ప్రకటించింది. ఐఎండిబి వినియోగదారుల ప్రపంచ వ్యాప్త పేజ్ వీక్షణల ఆధారంగా ఇంతవరకు ఛావా 2025లో విడుదల అయిన అత్యంత ప్రాచు ర్యం పొందిన భారతీయ సినిమా, కాగా కూలీ ఎంతగానో ఎదురు చూడబడుతున్న సినిమాల జాబితాలో మొట్టమొదటి స్థానంలో ఉంది. ఐఎండిబి 2025లో ఇప్పటి వచ్చిన అత్యంత ప్రాచుర్యం పొందిన భారతీయ సినిమాల జాబితాలో ఛావా మొదటి స్థానంలో నిలిచి నందుకు గర్వంగా ఉంది," అని ఛావా దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ అన్నారు. "ఇది నేరుగా ఫ్యాన్స్ అభిప్రాయం కాబట్టి ఈ గుర్తింపు చాలా ప్రత్యేకంగా ఉంటుందన్నారు. వారి అభిమానం, విక్కీ కౌషల్, రష్మిక మందన, అక్షయ్ ఖన్నా ముఖ్య పాత్రలు పోషించిన ఈ మడాక్ ఫిల్మ్, నటనకు సానుకూల గుర్తింపు చాలా హృద్యంగా ఉంది. ఈ జాబితాలు, ఏ సినిమా చూడాలని కనుగొనుటకు నిర్ణయించుటకు ఐఎండిబి పై ఆధారపడే, ప్రపంచవ్యాప్తంగా ఐఎండిబి ని సందర్శించిన 250 మిలియన్లకు పైగా నెలవారి సందర్శకుల అసలైన పేజ్ వీక్షణల ఆధారంగా తీసుకోబడ్డాయి.

43,603 ట్రాక్టర్ల అమ్మకాలలో ముందు వరుసలో సోనాలికా

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారతదేశంలో నంబర్ 1 ట్రాక్టర్ ఎగుమతి బ్రాండ్ అయిన సోనాలికా ట్రాక్టర్స్, రైతులు మెరుగైన ఉత్పాదకత శ్రేయస్సును సాధించడానికి అనుకూలీకరించిన దాని హెవీ డ్యూటీ ట్రాక్టర్లతో కొత్త ప్రమాణాలను సృష్టించడానికి ప్రసిద్ధి చెందింది. ఈ విధానం ఏప్రిల్-జూన్ 2025 మధ్య కాలంలో 43,603 ట్రాక్టర్ల అమ్మకాలతో కంపెనీ ఎఫ్ వై 26లో కొత్త రికార్డు బద్దలు కొట్టే పనితీరును నమోదు చేయడానికి వీలు కల్పించింది. విజయంపై తన అభిప్రాయాలను పంచుకుంటూ, ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రామన్ మిట్టల్ మాట్లాడుతూ, "మా హెవీ డ్యూటీ ట్రాక్టర్ల ద్వారా అందించబడే 'దమ్ ఆగే బద్నే కా' అనే మా వాగ్దానంతో ప్రతి రైతు ప్రయాణానికి అర్థవంతంగా తోడ్పడాలని మేము ఎల్లప్పుడూ లక్ష్యంగా పెట్టుకున్నాము. జూన్‌లో మా అత్యుత్తమ పనితీరును కలుపుకొని, 43,603 ట్రాక్టర్ల అత్యధిక క్యూ1 అమ్మకాలను నమోదు చేయడానికి ఇది మమ్మల్ని నడిపించినందుకు మేము సంతోషంగా ఉన్నామన్నారు.

ఘనంగా హరికిషన్ సగర జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: తెలంగాణ సగర సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముత్యాల హరికిషన్ సగర పుట్టినరోజు వేడుకలను హైద్రాబాద్, చందానగర్, పాపిరెడ్డి కాలనీలోని శారద విద్యానికేతన్ అనాధ శరణలయంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర కేక్ కటింగ్ చేయించి, పండ్లు పంపిణీ చేశారు. అనాధ ఆశ్రమంలోని అనాధ పిల్లలకు అన్నదానం చేయడం జరిగింది. పిల్లలతో కేక్ కటింగ్ చేపించి పిల్లలకు పండ్లు, భోజనం పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మోడల ఆంజనేయులు సగర, రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి బంగారు ఆంజనేయులు సగర, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మోడల రవి సగర, ప్రధాన కార్యదర్శి ఆవుల వెంకటరాములు సగర, రాష్ట్ర సోషల్ మీడియా ఇంచార్జ్ నార్లకంటి నరేందర్ సగర, గ్రేటర్ హైదరాబాద్ యువజన సగర సంఘం కార్యనిర్వాహన కార్యదర్శి గుంటి వినోద్ సగర, దిండి సాయి బాబు సగర హాజరయ్యారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : వర్షాకాలంలో ప్రబలే త్రాగునీటి, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల పట్ల ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించి అప్రమత్తంగా ఉండాలని అదనపు సంచాలకులు హైదరాబాద్ జిల్లా సీజనల్ వ్యాధుల నియంత్రణ ప్రత్యేక అధికారి డాక్టర్ ఆర్.పుష్ప అన్నారు. బుధవారం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి ఆడిటోరియంలో సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్లు, ఆరోగ్య జి.హెచ్.ఎం.సి సిబ్బందికి నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ, ఈ వర్షాకాలంలో నీటి ద్వారా నీళ్ల విరోచనాలు, డయేరియా, టైఫాయిడ్, జ్వరం, దగ్గు, జలుబు, దోమల ద్వారా మలేరియా, డెంగు, చికెన్ గున్యా, బోధకాలు, మెదడువాపు వ్యాధులు వ్యాపిస్తాయని, వీటిపట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. జి.హెచ్.ఎం.సి సిబ్బంది సమన్వయంతో సమావేశాలు నిర్వహించి, నీటి నిల్వలు లేకుండా, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి, పైపుల లీకేజీ అరికట్టుటకు, పరిసరాల పరిశుభ్రతకు, దోమల నివారణకు తగు మందులు స్ప్రే చేయాలన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జె. వెంకటి ఈ సదస్సులో మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమయ్యే జూన్ నుండి పక్కా ప్రణాళికతో వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టామని, నీటి నిల్వలు లేకుండా, దోమలు పెరిగే ప్రదేశాలను గుర్తించి, లార్వా నివారణ చర్యలు చేపట్టామని ప్రతి శుక్రవారం డ్రైడే పాటిస్తున్నామని తెలియజేశారు. జోనల్ మలేరియా సీజనల్ వ్యాధుల ప్రత్యేక అధికారి డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది ప్రతి రోజు గృహంలో జ్వరసర్వేతో పాటు, దోమల లార్వా నిల్వలను గుర్తించి, తొలగించుటకు, ఇంటిలో ఉన్న సభ్యులందరికీ అవగాహన కల్పించి దోమల నివారణకు నిరంతర చర్యలు చేపట్టలన్నారు. ఖైరతాబాద్ జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం, విజయకుమార్ సహాయ సంచాలకులు, జిల్లామీడియా అధికారి జక్కుల రాములు, జిహెచ్ఎంసి సీనియర్ ఎంటమాలాజిస్ట్లు డిప్యూటీ డెమో టి.నరసింహ ఆరోగ్య విస్తరణ అధికారి ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం యూరియా సరఫరా చేయాలి : మంత్రి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర రసాయనాలు ఎరువుల మంత్రి నడ్డాని కలిసి రాష్ట్రానికి కేటాయించిన విధంగా యూరియా, నెలవారీ ప్రకటించిన ప్రణాళిక ప్రకారం ఇవ్వాల్సిందిగా కోరిన విషయం తెలిసిందే. కేంద్రం ప్రకటించిన విధంగా సరఫరాలు జరుగుతాయని ఆశించిన రాష్ట్ర ప్రభుత్వం తదనుగుణంగా జిల్లాల వారీ ప్రణాళిక చేసుకుందని మంత్రి తుమ్మల తెలిపారు. దిగుమతి యూరియాలో మన రాష్ట్రానికి కేటాయించిన యూరియా సరఫరా జరగకపోవడం మూలంగా దేశీయంగా ఉత్పత్తయ్యే యూరియాను కేటాయించవల్సిందిగా, తదనుగుణంగా రాష్ట్రంలో ఉన్న రామగుండం ఎరువుల కంపెనీ నుంచి కేటాయింపులను 30000 నుండి 60000 టన్నులకు పెంచాల్సిందిగా విజ్ఞప్తి చేయడం జరిగిందని అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం రైతుల అవసరాల మేరకు నిల్వలున్నాయని, చాలా పంటలు ఆరంభదశలో ఉండటం వలన ప్రస్తుతం యూరియా అవసరమున్న లేకపోయిన రైతులు కొనుగోలు చేస్తున్నారని, రానున్న రోజుల్లో కేంద్రం నుండి ఆగస్టు మాసానికి కూడా సరిపడా ఎరువులు త్వరలోనే రాష్ట్రానికి అందుతాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లాలవారీ యూరియా లభ్యత, రోజువారీ కొనుగోళ్ల వివరాలను అధికారులు మంత్రికి తెలియజేయగా.. జిల్లాల వారీ సాగు విస్తీర్ణాలు, కేంద్రం నుండి సరఫరా అవుతున్న పరిమాణాలను బట్టి జిల్లాల వారీ ప్రణాళిక చేసుకోవల్సిందిగా సూచించారు. ఏ మండలంలో ఎక్కడా లోటు లేకుండా ఎరువులను ఆయా మండల కేంద్రాలలో సిద్ధం చేసే బాధ్యత జిల్లా అధికారులు తీసుకోవాలని, ఎక్కడైనా, ఏ డీలరైనా సొసైటీ నిర్వహకులతో సహా యూరియా బస్తాను అధిక ధరకు విక్రయించినా, యూరియా బస్తాలకు లింక్ పెట్టి అమ్మాలని చూసినా లేక ఎరువుల కృత్రిమ కొరత సృష్టించడానికి చూసిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ప్రతి జిల్లా కలెక్టర్‌కు రోజువారీ ఎరువుల నిల్వలు పంపించే ఏర్పాటు చేసినందుకు వారు సంబంధిత అధికారులతో నిత్యం సమీక్షిస్తూ రైతులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి.

కేంద్రం నుండి రాష్ట్రానికి జులై వరకు కేటాయించిన 6.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి వచ్చేవరకు నిత్యం కేంద్ర మంత్రిత్వ శాఖ ప్రతినిధులతో సమన్వయం చేసుకోవల్సిందిగా అధికారులను ఆదేశించారు.

ఘనంగా రిధి డెంటల్ క్లినిక్ వార్షికోత్సవం

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రామ్‌చంద్ కాలనీ పర్వతాపూర్‌లో రిధి డెంటల్ క్లినిక్ రెండవ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ మేయర్ అమర్ సింగ్ పాల్గొని కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సమాజానికి వైద్య సేవలందించడంలో డెంటల్ క్లినిక్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. క్లినిక్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఉచిత డెంటల్, మెడికల్ చెక్‌అప్ శిబిరం నిర్వహించారు. ప్రజల ఆరోగ్యంపై అవగాహన పెంచే దిశగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు అభినందించారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ పలువురు ఈ శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. క్లినిక్ వ్యవస్థాపకులు మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన దంత చికిత్సలతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. యాసారం మహేష్, మేడిపల్లి హనుమాన్ టెంపుల్ చైర్మన్ రామ్ రెడ్డి, మేడిపల్లి మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు చిలుముల అజయ్ రెడ్డి పాల్గొన్నారు.

ఏపీలో పెరుగుతున్న ఓవర్‌యాక్టివ్ బ్లాడర్ కేసులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్‌లోని యువతులలో ఓవర్‌యాక్టివ్ బ్లాడర్ వ్యాప్తిపై హెచ్చరిక గంటలు మోగుతున్నందున, ఈ పెరుగుతున్న ప్రజారోగ్య ఆందోళనను తగ్గించడానికి నిపుణులు సమిష్టి చర్య తీసుకోవాలని కాకినాడకు చెందిన ఎంసీహెచ్ యూరాలజిస్ట్ డాక్టర్ ఎ.హర్షవర్ధన్ సూచించారు. ఇటీవలి డేటా ప్రకారం, మూత్ర ఆపుకొనలేని సమస్యతో బాధపడుతున్న మహిళల్లో 33శాతం మంది ఓఏబి-సంబంధిత లక్షణాలను ఎదుర్కొంటున్నారని, 15శాతం మంది వారి సామాజిక మరియు భావోద్వేగ శ్రేయస్సుకు భంగం కలిగించే తీవ్రమైన కేసులతో బాధపడుతున్నారని చెప్పుకొచ్చారు. 21 నుండి 30 సంవత్సరాల వయస్సు గల మహిళల్లో ఆందోళన కలిగిస్తుందన్నారు. మూత్ర సమస్యలు వృద్ధులను మాత్రమే ప్రభావితం చేస్తాయనే సాధారణ అపోహ ఉందని, కానీ మనం ఎక్కువగా యువత, ఆరోగ్యవంతులైన మహిళలు ఓవర్‌యాక్టివ్ బ్లాడర్‌తో పోరాడుతున్నట్లు చూస్తున్నామన్నారు. వారిలో చాలామంది లక్షణాలను మౌనంగా భరిస్తున్నారని, ఇది తాత్కాలిక సమస్య అని లేదా వైద్యుడితో కూడా చర్చించడానికి చాలా ఇబ్బందికరంగా ఉంటుందని నమ్ముతారని వివరించారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం

విశాలాంధ్ర - హైదరాబాద్ : కార్మిక ఉద్యోగ ప్రజా వ్యతిరేక శాసనాలు పాలకుల మనగడ ఎక్కువ రోజులు సాగించ లేవని కనుక కార్మిక ఉద్యోగ సంక్షేమానికి మరణ శాసనాలైన వాటిని తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ మనసరిస్తున్న కార్మిక ఉద్యోగ ప్రజా వ్యతిరేక విధానాల నిరసిస్తూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతుగా బుధవారం మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పారిశుధ్య సెక్యూరిటీ పేషంట్ కేర్ సూపర్వైజర్ కార్మికులు, ఆస్పత్రి వివిధ విభాగాల ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్, రెగ్యులర్ ఎంప్లాయిస్ ఒక గంట విధులు బహిష్కరించి ఆస్పత్రి ప్రాంగణంలో భారీ ర్యాలీ నిర్వహించి ఆస్పత్రి ఎదుట ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల కార్మికుల ఉద్యోగులు హక్కులు కోల్పోయి శ్రమదోపిడికి బానిస బతుకులకు గురయ్యే ప్రమాదం దాపురిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో పోరాటాలు చేసే సాధించుకున్న 44 కార్మిక చట్టాలను సవరణల పేరుతో 29 కార్మిక చట్టాలను పూర్తిగా రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లుగా రూపాంతరం చేశారని దీని ఫలితంగా కార్మిక వర్గానికి తీవ్రమైన శ్రమతో పాటు ఆర్థికంగా సామాజికంగా చితికి పోతారని అన్నారు. వైద్యరంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని, పిఆర్సి ప్రకటించాలని, వైద్య విధాన పరిషత్ పరిధిలోని వైద్య ఉద్యోగులకు 010 పద్దు కింద వేతనాలు అందించాలని పని భారం తగ్గించాలని జీవో నెంబర్ 282ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు యం.మధుసూదన్ రెడ్డి, తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి)రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోటేశ్వర్ రెడ్డి, అరుణ్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షులు చెన్నయ్య ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షులు గోపాల్ నాయక్, యూనియన్ నాయకులు కార్మికులు బాలకోటి బుచ్చన్న రంగన్న మొగులన్న దేవానంద్ బాలరాజ్, మురళి, అంజి, యాదయ్య, మున్న, నరసింహ, మన్యం, వెంకటయ్య, వీరాంజనేయులు, రామకృష్ణ, రాఘవేందర్, నరేష్, చిన్నన్న, శంకర్, గంగాధర్, బాలరాజ్, మన్యం, దేవి, అంజమ్మ, వరలక్ష్మి, సునీత, సరోజ పాల్గొన్నారు.

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోర్టు బిల్లులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ, సీఐటీయూ, ఏఐయూసీటీ సంఘాల ఆధ్వర్యంలో చందానగర్ మున్సిపల్ కార్యాలయం అంబేద్కర్ విగ్రహం నుండి వివిధ రంగాల కార్మికులను కలుపుతూ భారీ ప్రదర్శన నిర్వహించారు. ర్యాలీలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక బిల్లులను వెంటనే రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రంగాలలో ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సిఐటియు జిల్లా నాయకులు చల్లా శోభన్, సిపిఐ నాయకులు చందు యాదవ్ మరియు కార్మిక సంఘాల నాయకులు రాములు మురళి దశరథ నాయక్ నాగమణి శ్రీలత నీరజ నిర్మల పాల్గొన్నారు.

విశాలాంధ్ర - హైదరాబాద్ : జాతీయ సమ్మె పిలుపు మేరకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఆఫీసు ట్యాంక్‌బండ్ వద్ద జాతీయ కార్మిక సంఘాల నాయకత్వాన సుమారుగా 1500 మున్సిపల్ శానిటేషన్, మలేరియా కార్మికులు, హెచ్ఎండిఎ కార్మికులు, మున్సిపల్ సూపర్‌వైజర్లు అందరూ ధర్నా నిర్వహించటం జరిగింది. 4 కోడ్‌లను రద్దు చేయాలని, గతంలో స్వాతంత్ర్య పూర్వం కార్మికులు పోరాట ఫలితంగా వచ్చిన చట్టాలను యథావిధిగా కొనసాగాలని 44 చట్టాలు ఉండాలని, 4 కోడ్‌ల వల్ల కార్పొరేట్ శక్తులకే అనుకూలమైన విధంగా ఉన్నది. ఈ కోడ్‌లు అంబానీ, అదానీ భారతదేశ కుబేరులకే అనుకూలంగా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. ఈ సందర్భంగా ఎఐటియుసి మున్సిపల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, పీఆర్సీ వెంటనే ప్రకటన చేయాలని, మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు పర్మినెంట్ కార్మికులకు ఇచ్చే విధంగా 60 సంవత్సరాలు దాటిన వారికి రిటైర్డ్ బెనిఫిట్ క్రింద రూ.20 లక్షలు ఇవ్వాలని కోరారు. ఎఐటియుసి నాయకులు ఎం.మద్దిలేటి, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జిహెచ్ఎంసి అధ్యక్షులు జి.యాదయ్య, కార్యదర్శి కె.కుమార్, లడ్డులాల్, ఎస్ఎఫ్ఎ నర్సయ్య, సిఐటియు విఠల్, మల్లేష్, దశరథ్, హెచ్ఎంఎస్ అంజద్, శ్రీను, ఐఎన్‌టియుసి ఆదిల్‌షరీఫ్‌తో పాటు జిహెచ్ఎంసి నాయకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కాప్రా : కేంద్ర కార్మిక సంఘాలు నేడు తలపెట్టిన దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మె విజయవంతం అయిందని, కార్మిక హక్కులను కాలరాస్తున్న నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. సమ్మె సందర్భంగా ఈసీఐఎల్‌లోని జిహెచ్ఎంసి కార్యాలయం వద్ద కాప్రా మున్సిపల్ కార్మికుల జాక్ ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సమ్మెకు అఖిల భారత యువజన సమాఖ్యగా సంఘీభావం తెలిపారు. ఈ సమ్మెకు నాచారం, హెచ్‌బీ కాలనీ, మల్లాపూర్, చర్లపల్లి కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక విధానాల కారణంగా, పేదరికం, అసమానతలు, ఆకలి, నిరుద్యోగం పెరిగాయన్నారు. కాప్రా మున్సిపల్ కార్మికుల జాక్ నాయకులు మిరియాల సాయిలు, జాన్, శివయ్య, అరవింద్,సాలయ్య, జంగయ్య,మధు,కుమార్, సుదర్శన్, సాయి, ఆంజనేయులు, మోహన్, నర్సింహా, నర్సయ్య, సాలయ్య, లక్ష్మణ్, విజయ్, మహేష్,అనీల్, నాగమణి, మణెమ్మ, లక్ష్మమ్మ, బాలమణి, విజయలక్ష్మి, ఉప్పలమ్మ, సునీత, పుష్పలత పాల్గొన్నారు.

విశాలాంధ్ర - అమనగల్లు: కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ బుధవారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలో సిఐటియు, రైతు సంఘాలు, మున్సిపల్ కార్మికులు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశ వర్కర్లు, అంగన్వాడి, జర్నలిస్టులు, ప్రజాసంఘాల కార్మికుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రం తీసుకొచ్చిన వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అన్నారు. సిఐటియు రాష్ట్ర నాయకులు రామ్మోహన్ జర్నలిస్టుల సంఘం శంకర్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కానుగుల వెంకటయ్య, సిపిఎం ఏరియా కన్వీనర్ శివశంకర్, సిఐటియు నాయకులు పెంటయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం జహంగీర్, కృష్ణయ్య, సురేందర్, తదితర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కాప్రా : కేంద్ర కార్మిక సంఘాలు నేడు తలపెట్టిన దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మె విజయవంతం అయిందని, కార్మిక హక్కులను కాలరాస్తున్న నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, సీపీఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి. సత్య ప్రసాద్ పిలుపునిచ్చారు. సమ్మె సందర్భంగా కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ మల్లాపూర్ శివ హోటల్ కూడలి వద్ద నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, సీపీఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి. సత్య ప్రసాద్‌లి లు మాట్లాడుతూ నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక విధానాల కారణంగా, పేదరికం, అసమానతలు, ఆకలి, నిరుద్యోగం పెరిగాయన్నారు. కార్మికులు పోరాడి, అనేక త్యాగాలు చేసి సాధించుకున్న హక్కులన్నిటినీ రద్దు చేయడానికి నరేంద్రమోదీ ప్రభుత్వం కుయుక్తులు పన్నారన్నారు. నాలుగు కార్మిక కోడ్ల రద్దుతో పాటు, రూ.26,000 కనీస వేతనం, 8గంటల పనిదినం, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, ఆశా, అంగన్వాడి తదితర స్కీం వర్కర్స్ రెగ్యులరైజేషన్, ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సమావేశ నిర్వహణ, మరికొన్ని డిమాండ్ల సాధన కోసం ఈ సమ్మె జరుగుతుందన్నారు. ఏఐటీయూసీ డివిజన్ నేతలు గిరిబాబు, గడ్డం ప్రతాప్, రమేష్, నర్సింహారావు సీపీఐ నేతలు రమణయ్య, రాము,ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నేతలు శేఖర్, అజీమ్ పాషా, సమీర్,రాజు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : కార్మికులను బానిసలుగా తయారు చేసే విధంగా మోడీ తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఏఐటియూసి రాష్ట్ర కార్యదర్శి, ఓరుగంటి యాదయ్య, సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్యలు డిమాండ్ చేశారు. మోడీ తీసుకొచ్చిన లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, కార్మిక హక్కుల ను కాపాడాలని దేశవ్యాప్తంగా ఈరోజు జరిగిన కార్మిక సార్వత్రిక సమ్మెలో భాగంగా తుర్కయంజాల్ చౌరస్తాలో ఏఐటీయూసీ మరియు సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని పెద్ద ఎత్తున నినాదాలతో సమ్మెను జయప్రదం చేస్తూ సాగర్ హైవేపై ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, సిఐటియు నాయకులు మాట్లాడుతూ మోడీ విధానాల వలన కార్మికులకు భద్రత లేకుండా పోతుందని అన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు డి. కిషన్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. శివకుమార్ గౌడ్, ఏఐటీయూసీ నాయకులు గొరిగే నర్సింహా, శ్రీశైలం గౌడ్, దేవా నాయక్ నాగేశ్వర్, శ్రీకాంత్, కృష్ణయ్య, కురుమూర్తి, రాములు, శ్రీను, ఏ ఐ ఎస్ ఎఫ్ నాయకులు శివ, శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్, ప్రకాష్ కారత్, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ ఏఐటీయూసీ మండల కార్యదర్శి టి ఆనంద్ ఆధ్వర్యంలో కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన దేశవాప్త సమ్మె పిలుపులో భాగంగా బుధవారం అరంఘర్ చౌరస్తాలో ర్యాలీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఈ సందర్భంగా ధర్నాను ఉదేశించి మాట్లాడడం జరిగింది. కార్మిక హక్కులను కాలరాస్తున్న నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక విధానాల కారణంగా, పేదరికం, అసమానతలు, ఆకలి, నిరుద్యోగం పెరిగాయన్నారు. సంఘాల రిజిస్ట్రేషన్లు-గుర్తింపు, సమిష్టి బేరసారాల హక్కు, సమ్మె హక్కు, ఆందోళనలు చేసే హక్కులు అన్నీ తీవ్రమైన ప్రమాదంలో పడిపోతాయని వారు ఆవేదన వ్యక్తంచేశారు. బి ఆర్ టి యు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు చెన్నయ్య, రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు జి.సాయిలు, ఏ.రాజు, శ్రీకాంత్, శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్, శ్రీకాంత్, ఎల్లప్ప, వెంకటేష్, శేఖర్, విక్రం, అరుణ్, పెంటయ్య, నరసింహులు, నిరంజన్, మల్లారెడ్డి, కార్తీక్, శోభ, సునీత, లక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - పటాన్ చెరువు : కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలని లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని జాతీయ కార్మిక సంఘాల సమ్మె పిలుపులో భాగంగా రామచంద్రపురం ఈఎస్ఐ హాస్పిటల్ నుండి ప్రధాన రహదారి వరకు భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సిఐటియు నాయకులు నర్సింహారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మిక చట్టాలను మారుస్తూ నాలుగు లేబర్ కోడ్లను తేవడం జరిగిందని వాటిని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. స్వాతంత్రం కంటే పూర్వమే అనేక పోరాటాలు చేసి కార్మిక వర్గం సాధించుకున్నటువంటి చట్టాలను పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చడం దుర్మార్గమన్నారు. కార్మికుల ప్రాణాలు పోయిన పెట్టుబడిదారులు ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం 26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు రాంరెడ్డి, యాదయ్య, సురేష్, లోకేష్, సంతోష, అనురాధ, అమృత, సిద్దు, లక్ష్మి, పోచమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - పటాన్ చెరువు : కార్మికులకు హక్కులను బిజెపి ప్రభుత్వం కాలరాస్తుందని, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ బిజెపి కేంద్ర ప్రభుత్వం కార్మికుల నడ్డి విరుస్తుందని ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు కోలుకూరి నరసింహారెడ్డి విమర్శించారు. జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా మారుస్తున్న దానికి నిరసనగా పటాన్ చెరువు ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పటాన్ చెరువు తహసిల్దార్‌కు వినతిపత్రం బుధవారం అందజేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పనంగా అమ్మడంతో దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారని అన్నారు. శాండ్విక్ హెచ్ ఎం ఎస్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి తోషిబా కార్యదర్శి ఎల్లయ్య హార్టెక్స్ రబ్బర్ ప్రధాన కార్యదర్శి అమర్ యాదవ్ హమాలీ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి రతన్ సింగ్ నాయకులు ఏసియన్ పెయిన్స్ నాయకులు అమర్ సింహా రెడ్డి అంజయ్య బోవెలాల్ ప్రదీప్ రాజు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: నియోజకవర్గం పరిధి 132 జీడిమెట్ల డివిజన్ బిజెపి పార్టీ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి అలివేలు ఆధ్వర్యంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నడుస్తున్న ప్రజాపాలన, సంక్షేమా అభివృద్ధి, సుపరిపాలన మన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ స్థాయి కార్యకర్తల నుండి రాష్ట్ర స్థాయి నాయకుల వరకు పార్టీ బలోపేతం అయిందని తెలిపారు. అలివేలు, సంగీత, శోభా, సుమిత, పార్వతీ, వరలక్ష్మీ, శిరీష, స్వప్న, కళ్యాణి, విజయ, 132 డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

బొమ్మల మహేష్‌కుమార్ గౌడ్‌కి శుభాకాంక్షలు

విశాలాంధ్ర-దుండిగల్: జులై 4వ తేదీన ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే హైదరాబాద్ పర్యటన సందర్భంగా ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన గ్రామ స్థాయి అధ్యక్షుల సమ్మేళన సభ విజయవంతమైన సందర్భంగా బుధవారం టీపీసీసీ అధ్యక్షులు బొమ్మల మహేష్ కుమార్ గౌడ్‌ని సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్.అవిజె జేమ్స్, శ్రావణ్, సిద్ధనోళ్ల సంజీవ రెడ్డి, 8 డివిజన్ల అధ్యక్షులు 125 డివిజన్ ఎండి లాయక్, 126 డివిజన్ గణేష్,127 డివిజన్, శివ కుమార్,128 డివిజన్ పండరి రావు, 129 డివిజన్ సంతోష్,130 డివిజన్ సోమన్నగారి శ్రీధర్ రెడ్డి, 131 డివిజన్ ఎండి జకీర్,132 డివిజన్ బేకు శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి సమయం ఇవ్వండి

విశాలాంధ్ర - బషీర్ బాగ్: రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కలవడానికి ఆప్ ప్రతినిధి బృందానికి సమయం ఇవ్వాలని, లేనిపక్షంలో సచివాలయంలో బైఠాయిస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. ఈ మేరకు అయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కు బహిరంగ లేఖ రాశారు. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందనే లాగా రాష్ట్ర విద్యారంగ సమస్యలు అలాగే ఉన్నాయని, విద్య కమిషన్ సిఫార్సులను అమలు చేయకుండా జాప్యం చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపితం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రవేట్ స్కూల్ల ఫీజుల దోపిడీ అంతులేకుండా జరుగుతుందని చెప్పారు. కాంగ్రెస్ ఎన్నికల మానిఫెస్టో ప్రకారం విద్యారంగానికి రెట్టింపు నిధులను ఎందుకు కేటాయించడం లేదని అయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి ఆప్ ప్రతినిధి కలవడానికి సమయం ఇవ్వాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళలను తీవ్రతరం చేస్తామని డాక్టర్ దిడ్డి సుధాకర్ హెచ్చరించారు.

బోనాల పండుగకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యం లో డిప్యూటీ కమిషనర్ రవి కుమార్‌కు వినతిపత్రం అందచేసిన బీజేపీ నాయకులు రానున్న బోనాలు పండుగను దృష్టిలో ఉంచుకుని జరగనున్న బోనాల పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని శివారంపల్లి, రాజేంద్రనగర్, ఉప్పర్‌పల్లి బుద్వెల్ ఎర్రబొడ ప్రాంతాలలో శానిటేషన్ వీధిదీపాల నిర్వహణ రోడ్ల మరమ్మతులు గుంతల పుడిచివేత ఫాగింగ్ కార్యకలాపాలపై సమగ్ర చర్యలు తీసుకోవాలని కోరారు. రంగారెడ్డి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, సత్యనారాయణ ముదిరాజ్, కోరాని సదానంద్ హరికిషన్, జీ సోల్కర్ రెడ్డి, బండారి బాలకృష్ణ, మల్లేష్ చారి, విజయ్ యాదవ్, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి : ఎంపీ

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : బీసీలకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యకులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఓబీసీ జాతీయ సెమినార్లు జరపాలని జులై 23-24న చలో ఢిల్లీ జాతీయ సదస్సు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ బీసీ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఏపీ అధ్యక్షులు బోను దుర్గ నరేష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంపీ ఆర్.కృష్ణయ్య పాల్గొని చలో ఢిల్లీ జాతీయ సదస్సు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ 75 కోట్లకు పైగా ఉన్న బీసీ వర్గాల చిరకాల డిమాండు కేంద్రం గౌరవించినట్లుగా ఆయన పేర్కొన్నారు. 1931లో బ్రిటిష్ ప్రభుత్వం తీసిన లెక్కల తరువాత నరేంద్ర మోడి ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం తీసుకుందని ఆయన ప్రశంసించారు. కుల గణన తర్వాత బీసీలకు చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్లు, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ, జనాభా ప్రకారం విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు పెంపు వంటి నిర్ణయాలు కూడా తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు జిల్లపల్లి అంజి, విక్రమ్, శారద, కవిత హైందవి, రాందేవ్ మోదీ, తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు వేరే స్థలాన్ని కేటాయించాలి



విశాలాంధ్ర - మొయినాబాద్ : దళితుల భూములపై చేస్తున్న దౌర్జన్యాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రామస్వామి డిమాండ్ చేశారు. మొయినాబాద్ మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామంలో సర్వే నంబర్ 180లో గల 9.14 గుంటలో భూములు కోల్పోతున్న రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్కేపల్లి రైతులపక్షాన సిపిఐ అండగా ఉంటుందన్నారు. సిపిఐ శాసనసభాపక్షా నాయకుడు సాంబశివరావు, జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్యలతో కలిసి సీఎంని కలుస్తామన్నారు. ప్రభుత్వం మొండి పట్టుదల పోకుండా మండలంలోని వేరే స్థలాన్ని గోశాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, బికెఎంయూ జిల్లా అధ్యక్షుడు అంజయ్య, శంకర్‌పల్లి మండల కార్యదర్శి సుధీర్, రైతులు మోహన్ రెడ్డి, శ్యామ్ యాదగిరి, బోనాల ప్రభాకర్, నరేందర్, ఎన్కేపల్లి పోరాట నాయకులు రాకేష్, యాదయ్య పాల్గొన్నారు.

విజయవాడలో

గుంటూరులో జంగాల, వామపక్ష శ్రేణులు

ఒంగోలులో

కార్మికాగ్రహం

- రాష్ట్ర వ్యాప్తంగా భారీ ప్రదర్శనలు
- మోదీకి వ్యతిరేకంగా దద్దరిల్లిన నినాదాలు
- దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ : డా.కె.నారాయణ
- ప్రజా హక్కులు హననం, వ్యవస్థలన్నీ నిర్వీర్యం : రామకృష్ణ
- నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాల్సిందే : రవీంద్రనాథ్

విజయవాడలో ప్రసంగిస్తున్న రవీంద్రనాథ్

విజయనగరంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

కర్నూలులో

రాజమండ్రిలో

కర్నూలులో

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : మోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఏఐటీయూసీ, ఇతర కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో కార్మిక సంఘాల అధ్వర్యాన భారీ ప్రదర్శనలు, ధర్నాలు, సభలు జరిగాయి. మోదీ అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆందోళనకారుల నినాదాలు మిన్నంటాయి. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మోదీని ఇంటికి పంపుతామని హెచ్చరించారు.

దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా తిరుపతిలో అన్ని కార్మిక సంఘాల అధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం నుంచి నాలుగు కాళ్ల మండపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీని అమలు చేస్తూ మోదీ, అమిత్‌షా ప్రజా ద్రోహులుగా మిగిలిపోయారని మండిపడ్డారు. నేడు దేశ వ్యాప్తంగా లక్షల సంఖ్యలో శ్రామికులంతా బజారులోకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారంటే మోదీ ప్రభుత్వం ఎంత దుర్మార్గంగా వ్యవహరిస్తుందో స్పష్టమవుతోందన్నారు. కార్మిక హక్కులన్నిటినీ కాలరాసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం దుర్మార్గమన్నారు. ఆ నాలుగు కోడ్‌ల వల్ల సంఘం పెట్టుకోవడానికి గాని, ప్రశ్నించడానికి కానీ వీలు లేదన్నారు. అంబాని, ఆదానీకి, ప్రభుత్వ సంస్థలను అమ్మేస్తూ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేస్తున్నారని. ప్రజాపోరాటాల ద్వారానే మోదీకి బుద్ధి చెప్పాలని నారాయణ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, కె.శివారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ, సీఐటీయూ రాష్ట్ర నాయకులు కందారపు మురళి, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు పి.వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు. ఒంగోలులో జరిగిన భారీ ప్రదర్శన, సభా కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను, హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను కార్పొరేట్ శక్తుల ఎదుట కట్టు బానిసలుగా మార్చేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. సార్వత్రిక సమ్మెతో అయినా కేంద్ర ప్రభుత్వం దిగొచ్చి, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికాగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ఉద్యోగులను, కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, స్కీం వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ యోచన విరమించుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ, సీఐటీయూ ఒంగోలు నగర కార్యదర్శులు శ్రీరామ్ శ్రీనివాసులు, మహేష్ అధ్యక్షత వహించగా, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు ఎం.ఎల్.నారాయణ, ఎస్.కె.మాబు, ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, చీకటి శ్రీనివాసరావు, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాల్సిందే : రవీంద్రనాథ్

నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాల్సిందేనని, లేకుంటే మోదీ ప్రభుత్వానికి కాలం చెల్లినట్లేనని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ హెచ్చరించారు. కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘాలు ఇచ్చిన జాతీయ సార్వత్రిక సమ్మె విజయవంతం అయిందన్నారు. దేశ వ్యాప్త పిలుపు మేరకు విజయవాడలో రథం సెంటర్ నుంచి లెనిన్ సెంటర్ వరకు వేలాది మంది కార్మికులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం లెనిన్ సెంటర్‌లో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మూలే సాంబశివరావు, సీఐటీయూ ఉపాధ్యక్షులు దుర్గారావు అధ్యక్షతన జరిగిన సభలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు, రైతు సంఘాల కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, రైతు సంఘాల నాయకులు కేశవరావు, యలమందరావు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి.గౌతమ్ రెడ్డి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రసాదు, రాష్ట్ర నాయకులు జాస్తి కిషోర్, ఏఐయుటీయూసీ రాష్ట్ర కార్యదర్శి కె.సుధీర్ బాబు, సీపీఐ విజయవాడ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పోరాటం : ఈశ్వరయ్య

కార్మిక హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పోరాటం జరుగుతోందని, మోదీ ప్రభుత్వం కార్మికాగ్రహానికి గురికాక తప్పదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య హెచ్చరించారు. విజయనగరంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్ రంగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ అధ్వర్యంలో స్థానిక గంట స్థంభం నుంచి స్టేట్ బ్యాంక్ దగ్గర ఉన్న గాంధీ విగ్రహం వరకు కార్మికులు నిర్వహించిన భారీ ర్యాలీని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఓమ్మి రమణ, సహాయ కార్యదర్శి ఆలమండ ఆనందరావు, కె.స్రవంతి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలకు సమ్మె గొడ్డలిపెట్టు : జంగాల, వెలుగూరి

సార్వత్రిక సమ్మె కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు గొడ్డలి పెట్టని, రానున్న రోజుల్లో కార్మికులు, కర్షకులు ఐక్యంగా మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా గుంటూరు నగరంలో శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి బి.ఆర్ స్టేడియం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు, బ్యాంక్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిషోర్, బాషా, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ నగర అధ్యక్షులు రావుల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు. పెదకాకానిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర భవన నిర్మాణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ, రెంటాల కుమారి పాల్గొన్నారు.

విజయనగరంలో...: విజయనగరంలో సెంట్రల్ బ్యాంకు నుంచిగంట స్థంభం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు, పీఏసీఎస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రెడ్డి సత్యారావు, బి.రాము నాయుడు, టి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

నంద్యాలలో...: కార్మికులు, కష్టజీవులు, రైతులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేస్తే సహించేది లేదని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్ బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు హెచ్చరించారు. దేశ వ్యాప్త కార్మిక సమ్మెలో భాగంగా నంద్యాల పట్టణంలో పట్టణ కార్యదర్శులు శ్రీనివాసులు, లక్ష్మణ అధ్యక్షతన మార్కెట్ యార్డ్ నుంచి గాంధీ చౌక్ వరకు జరిగిన భారీ ర్యాలీ నుద్దేశించి వారు ప్రసంగించారు.

కర్నూలులో...: కార్మిక సంఘాల అధ్వర్యంలో జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి లలితమ్మ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు, నిర్మలమ్మతో పాటు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీహార్ రాజధాని పట్నాలో మీడియాతో మాట్లాడుతున్న రాజా

ఢిల్లీలో ఆందోళన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న రావుల వెంకయ్య. వేదికపై అమరజిత్‌కౌర్ తదితరులు

తిరువనంతపురం ప్రదర్శనలో సీపీఐ నేత వినయ్ విశ్వం తదితరులు

'ఉపాధి'కి బడ్జెట్‌లో రూ.2.60 లక్షల కోట్లు

ఆవుల శేఖర్ డిమాండ్

విశాలాంధ్ర -వెల్దుర్తి: ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్‌లో రూ.2.60 లక్షల కోట్లు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. వామపక్ష వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపుమేరకు దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా గ్రామీణ హర్తాళ్‌ను కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం బోయిన పల్లెలో వ్యవసాయ కూలీలతో కలిసి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ... 200 ఉపాధి పని దినాలు కల్పించి రోజు కూలి రూ.600 ఇవ్వాలన్నారు. గ్రామీణ పేదలకు కుటుంబానికి రెండు ఎకరాల భూమి ఇవ్వాలన్నారు. పేదలకు ఆహార భద్రత కల్పించాలన్నారు. రేషన్ కార్డులో ఉన్న ప్రతి ఒక్కరికి 10 కేజీల బియ్యం ఇవ్వాలని, విద్యుత్ ప్రైవేటీకరణ ఆపాలని, స్మార్ట్ మీటర్ల విధానం తీసివేయాలని, గిరిజన, దళితులపై జరుగుతున్న దాడులను ఆపాలని, లేబర్ కోడ్లను రద్దు చేయాలని, రైతులకు ఉరితాళ్లుగా మారుతున్న మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని, కౌలు రైతుల చట్టం చేయాలని, వ్యవసాయ కార్మికులు, కౌలుదారులకు నెలకు రూ.10 వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అప్రజాస్వామిక విధానాలను అనుసరిస్తుందన్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, మహిళల చట్టాలను కాలరాస్తున్నారని మండిపడ్డారు. పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో కొత్త చట్టాలను తీసుకొస్తుందని ఆరోపించారు. అదాని, అంబానీలకు దేశ సంపద అప్పనంగా కట్టబెడుతున్నారని విమర్శించారు. ఉపాధి చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి పేదలకు ప్రభుత్వమే గృహ నిర్మాణం చేపట్టాలన్నారు. సీపీఐ మండల కార్యదర్శి టి. కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వెంకటేష్, శివ పాల్గొన్నారు.

రైతుల పక్షాన ఉద్యమిస్తాం

మామిడి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి: జగన్

విశాలాంధ్ర -చిత్తూరు: రాష్ట్రంలో నేడు ఏ పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు కన్నీళ్లు పెడుతున్నారని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విమర్శించారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో బుధవారం మామిడి రైతుల ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మామిడి రైతుల సమస్యలను తెలుసుకోవడానికి వస్తే... తనను రైతులు కలవడానికి వీలు లేకుండా పోలీసులు ఆంక్షలు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వమే రైతుల పై కుట్రలు చేయడం దారుణం అన్నారు. రైతులను రౌడీషీటర్లుగా పోలుస్తారా అని నిలదీశారు. రైతుల జీవితాలను నాశనం చేయడానికి కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తుందని అన్నారు. రైతుల కష్టాలు తెలుసుకోవడానికి తాను బంగారుపాళ్యానికి వస్తే తప్పేంటని ప్రశ్నించారు. వేల మంది పోలీసులను మోహరించి తన పర్యటనను అడ్డుకోవడం దారుణంఅన్నారు.రాష్ట్రంలో ఏ పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత జిల్లాలో మామిడి రైతుల పరిస్థితి ఇంత దయనీయంగా ఉంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. నేడు చిత్తూరు జిల్లాలో కిలో మామిడి రెండు రూపాయలకే రైతులు అమ్ముకోవాల్సిన దయనీయ పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నట్లు ప్రకటించినా ఎక్కడ ఆచరణలోకి రాలేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కిలో 22 నుంచి

29 రూపాయలు వరకు కొనుగోలు చేశామన్నారు. కర్నాటకలో రూ.16 చొప్పున కేంద్రం కొనుగోలు చేస్తుంటే ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యమంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. చిత్తూరు జిల్లాలో మామిడి ఉత్పత్తులపై ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. తమ హయాంలో ఏర్పాటుచేసిన రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. రాష్ట్రంలో రైతులకు పెట్టుబడి సాయంతో పాటు ఇన్పుట్ సబ్సిడీ కూడా అందలేదన్నారు. రైతులను అన్ని విధాలుగా దగా చేస్తున్నట్లు చెప్పారు. మామిడి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి రైతుకు వైసీపీ అండగా ఉంటుందని చెప్పారు. కూటమి ప్రభుత్వ ప్రలోభాలకు. లంచాలకు పోలీసులు లొంగొద్దని, రేపు మిమ్ములను కూడా చంద్రబాబు మోసం చేస్తారన్నారు.రాబోయేది జగన్ ప్రభుత్వమేనని, ఇది గుర్తుపెట్టుకోవాలని పోలీసులకు సూచించారు.

అన్నదాతలపై లాఠీచార్జి చేస్తారా... ఎస్పీతో జగన్ వాగ్వాదం

జగన్ బంగారుపాళ్యం పర్యటన నేపథ్యంలో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. మామిడి రైతుల సమస్యలను తెలుసుకోవడానికి మార్కెట్ యార్డుకు వచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు అనేకచోట్ల ఆంక్షలుపెట్టారు. చెక్ పోస్టులు ఏర్పాటుచేసి వైసీపీ కార్యకర్తల వాహనాలను కట్టడి చేశారు. దీంతో వారంతా కాలినడకనే యార్డుకు తరలివచ్చారు. హెలిపాడ్ నుంచి మాజీ సీఎం కాన్వాయ్... మార్కెట్ యార్డ్ కు బయలుదేరిన క్రమంలో భారీ సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలను కట్టడి చేయడానికి పోలీసులు స్వల్పంగా లాఠీచార్జ్ చేయడంతో పరిస్థితి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గాయపడ్డ కార్యకర్తలను జగన్ పరామర్శించే ప్రయత్నాన్ని జిల్లా ఎస్పీ అడ్డుకోవడంతో జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులపై లాఠీచార్జి చేస్తారా అని ప్రశ్నించారు. రైతు సమస్యలను తెలుసుకోవడానికి వస్తే అనేక ఆంక్షలు పెట్టడం ఏమిటని నిలదీశారు. రోడ్ షోకు, బహిరంగ సభకు అనుమతి లేదని ఆంక్షలు విధించారు. హెలిపాడ్ వద్ద కేవలం 30 మందికి, మార్కెట్ యార్డ్‌లో 500 మంది రైతులకు అనుమతిస్తున్నట్లు పోలీసులు ముందస్తుగా ప్రకటించారు. అయితే ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలిరావడంతో వారిని నియంత్రించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.